www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 9-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 191 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా.10.55 తదుపరి చవితి; నక్షత్రం: భరణి రా.8.02 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.7.15-8.40; దుర్ముహూర్తం: ఉ.10.05-10.51, మ.2.46-3.33; అమృతఘడియలు: మ.3.46-5.11; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.10; సూర్యాస్తమయం: 5.54 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కుల వివక్షకు దళిత ఐపీఎస్ బలి

తెలుగువాడైన హరియాణా ఏడీజీపీ పూరన్ కుమార్ ఆత్మహత్య



- చండీగఢ్‌లో సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం
- వెంటాడి వేధించిన సీనియర్ అధికారులు
- తాజాగా మద్యం కాంట్రాక్టరు ఫిర్యాదుతో నమోదైన లంచం కేసులో కుమార్ పేరు
- ఎనిమిది పేజీల సూసైడ్ నోట్ రాసిన ఐపీఎస్

2



అడ్లూరికి పొన్నం క్షమాపణలు

- ఆయన్ను ఉద్దేశించి తానేమీ అనలేదని వెల్లడి
- టీపీసీసీ చీఫ్ చొరవతో సద్దుమణిగిన వివాదం
- సమస్య ఇంతటితో ముగిసిపోయింది: అడ్లూరి
- మంత్రులు బాధ్యతగా మాట్లాడాలి: మహేశ్


హైదరాబాద్/కరీంనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌ల మధ్య వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. చినికి చినికి గాలివానలా మారిన ఈ వివాదం.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ చొరవతో టీ కప్పులో తుపానులా తేలిపోయింది. మహేశ్‌గౌడ్ నివాసంలో అడ్లూరి లక్ష్మణ్‌కు పొన్నం క్షమాపణ చెప్పడంతో వివాదం సమసిపోయింది. మంగళవారం మంత్రులిద్దరితో మాట్లాడిన మహేశ్‌గౌడ్.. బుధవారం తన నివాసానికి రావాలని ఇద్దరికీ సూచించారు. ఈ నేపథ్యంలో మంత్రులిద్దరూ ఉదయం మహేశ్‌గౌడ్ ఇంటికి వెళ్లారు. ఆయన సమక్షంలో పొన్నం, అడ్లూరి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజ్‌ఠాకూర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, పార్టీ నేతలు ఈరవత్రి అనిల్, శివసేనారెడ్డి, వినయ్‌కుమార్‌లూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బయట ప్రచారం జరుగుతున్నట్లుగా మంత్రి అడ్లూరిని ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదన్నారు. కానీ, జరిగిన ప్రచారానికి ఆయన బాధపడ్డారని చెప్పారు. ఇందుకుగాను వ్యక్తిగతంగా అడ్లూరి లక్ష్మణ్‌కు తాను క్షమాపణలు

మిగతా 13వ పేజీలో...

బీసీ రిజర్వేషన్ల అమలుకు

జీవో ఎలా ఇచ్చారు?

తమిళనాడు తరహాలో రిజర్వేషన్ల సవరణ చట్టాన్ని ఏమైనా నోటిఫై చేశారా?



- బిల్లులు గవర్నర్ ఆమోదించకున్నా ఆమోదించినట్లు భావించి గెజిట్ ఇచ్చారా?
- అంతకుముందు ఇచ్చిన ఆర్డినెన్స్‌లు గెజిట్ అయ్యాయా?
- 50% పరిమితిని ఎలా అధిగమిస్తారు?
- రాష్ట్రం యూనిట్‌గా బీసీలకు 42శాతం ఎలా ఇస్తారు?
- డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చే ముందు అభ్యంతరాలు ఏమైనా స్వీకరించిందా?
- సదరు నివేదికను పబ్లిష్ చేశారా?.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ప్రశ్నలు
- తెలుసుకుని చెప్తామన్న ఏజీ సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి
- తదుపరి విచారణ నేటి మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా
- విచారణకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు.. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున జోక్యం చేసుకోవద్దని హైకోర్టుకు ప్రభుత్వ విజ్ఞప్తి
- బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా కేసులో ఇంప్లీడ్ అవ్వండి
- బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్‌లకు మంత్రి పొన్నం వినతి

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42శాతం స్థానిక రిజర్వేషన్ల జీవోను ఏ ప్రాతిపదికన జారీ చేశారని హైకోర్టు ప్రశ్నించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50% దాటకూడదన్న సూత్రాన్ని ఎలా అధిగమిస్తారని నిలదీసింది. ఈ మేరకు పలు కీలక ప్రశ్నలను సంధించింది. ఆ వివరాలను తెలుసుకుని చెబుతామని అడ్వకేట్ జనరల్ కోరడంతో.. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకుండా, విచారణను గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో బుధవారం వాదనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీలకు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం కీలక ప్రశ్నలు సంధించింది. "తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలో రిజర్వేషన్లు గరిష్ఠంగా 50% దాటరాదన్న నిబంధనను సవరించే బిల్లును అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపారు. గవర్నర్ ఆమోదం తెలపకున్నా స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల జీవో ఇచ్చారు. బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకున్నా తెలిపినట్లు భావించి (డీమ్డ్ కన్సెంట్) తమిళనాడు తరహాలో సవరణ చట్టాన్ని ఏమైనా నోటిఫై చేశారా? లేక బిల్లుల కంటే ముందు జారీచేసిన ఆర్డినెన్స్‌ను గెజిట్ చేశారా? 'వికాస్ కిషన్‌రావు గవాలీ వర్సెస్ మహారాష్ట్ర' కేసులో

మిగతా 13వ పేజీలో...

నేడే 'స్థానికం' తొలివిడత నోటిఫికేషన్!

- 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నిక
- నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచే మొదలు
- పార్టీల గుర్తులతో ఎన్నికలు.. పూర్తయిన ఏర్పాట్లు

13



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా

నవీన్ యాదవ్

- ఆమోదం తెలుపుతూ ఏఐసీసీ ప్రకటన
- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో నవీన్
- నవ యువ నిర్మాణ్ పేరుతో స్వచ్ఛంద సంస్థ
- యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు
- 2014 ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిగా పోటీ

హైదరాబాద్, బంజారాహిల్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిగా వల్లాల నవీన్ యాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. ఈ మేరకు అఖిల భారత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. సామాజిక కార్యకర్త చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడైన నవీన్ యాదవ్ విద్యార్థి దశ నుంచే చురుకుగా రాజకీయాల్లో

మిగతా 12వ పేజీలో...

దీపావళిలోపు 300 కోట్లు విడుదల చేస్తాం

- బకాయిలపై ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం హామీ.. సమ్మె వాయిదా
- విడుదల చేయకుంటే 23 నుంచి సమ్మె!

14

హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణకు

రూ.10వేల కోట్లు

- ఆందోల్ మైసమ్మ గుడి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ గుడి దాకా
- ఆరు లేన్ల వెడల్పు.. 231.32 కిలోమీటర్ల పొడవుతో హైవే విస్తరణ
- ఒక్కో కి.మీ.కి 44.92 కోట్ల వ్యయం.. ప్రాథమిక డీపీఆర్‌లో వెల్లడి
- నవంబరు రెండో వారానికి తుది డీపీఆర్.. మార్చి నాటికి టెండర్లు
- హైవే విస్తరణలో భాగంగా ఎన్ని చెట్లు, విద్యుత్ స్తంభాలు తొలగించాలన్న వివరాలు ఇవ్వాలని ఆయా శాఖలకు ఆదేశాలు
- మౌలిక సదుపాయాల ఏర్పాటుపైనా వివరాల కోసం ఆరా



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)ని 6 వరుసలుగా విస్తరించడానికి గాను డీపీఆర్ తయారీని నవంబరు మొదటి లేదా రెండో వారంలోగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. డీపీఆర్‌ను నవంబర్‌లో పూర్తిచేసి, మార్చి నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. హైవేను తెలంగాణ పరిధిలోని దండుమల్కాపూర్ దగ్గరున్న ఆందోల్ మైసమ్మ

మిగతా 12వ పేజీలో...



వేలంలో విక్రయించిన స్థలం ఇదే..

గజం రూ.2.47 లక్షలు

- కేపీహెచ్‌బీలో వాణిజ్య స్థలానికి వేలంలో పలికిన ధర
- 3 నెలల క్రితం అక్కడే వేలంలో గజం రూ.3 లక్షలు

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటి.. కేపీహెచ్‌బీ కాలనీ! అక్కడ జేఎన్‌టీయూ నుంచి హైటెక్‌సిటీకి వెళ్లే దారిలో చైతన్య ఫుడ్ కోర్టును ఆనుకొని ఉన్న 726 గజాల కమర్షియల్ స్థలాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు వేలం వేయగా.. చదరపు గజం రూ.2,47,500 పలికింది! ఈ స్థలం కొనుగోలుకు నాలుగు బిడ్లు మాత్రమే రాగా.. పామయ్యగారి శ్రీనివాస్ గౌడ్, బాలరాజ్ గౌడ్, కుమార్ గౌడ్, భూపాల్‌కు దక్కింది. ఇదే కేపీహెచ్‌బీలో 3 నెలల క్రితం హౌసింగ్ బోర్డు అధికారులు వేలం వేస్తే చదరపు గజం దాదాపు రూ.3 లక్షలు పలికింది. అత్యంత ప్రధాన ప్రాంతంలో ఉన్న కమర్షియల్ స్థలం ఇంత తక్కువ ధరకు పోతుందని స్థానికంగా ఉన్న బిల్డర్లు, వ్యాపారులు ఊహించలేదు.

భూముల విలువల మదింపు పూర్తి

- ప్రస్తుత విలువపై 2.5 రెట్ల మేర పెంచాలని అధికారుల ప్రతిపాదన
- మార్కెట్ విలువలో 60% దాటకుండా పెంపు
- స్థానిక ఎన్నికల అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం

12

భారత్ దాల్.. అంతా గోల్‌మాల్

- తెలంగాణకు 50 వేల టన్నుల శనగలు కేటాయించిన కేంద్రం
- రూ.300 కోట్ల విలువైన శనగలు విక్రయించిన 'హాకా'
- నేరుగా ప్రైవేటు ట్రేడర్లకు విక్రయించడంతో ఫిర్యాదులు
- రెండేళ్ల తర్వాత ఐటీ దాడులతో అక్రమార్కుల్లో గుబులు
- ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ తనిఖీలు
- కందిపప్పు వ్యాపారానికి పన్ను చెల్లించని ఏజెంట్ వెంకటేశ్వరరావు
- బంగారు బిస్కెట్లు కొనుగోలుపై ఆరా తీయడంతో వెలుగులోకి



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత్ దాల్ సరఫరాలో ట్రేడర్లు పన్ను ఎగవేసిన ఉదంతం వెలుగులోకి రావడంతో.. రాష్ట్రంలో ఈ పథకం సక్రమంగా అమలుకాని విషయం మరోసారి చర్చకు వస్తోంది. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన భారత్ దాల్ పథకంలో భాగంగా తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల శనగలను కేటాయించింది. వాటిని మిల్లింగ్ చేసి పప్పుగా మార్చి, ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి వినియోగదారులకు సబ్సిడీపై విక్రయించాలి. కానీ, ఇవేమీ చేయకుండా కేంద్రం నుంచి వచ్చిన శనగలను నేరుగా బహిరంగ మార్కెట్లో ట్రేడర్లకు

మిగతా 12వ పేజీలో...

ముగ్గురు శాస్త్రవేత్తలకు

రసాయనశాస్త్ర నోబెల్

- ఎంవోఎఫ్‌లను అభివృద్ధి చేసిన సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు సంయుక్తంగా..
- వాయువుల నిల్వ, ఎడారి గాలుల నుంచి నీటి సంగ్రహణలో ఎంవోఎఫ్‌లు కీలకం

2

భారత్‌కు బ్రిటన్ ప్రధాని

- నేడు స్టార్మర్‌తో భేటీ కానున్న ప్రధాని మోదీ
- వాణిజ్య భాగస్వామ్య ఒప్పందాలు, పెట్టుబడులే లక్ష్యంగా జరగనున్న చర్చలు

2

రెండేళ్లలోపు పిల్లల కోసం

దగ్గు సిరప్‌లు అమ్మొద్దు!

2

- ఫార్మసీలకు ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆదేశం
- ఔషధాలను కట్టుదిట్టంగా పరీక్షించాలని రాష్ట్రాలకు డీజీహెచ్ఎస్ ఆదేశాలు
- రాష్ట్రంలో మరో రెండు దగ్గు మందులపై నిషేధం

14



నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1 ప్రారంభోత్సవంలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీతో ప్రధాని మోదీ

ముంబై ఉగ్రదాడుల తర్వాత..

పాక్‌పై సైనిక చర్య వద్దన్నదెవరు?

- ప్రజలకు కాంగ్రెస్ జవాబు చెప్పాలి: ప్రధాని నరేంద్ర మోదీ
- మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యలు ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై ధ్వజం
- నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని
- కప్పు టీ కంటే 1జీబీ డేటా చవక.. పెట్టుబడులకు స్వర్గధామం భారత్
- ఇండి మొబైల్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభోత్సవంలో మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముంబైలో 26/11 ఉగ్రదాడులు తర్వాత పాకిస్థాన్‌పై భారత్ సైనిక చర్య ఎందుకు చేపట్టలేదో కాంగ్రెస్ పార్టీ చెప్పాలని బుధవారం డిమాండ్ చేశారు. ఓ విదేశీ శక్తి నుంచి వచ్చిన

మిగతా 2వ పేజీలో...

తెలంగాణ 'టీ -ఫైబర్' గ్రామాలు దేశానికే ఆదర్శం

- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి సింధియా ప్రశంస
- గ్రామాలు, పట్టణాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం: దుద్దిళ్ల

12

పాక్‌కు అమెరికా క్షిపణులు

- అత్యాధునిక ఏఐఎమ్-120ల విక్రయానికి ఒప్పందం ఖరారు!
- క్షిపణుల అమరికకు వీలుగా ఎఫ్-16లను ఆధునికీకరించనున్న అమెరికా
- బాలాకోట్‌పై దాడులకు ప్రతీకారంగా ఈ మిసైల్‌తోనే నాడు పాక్ ప్రతిదాడి
- ఇప్పుడు భారీగా సమకూర్చుకునే యత్నం.. డాన్ పత్రిక కథనం



వాషింగ్టన్, అక్టోబరు 8: అత్యాధునిక ఏఐఎమ్-120 క్షిపణులను పాకిస్థాన్‌కు అమెరికా అందించనున్నట్టు తెలిపింది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాన్ని ఛేదించే మధ్యశ్రేణి క్షిపణులివి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఈ ఏడాది మేలో యుద్ధ విరమణ తర్వాత అమెరికాకు దాయాది దేశం దగ్గరయిన నేపథ్యంలో భారీ ఆయుధ ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఇదే పని మీద గత జూలైలో పాకిస్థాన్ వాయుసేన చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ అమెరికాకు వెళ్లారు. ఈ సందర్భంగా కుదిరిన ఆయుధ ఒప్పందాన్ని ధ్రువీకరిస్తూ అమెరికా రక్షణశాఖ నోటిఫికేషన్ జారీచేసినట్టు సమాచారం. ఆ నోటిఫికేషన్‌లో ఏఐఎమ్-120 కొనుగోలుదారుల జాబితాలో తక్కినదేశాలతోపాటు పాక్ పేరును కూడా అమెరికా చేర్చిందంటూ డాన్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఏఐఎమ్-120లో సీ8, డీ అనే రెండు తరాల క్షిపణులున్నాయి. ఇందులో డీ తరహావి అమెరికా సైన్యం వినియోగిస్తోంది. వాటితో పోల్చితే సీ8 మరింత

మిగతా 2వ పేజీలో...

బాణసంచా కేంద్రంలో

భారీ విస్ఫోటనం

- ఏడుగురు దుర్మరణం.. మృతుల్లో తయారీ కేంద్రం యజమాని కూడా..
- ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లా రాయవరంలో విషాదం
- దీపావళి ఆర్డర్లకు పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగసిపడి కేంద్రంలో పేలుళ్లు

అమలాపురం/మండపేట/రాయవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం భారీ విస్ఫోటనం సంభవించింది. దీపావళి ఆర్డర్ల కోసం పనిచేస్తున్న ఏడుగురు కూలీలు అగ్నికి ఆహుతయ్యారు. పండగ దగ్గర పడటంతో తానే దగ్గరుండి పనులు చేయిస్తున్న యజమాని సైతం ఈ ప్రమాదంలో మృత్యువాతపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విస్ఫోటనం ధాటికి తయారీ కేంద్రంలోని గోడ కూలిపోయింది. ఆ గోడ కింద మరికొందరు కూలీలు చిక్కుకుపోయినట్టు భావిస్తున్నారు. పేలుడు తీవ్రతకు సమీపంలోని గృహాలు కంపించిపోయాయి. వివరాల్లోకి వెళితే.. రాయవరం శివారు ప్రాంతంలో

మిగతా 10వ పేజీలో...

పాక్‌కు అమెరికా క్షిపణులు

(మొదటిపేజీ తరువాయి)

ఆధునికమైనది. వీటిని తయారుచేసే ఆయుధ సంస్థకు ఇప్పటికే 41.6 మిలియన్ల డాలర్ల విలువైన ఆర్డర్‌ను ఇచ్చినట్టు అమెరికా రక్షణ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు 30న పత్రికలకు విడుదల చేసిన ప్రకటనను ఉటంకిస్తూ డాన్ పత్రిక తెలిపింది. మొత్తం కాంట్రాక్టు విలువ 2.51 బిలియన్ డాలర్లు. తయారీ పూర్తయి ఈ క్షిపణులు పాక్ సహా కొనుగోలుదేశాలకు 2030 మేకు గాని చేరవు. వాటిలో ఎన్ని పాక్‌కు అమెరికా ఇవ్వనున్నదనేది స్పష్టత లేదు. అయితే, ఈ సందర్భంగా పాక్ వాయుసేనకు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలను అమెరికా ఆధునీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే, పాక్ వద్ద ఉన్న యుద్ధ విమానాల్లో ఎఫ్-16లు మాత్రం ఏఐఎమ్-120 అమరికకు అనువైనవంటూ ఆర్మీ వర్గాలను ఉటంకిస్తూ డాన్ పత్రిక కథనం తెలిపింది. ఈ రకం క్షిపణులను కొన్నింటిని గతంలో పాక్ ఉపయోగించింది. బాలాకోట్‌లోని జైషే మహ్మద్ శిబిరాన్ని కూల్చివేసి, పెద్దఎత్తున ముష్కరులను భారత్ మట్టుబెట్టిన నేపథ్యంలో 2019లో ఈ క్షిపణులతోనే పాక్ ప్రతిదాడులకు దిగింది. ఇప్పుడు వాటిని పెద్ద ఎత్తునే దాయాది దేశం సమకూర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

కుల వివక్షకు దళిత ఐపీఎస్ బలి

- తెలుగువాడైన హరియాణా ఏడీజీపీ పూరన్ కుమార్ ఆత్మహత్య
- 8 పేజీల సూసైడ్ నోట్ రాసిన ఐపీఎస్

చండీగఢ్, అక్టోబరు 8: హరియాణా పోలీసు శాఖలో కుల వివక్ష తెలుగువాడైన ఓ సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి ప్రాణాలు తీసింది. పలువురు సీనియర్ అధికారులు వెంటాడి మానసికంగా వేధించడంతో భరించలేక ఆ ఐపీఎస్ సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది హరియాణా ఏడీజీపీ వై పూరన్ కుమార్ విషాదాంతం. మంగళవారం మధ్యాహ్నం చండీగఢ్ సెక్టార్ 11లోని తన బావమరిది నివాస భవనం సౌండ్‌ప్రూఫ్ బేస్‌మెంట్‌లో కుమార్ బలవన్మరణానికి పాల్పడ్డారు. రక్తపు మడుగులో ఉన్న కుమార్ మృతదేహాన్ని ఆయన కుమార్తె గుర్తించింది. పోలీసు శాఖలో కుల వివక్ష సహా పలు అక్రమాలకు వ్యతిరేకంగా గళమెత్తి పోరాడిన కుమార్... పలువురు సీనియర్ అధికారులు పగబట్టి వేధించడం... చివరకు ఓ లంచం కేసులో ఇరికించడంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వారు తనను మానసికంగా ఎలా వేధించిందీ కుమార్ 8 పేజీల సూసైడ్ నోట్‌లో రాశారు. తన కెరీర్‌ను నాశనం చేయడానికి కుట్ర పన్నారని పేర్కొన్నారు. ఆ అధికారులు ఎవరనేది చండీగఢ్ పోలీసులు ఇంకా వెల్లడించలేదు. వారిలో కొందరు రిటైరైన అధికారులు కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వేధింపులకు తోడు తాజాగా ఓ మద్యం కాంట్రాక్టర్ ఫిర్యాదుతో నమోదైన లంచం కేసులో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా కుమార్ పేరును కూడా చేర్చారు. ప్రాధాన్యం లేని పోస్టుకు బదిలీ చేశారు. ఈ పరిణామాలతో కుమార్ కలత చెందినట్లు తెలుస్తోంది. కుమార్ పేరు చెప్పి అతని సహాయకుడైన సుశీల్ రూ.2.5 లక్షలు లంచం అడిగాడని ఆ మద్యం కాంట్రాక్టర్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాంతో రోహతక్ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో కుమార్ పేరును కూడా చేర్చారు. సొంత శాఖలో కుల వివక్ష, అక్రమాలు, అన్యాయాలను నిలదీసిన కుమార్‌ను టార్గెట్ చేసిన సీనియర్ అధికారులు అతన్ని ఇరికించడానికి ఇదే అదనుగా వారు భావించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి. 2008లో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి వేధింపులపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దళిత అధికారులపై వివక్షపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. తాను ప్రభుత్వానికి సన్నిహితుడినని చెప్పుకున్న ఓ ఐపీఎస్ అధికారికి గత హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టింగు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కూడా ఈసీకి ఫిర్యాదు చేశారు. గతంలో ఐపీఎస్ అధికారుల పదోన్నతుల్లో అక్రమాలపై హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీకి లేఖ రాశారు. ఉత్తమ సేవలకు రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం అందుకున్నారు. పూరన్ భార్య అమనీత్ కుమార్ 2001 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్న సీఎం సైనీ నేతృత్వంలోని అధికారుల బృందంలో ఆమె కూడా ఉన్నారు.

సీజేఐపై బూటు విసరడం.. రాజ్యాంగంపై దాడే!

- జస్టిస్ గవాయ్ సోదరి, తల్లి వ్యాఖ్యలు



సీజేఐ సోదరి కీర్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 8: సీజేఐ జస్టిస్ గవాయ్ లక్ష్యంగా కోర్టు హాలులో ఓ న్యాయవాది బూటు విసిరిన ఘటనను సీజేఐ కుటుంబ సభ్యులు ఖండించారు. ఈ ఘటనను రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని చెప్పారు. ఇలాంటి విపరీత ప్రవర్తనలను కచ్చితంగా అడ్డుకోవాలని.. లేదంటే భావితరాలు మనల్ని క్షమించబోవని జస్టిస్ గవాయ్ సోదరి కీర్తి, తల్లి కమల అన్నారు. ప్రజలు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని కోరారు. న్యాయవాది రాకేశ్ కిశోర్ సీజేఐ లక్ష్యంగా బూటు విసరగా.. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది దాన్ని అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఆయన సోదరి కీర్తి.. ఇలాంటి విపరీత ప్రవర్తన కలిగిన వారిని క్షమించకూడదని వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. ఇది విషపూరిత సిద్ధాంతాలతో చేసిన దాడి అన్నారు.

సీజేఐ పైకి బూటు విసిరింది అసద్ అయితే..?

- కేసు పెట్టకుండా ఊరుకునేవారా?: ఒవైసీ



న్యూఢిల్లీ, అక్టోబరు 8: సీజేఐపై బూటు విసిరిన ఘటనపై మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనకు మతం రంగు పులుముతూ బీజేపీని ప్రశ్నించారు. నిందితుడు రాకేశ్ కిశోర్‌పై కేసు నమోదు చేయకుండా కేంద్రం పక్షపాతం చూపిందని విమర్శించారు. సుప్రీంకోర్టుకు రెండో దళిత ప్రధాన న్యాయమూర్తి అయిన గవాయ్‌పై బూటు విసిరిన వ్యక్తి మీద కేసెందుకు పెట్టలేదని ఒవైసీ ఎక్స్‌లో ప్రశ్నించారు. "బూటు విసిరిన వ్యక్తి పేరు రాకేశ్ కిశోర్ కాకుండా అసద్ అయి ఉంటే? పోలీసులు, బీజేపీ నేతలు ఏం చేసేవారు? వెంటనే అతన్ని అరెస్టు చేయండి. పొరుగు దేశంతో, ఐఎస్ఐతో ఉన్న సంబంధాలను వెలికితీయమని చెప్పేవారు. మోదీజీ మీరే చెప్పండి. నిందితుడిపై చర్యలు తీసుకునే బాధ్యత మీ ప్రభుత్వానికి లేదా?" అని ఒవైసీ పేర్కొన్నారు.

భారత్‌తో సంబంధాలను పునరుద్ధరించండి

- డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా చట్టసభ్యుల వినతి

వాషింగ్టన్, అక్టోబరు 8: అగ్రరాజ్యం అమెరికా.. భారత్‌పై ఎడాపెడా సుంకాలను బాదడంతో ఇరు దేశాల మధ్య సంబంధాలపై ప్రభావం పడిన నేపథ్యంలో అమెరికా చట్టసభ్యులు కొందరు అధ్యక్షుడు ట్రంప్‌నకు ఓ లేఖ రాశారు. భారత్‌తో సంబంధాలను పునరుద్ధరించాలని అందులో కోరారు. సుంకాల విధింపు చైనా, రష్యాలకు భారత్‌ను దగ్గర చేసినట్టు పేర్కొన్నారు. ఈ లేఖ రాసిన 19 మంది చట్టసభ్యుల్లో ఇండియన్-అమెరికన్ సభ్యులు కూడా ఉన్నారు. ఇటీవల 'మీ యంత్రాంగం తీసుకున్న చర్యలతో ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంతో సంబంధాలు దెబ్బతిన్నాయని, ఇరు దేశాలకు ప్రతికూల పరిణామాలను సృష్టిస్తున్నాయి' అని తెలిపారు. ఇదే సమయంలో ఈ చర్యలు అమెరికాకు వ్యతిరేకమైన చైనా, రష్యాలతో భారత్ దౌత్య, ఆర్థిక సంబంధాలను పెంచుకునేలా చేశాయన్నారు.

డిజిటల్, ఆన్‌లైన్ అరెస్టులనేవే లేవు: ఈడీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలపై ఈడీ మరోసారి ప్రజలకు స్పష్టతనిచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద డిజిటల్ లేదా ఆన్‌లైన్ అరెస్టులు చేసే విధానం ఏదీ లేదని వెల్లడించింది. నిబంధనలు అనుసరించి తగిన ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే భౌతికంగా అరెస్టులు జరుగుతాయని బుధవారం ఓ ప్రకటనలో పునరుద్ఘాటించింది. తమకు వచ్చిన సమన్లను నిర్ధారించుకునే అవకాశం కూడా వ్యక్తులకు కల్పించామని, దానికోసం నోటీసుల డాక్యుమెంట్ చివర్లో క్యూఆర్ కోడ్‌ను కూడా ఇస్తున్నామని ఈడీ వెల్లడించింది.

26/11 దాడుల తర్వాత పాక్‌పై

ఎందుకు దాడి చేయలేదు?

(మొదటిపేజీ తరువాయి)

ఒత్తిడికి తలొగ్గి పాక్‌పై సైనిక చర్య చేపట్టకూడదనే నిర్ణయం తీసుకున్నది ఎవరు? అనేది కూడా దేశ ప్రజలకు చెప్పాలని స్పష్టం చేశారు. ముంబై సమీపంలో రూ.19,650 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం ఫేజ్-1ను, రూ.12.200 కోట్ల వ్యయంతో నిర్మించిన ముంబై మెట్రో లైన్-3(ఫేజ్ 2బీ)ని, ముంబైలోని వేర్వేరు ప్రజారవాణా వ్యవస్థల టికెటింగ్‌కు సంబంధించిన ముంబై వన్ యాప్, మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ముంబై దాడుల అనంతర పరిణామాలపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఇటీవల చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. "2008 ముంబై దాడుల అనంతరం పాక్‌పై దాడి చేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ ఓ దేశం నుంచి ఎదురైన ఒత్తిడి వల్ల నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సైన్యాన్ని అడ్డుకుందనే విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోం మంత్రి ఒకరు ఇటీవల బయటపెట్టారు. ఓ విదేశీ శక్తి నుంచి ఎదురైన ఒత్తిడికి తలొగ్గి పాక్‌పై దాడి చెయ్యకూడదు అనే నిర్ణయం తీసుకున్నది ఎవరో కాంగ్రెస్ చెప్పి తీరాలి. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదులను శక్తిమంతులను చేసింది. కాంగ్రెస్ చేసిన తప్పు వల్ల ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేస్తూ దేశం మూల్యం చెల్లిస్తూనే ఉంది. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ రాజీ పడింది. కానీ, దేశ రక్షణ, ప్రజల భద్రత మాకు అన్నింటి కంటే ముఖ్యం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్ రాజీ పడితే తమ హయాంలో శత్రువుల ఇళ్లలోకి చొరబడి మరీ ఉగ్రదాడులకు భారత్ ధీటుగా బదులిస్తుందంటూ మోదీ పేర్కొన్నారు. ముంబై దాడుల అనంతరం పాక్‌పై యుద్ధాన్ని ప్రారంభించవద్దని అంతర్జాతీయంగా, ముఖ్యంగా అమెరికా నుంచి నాటి యూపీఏ ప్రభుత్వంపై



విమానాశ్రయం ప్రారంభ కార్యక్రమంలో మోదీతో అదానీ

ఒత్తిడి వచ్చిందని చిదంబరం ఇటీవల పేర్కొన్నారు. కాగా, అవినీతితో గత ప్రభుత్వం సృష్టించిన అడ్డంకులను అధిగమించి, ఎన్నో ఏళ్ల ఎదురుచూపులకు తెరదించుతూ ముంబైలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. బీజేపీ నేతృత్వంలో గత 11 ఏళ్లలో దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతూనే ఉందన్నారు. 2014లో తాను ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సమయానికి దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా ఆ సంఖ్య 160 కంటే పెరిగిందన్నారు. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా భారత్ వృద్ధి చెందిందన్నారు. విమానాల నిర్వహణ, మరమ్మతులు, ఓవర్‌హాలింగ్‌కు 2030 నాటికి భారత్ ప్రపంచానికే కేంద్రంగా మారుతుందని మోదీ ప్రకటించారు. కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, అండర్ గ్రౌండ్ మెట్రో కారిడార్ ప్రారంభంతో ఆసియాలోనే అతిపెద్ద కనెక్టవిటీ హబ్‌గా ముంబై నిలవనుందని పేర్కొన్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వ హయాంలో గత 11 ఏళ్లలో దేశంలో 90నూతన విమానాశ్రయాల నిర్మాణం జరిగిందన్నారు. ఇక, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి దివంగత దిన్‌కర్ బాలు పాటిల్ పేరు పెడతామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు.

కప్పు టీ కంటే 1 జీబీ డేటా చవక

ఒక కప్పు టీ కంటే తక్కువ ధరకు దేశంలో 1జీబీ వైర్‌లెస్ డేటా దొరుకుతోందని మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సును మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భౌగోళిక అనుకూలతలు, ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్న తీరు, సులభతర వాణిజ్య విధానాలు భారతదేశాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చిందన్నారు. ప్రపంచలోనే రెండో అతి పెద్ద టెలికామ్ మార్కెట్, అతి పెద్ద 5జీ మార్కెట్‌తో పాటు మానవ వనరులు, మార్పును ఆహ్వానించే తత్వం కలిగిన భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు. మేడిన్ ఇండియా 4జీ స్టాక్‌ను ఇటీవలే ప్రారంభించిన భారత్.. ప్రపంచలోనే ఆ సామర్థ్యం కలిగిన ఐదో దేశంగా నిలిచిందని తెలిపారు. ఒకప్పుడు 2జీ నెట్‌వర్క్‌తో ఇబ్బందులు ఎదుర్కొన్న భారత్‌లోని దాదాపు అన్ని జిల్లాల్లో నేడు 5జీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో డిజిటల్ స్పేస్‌లో భారత్ గణనీయమైన ప్రగతి సాధించిందని, దాని వల్లే కప్పు టీ కంటే తక్కువ ధరకు దేశంలో 1జీబీ వైర్‌లెస్ డేటా లభిస్తుందని పేర్కొన్నారు. సెమీకండక్టర్లు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్ వస్తువల ఉత్పత్తి రంగంలో భారతదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పెట్టుబడిదారులు, స్టార్టప్‌లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే, ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్‌కు సంబంధించిన అంతర్జాతీయ కంపెనీలతో భారత కంపెనీలు భాగస్వాములు కావాలని సూచించారు.

భారత్‌కు బ్రిటన్ ప్రధాని స్టార్మర్

న్యూఢిల్లీ, అక్టోబరు 8: భారత్, యూకే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చల కోసం బ్రిటన్ ప్రధాని స్టార్మర్ బుధవారం ముంబైకి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం 125 మంది వాణిజ్య, విద్య, సంస్కృతిక రంగాల ప్రముఖులతో కూడిన భారీ బృందంతో వచ్చారు. భారత్, యూకే మధ్య ఇటీవల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో.. వివిధ రంగాల సంస్థలతో వాణిజ్య భాగస్వామ్యాలపై స్టార్మర్ బృందం చర్చలు జరపనుంది. అలాగే ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీ కానున్నారు. బుధవారం స్టార్మర్ బృందం ముంబైలో ప్రముఖ బాలీవుడ్ సినీ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్టూడియోను సందర్శించింది. యూకే సంస్థలతో ఉమ్మడిగా సినిమాల నిర్మాణంపై, యూకేలో షూటింగ్‌లపై పలు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించింది. అనంతరం స్టార్మర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటన్‌కు బాలీవుడ్ వస్తుందని, సినిమాల నిర్మాణం చేస్తుందని పేర్కొన్నారు. మరోవైపు వచ్చే ఏడాది మొదట్లో బ్రిటన్‌లోని లొకేషన్లలో తమ సినిమాల షూటింగ్‌లు నిర్వహించనున్నట్టు యశ్‌రాజ్ సంస్థ ప్రకటించింది. గురువారం మహారాష్ట్ర రాజ్‌భవన్‌లో ప్రధాని మోదీతో స్టార్మర్ భేటీకానున్నారు. భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)తో ఇరుదేశాలకు సమకూరే ప్రయోజనాలు.. ప్రపంచ వాణిజ్యం, కొత్త సాంకేతికతలు, రక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై వారు చర్చించనున్నారు. కాగా, బుధవారం కీర్ స్టార్మర్ రాకను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.



ముంబైలోని తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్‌లో దీపావళి వేడుకల్లో స్టార్మర్

లోకం తీరు



భారత్‌లోనే జెట్ ఇంజన్ల తయారీ!

- రోల్స్‌రాయిస్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం?
- నేడు మోదీ, స్టార్మర్ భేటీలో స్పష్టత

ముంబై, అక్టోబరు 8: భారత్‌లో తదుపరి తరం యుద్ధ విమానాల తయారీకి అవసరమైన అధునాతన జెట్ ఇంజన్ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం అవుతోంది. యూకేకు చెందిన ప్రముఖ జెట్ ఇంజన్ల తయారీ సంస్థ రోల్స్‌రాయిస్, భారత సంస్థలు ఉమ్మడిగా జెట్ ఇంజన్ల అభివృద్ధి, తయారీ చేపట్టాలన్న ప్రతిపాదనలపై గురువారం ముంబైలో ప్రధాని మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల భేటీలో స్పష్టత రానుంది. దీనిపై ఒప్పందం కూడా జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ ఒప్పందం కుదిరితే దేశీయ యుద్ధ విమానాలకు జెట్ ఇంజన్ల కోసం విదేశాలపై ఆధారపడే దుస్థితి తప్పుతుంది. మన యుద్ధ విమానాల అభివృద్ధి, తయారీ ప్రక్రియలు వేగం పుంజుకుంటాయి. బుధవారం కీర్ స్టార్మర్ బృందంలో భారత పర్యటనకు వచ్చిన రోల్స్‌రాయిస్ సీఈవో టుఫన్ ఎర్గిన్‌బిల్గిక్ దీనికి సంబంధించి పరోక్షంగా వివరాలు వెల్లడించారు. "రోల్స్‌రాయిస్‌కు భారత్‌ను సొంత మార్కెట్ (హోం మార్కెట్)గా అభివృద్ధి చేసుకోవాలన్నది మా సంకల్పం. ఉపరితల, వాయు, సముద్ర రంగాల్లో సాంకేతికంగా మాకు ఉన్న ఆధిపత్యం భారత దేశంలోని వ్యవస్థల సామర్థ్యాలను పెంచేందుకు, వ్యూహాత్మక భాగస్వామ్యాలను విస్తరించేందుకు తోడ్పడుతుంది. వికసిత భారత్ దిశగా అభివృద్ధిని వేగవంతం చేస్తుంది. స్వయం సమృద్ధం కావాలన్న ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో భాగస్వామిగా రోల్స్‌రాయిస్ నిలుస్తుంది" అని చెప్పారు.

కాలిఫోర్నియాలో దీపావళికి సెలవు!

- అధికారికంగా ప్రకటించిన మూడో అమెరికన్ రాష్ట్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 8: భారత్‌లో అత్యంత వేడుకగా నిర్వహించే దీపావళి పండుగను కాలిఫోర్నియా ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన బిల్లుపై ఆ రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ మంగళవారం సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం... హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు జరుపుకొనే దీపావళి పండుగ రోజున అన్ని విద్యాసంస్థలకు సెలవు ఇస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆ రోజు వేతనంతో కూడిన సెలవు తీసుకొనే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అమెరికాలోని రెండు రాష్ట్రాలు ఈ పండుగకు సెలవు ప్రకటించగా ఇప్పుడు మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. 2024లో దీపావళిని రాష్ట్రవ్యాప్త సెలవు దినంగా ప్రకటించిన తొలి రాష్ట్రం పెన్సిల్వేనియా కాగా ఈ ఏడాది ప్రారంభంలో కనెక్టికట్ ఈ జాబితాలో చేరింది.

జోహో ఈమెయిల్‌కు మారిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, అక్టోబరు 8 : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోహో ఈమెయిల్‌కి మారిపోయారు. స్వదేశీ యాప్‌లనే ఉపయోగించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తాను జోహో ఈమెయిల్‌కి మారిపోయినట్లు అమిత్‌షా బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన జోహో ఈమెయిల్ ఐడీని amitshah.bjp@zohomail.in గా తెలిపారు. ఇకపై తనతో ఉత్తరప్రత్యుత్తరాలకు దాన్నే ఉపయోగించాలని కోరారు. జీమెయిల్, ఔట్‌లుక్‌లకు స్వదేశీ ప్రత్యామ్నాయంగా జోహో ఈమెయిల్ వచ్చింది. కేంద్రంలో కీలక మంత్రిగా ఉన్న అమిత్‌షా ఈ నిర్ణయం తీసుకోవడంతో.. కేంద్రంలోని అన్ని విభాగాల అధికారులు అదే బాట పట్టే అవకాశం ఉంది. స్వదేశీ సాంకేతికతనే ఉపయోగించాలని ప్రధాని చెబుతోన్న నేపథ్యంలో 'జోహో మెసేజింగ్ యాప్ అరట్టయ్'కి కూడా బాగా గుర్తింపు వచ్చింది.

కర్ణాటక హైకోర్టుకు బిగ్‌బాస్ వివాదం

బెంగళూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కన్నడ 'బిగ్‌బాస్' హౌస్‌ను అధికారులు సీజ్ చేయడంతో జాలీవుడ్ స్టూడియో యాజమాన్యం బుధవారం హైకోర్టును ఆశ్రయించింది. బిగ్‌బాస్ హౌస్‌ను సీజ్ చేయడంతో కంటెస్టెంట్‌లను స్టూడియో నుంచి మంగళవారం రాత్రి ఓ సినిమా థియేటర్‌కు తరలించారు. అక్కడి నుంచి రాత్రి పొద్దుపోయాక బిడది సమీపంలోని ఈగల్టన్ రిసార్టుకు తరలించారు. కంటెస్టెంట్‌లకు బిగ్‌బాస్ నిర్వాహకులు పలు ఆంక్షలు విధించారు. టెలివిజన్ చూడరాదని, మొబైల్ వాడరాదని, రిసార్టు ఉద్యోగులు, బాయ్స్‌తో కూడా మాట్లాడరాదని హుకుం జారీ చేశారు. వారిని గదులకే పరిమితం చేశారు. బిగ్‌బాస్ స్టూడియో మూసివేత దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. వివాదం ముదరడంతో నిర్వాహకులలో కొందరు డీసీఎం డీకే శివకుమార్‌తో చర్చలు జరిపినట్లు తెలిసింది. బిగ్‌బాస్ రియాలిటీ షోను నిలిపివేయాలన్నది తమ ఉద్దేశం కాదని, పొరపాట్లను సరిదిద్దుకోవాల్సి ఉందని శివకుమార్ అన్నారు.

రెండేళ్లలోపు పిల్లలకు దగ్గు సిరప్‌లు అమ్మొద్దు

ఫార్మసీలకు ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆదేశం.. తమిళనాడులో ఔషధ తయారీ కంపెనీ శ్రీసెన్ సీజ్

- 'కోల్డ్‌రిఫ్' నమూనాల్లో కల్తీ అవశేషాలు

న్యూఢిల్లీ/చెన్నై (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 8: ఇటీవల కలుషిత దగ్గు సిరప్‌ల కారణంగా చిన్నారుల మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మసీలు రెండేళ్ల లోపు పిల్లలకు ఈ ఉత్పత్తులను విక్రయించకుండా భారత ఫార్మసిస్టుల అసోసియేషన్ నిషేధం విధించింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మేరకు లేదా తల్లిదండ్రులు కోరినా కూడా రెండేళ్ల వయసు లోపు చిన్నారులకు దగ్గు సిరప్ లేదా యాంటీహిస్టామిన్లు, డీకాగ్నెస్టెంట్లు, యాంటీటస్సివ్‌ల కాంబినేషన్ లేదా ఉపశమనం కలిగించే మందులు ఇవ్వరాదని సూచించింది. కేంద్ర ఆరోగ్య శాఖ, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఫార్మసిస్టులందరూ పాటించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియా వెల్లడించింది. దగ్గు సిరప్‌లు వాడటం వల్ల చిన్నారులకు కలిగే దుష్పరిణామాల గురించి వివరించాలని, వాటికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, ఔషధ రహిత మందులు సూచించాలని ఆదేశించాయి. మరోవైపు, అన్ని రకాల ఔషధాలను కట్టుదిట్టంగా పరీక్షించాల్సిందిగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలుకు ఆరోగ్య సేవల డైరెక్టరేట్ జనరల్ (డీజీహెచ్ఎస్) గట్టి ఆదేశాలు జారీ చేసింది. తయారీ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిందిగా డ్రగ్ కంట్రోలర్లకు సూచించింది.



'కోల్డ్‌రిఫ్'తో కలకలం

మధ్యప్రదేశ్‌లో విషపూరిత దగ్గు సిరప్‌లు వాడటం వల్ల 20 మంది పిల్లలు మరణించిన నేపథ్యంలో తమిళనాడులోని కాంచీపురం జిల్లా సుంకువారి సత్రం వద్ద ఉన్న ఔషధ తయారీ కంపెనీ శ్రీసెన్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం సీల్ చేసింది. ఆ కంపెనీ లైసెన్స్‌ను రద్దు చేసింది. తమిళనాడు ఆహార భద్రత, ఔషధ పరిపాలన విభాగం ఈ నెల 4వ తేదీన ఈ కంపెనీలోని దగ్గు సిరప్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో కల్తీ అవశేషాలు ఉన్నట్టు తేలింది. దీంతో వెంటనే ఉత్పత్తిని ఆపివేయాలని కంపెనీ యాజమాన్యాన్ని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో తయారు చేసిన దగ్గు సిరప్ 'కోల్డ్‌రిఫ్' అమ్మకాలపై ఆ రాష్ట్రంలో నిషేధం విధించింది. మధ్యప్రదేశ్‌లో ఈ విషపూరిత దగ్గు సిరప్‌లు వాడటం వల్ల కిడ్నీలు పాడై 20 మంది పిల్లలు మరణించినట్టు ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా వెల్లడించారు. మరో ఐదుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు. కాగా, డ్రగ్ కంట్రోల్ అధికారులకు కోల్డ్‌రిఫ్ శాంపిల్స్‌ను స్పీడ్ పోస్టులో కాకుండా సాధారణ పోస్టులో పంపడంతో జాప్యమైందని.. అప్పటికే సేఫ్ అని సర్టిఫికెట్ ఇవ్వడంతో ఆ దగ్గు మందు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయి జరగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం బుధవారం తమిళనాడులోని శ్రీసెన్ కంపెనీలో తనిఖీలు చేసింది. ఏడుగురు సభ్యులతో కూడిన సిట్ ఈ కంపెనీ రిజిస్టర్డ్ చిరునామా ఆఫీసుకు వెళ్లి వివరాలను సేకరించింది. మూడు రోజుల క్రితం కంపెనీ యజమాని పారిపోయినట్టు ఓ అధికారి తెలిపారు.

విదేశాలకు ఎగుమతి చేశారా?

చిన్నారుల మరణాలకు కారణమైన కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్‌ను విదేశాలకు ఎగుమతి చేశారా? అని భారత్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరణ కోరింది. భారత్ నుంచి అధికారిక సమాచారం వచ్చిన తర్వాత కోల్డ్‌రిఫ్ సిరప్‌పై గ్లోబల్ మెడికల్ ప్రొడక్ట్ అలెర్ట్ జారీ చేయడంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. కాగా మరో రెండు బ్రాండ్లు 'ది రెస్పిఫ్రెష్', 'రిలీఫ్' దగ్గు సిరప్‌లు వాడరాదని ప్రజలకు భారత అధికారులు సూచించారు.

ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయనశాస్త్ర నోబెల్

- ఎంవోఎఫ్‌లను అభివృద్ధి చేసిన సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్,
- ఒమర్ ఎం యాఘీలకు సంయుక్తంగా ప్రకటించిన నోబెల్ కమిటీ

స్టాక్‌హోం, అక్టోబరు 8: ఈ ఏడాది వైద్య, భౌతిక శాస్త్ర నోబెల్ పురస్కారాలను ముగ్గురేసి శాస్త్రవేత్తలకు ప్రకటించిన నోబెల్ కమిటీ.. రసాయన శాస్త్ర నోబెల్‌నూ ముగ్గురు శాస్త్రవేత్తలకు ప్రకటించింది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎంవోఎఫ్‌ల) అభివృద్ధిలో కీలకపాత్ర పోషించినందుకుగాను.. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా (74), ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ రాబ్సన్ (88), జోర్డాన్‌లోని ఒక పేద కుటుంబం నుంచి అమెరికాకు వలసవచ్చి ఉన్నతచదువులు చదివిన ఒమర్ ముహన్నెస్ యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు వెల్లడించింది. 1989ల్లో జరిపిన విశేష పరిశోధనలతో వీరు ముగ్గురూ ఒక కొత్త తరహా మాలిక్యులార్ ఆర్కిటెక్చర్‌ను అభివృద్ధి చేశారని నోబెల్ కమిటీ ప్రశంసించింది. మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ గురించి సులభంగా అర్థమయ్యేలా చెప్పాలంటే.. లోహ అయాన్లు (మెటల్), కర్బన సమ్మేళనాల(ఆర్గానిక్)తో వీరు ఒక జాలీ లాంటి నిర్మాణాన్ని అభివృద్ధి చేశారు. అత్యంత సూక్ష్మమైన రంధ్రాలు కలిగిన స్పాంజీ నీటిని పీల్చుకున్నట్టుగా.. వీరు తయారుచేసిన మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ వాయువులను తన లోపలికి పీల్చేసుకుంటుంది. ఇంధన రూపంలో ఉదజని (హైడ్రోజన్) నిల్వకు.. వాతావరణంలోని బొగ్గుపులుసువాయువు (కార్బన్‌డయాక్సైడ్)ను క్యాప్చర్ చేయడానికి.. ఔషధాల రవాణా, తదితర రంగాల్లో ఈ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. ఎడారి గాలుల నుంచి నీటిని సంగ్రహించడానికి, విషవాయువుల నిల్వకు, రసాయన ప్రతిస్పందనల ప్రేరేపణకు ఈ ఫ్రేమ్‌వర్క్స్‌ను ఉపయోగించవచ్చని నోబెల్ కమిటీ ఒక ప్రకటనలో వివరించింది. కాగా, ఈ ముగ్గురిలో.. సుసుము కిటగావా 1989లో ఎంవోఎఫ్‌ల అభివృద్ధికి కీలకమైన పోరస్ కో-ఆర్డినేషన్ పాలిమర్స్ అనే భావనను పరిచయం చేశారు. వాయువుల నిల్వకు, వాయువులను వేరుచేయడానికి వాటిని ఎలా వాడుకోవాలనేదానిపై విస్తృతంగా పరిశోధనలు చేశారు. అందుకే ఆయన్ను మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ పితామహుడుగా పరిగణిస్తారు. రిచర్డ్ రాబ్సన్ 1990లో.. లోహ అయాన్లు, ఆర్గానిక్ లింకర్లను కలిపి 2డి, త్రీడీ జాలీలను నిర్మించవచ్చని నిరూపించారు. అందుకే ఆయన్ను నెట్‌వర్క్ కెమిస్ట్రీ పయనీర్‌గా అభివర్ణిస్తారు. వీరిద్దరి పరిశోధనల ఆధారంగా 1995లో ముహన్నెస్ యాఘీ ఎంవోఎఫ్‌లను సైద్ధాంతికంగా, నిర్మాణాత్మకంగా, మరింత అధునాతనంగా అభివృద్ధి చేశారు. అందుకే ఆయన్ను ఎంవోఎఫ్‌ల వ్యవస్థాపకుడుగా పేర్కొంటారు. సుసుము కిటగావా ప్రస్తుతం క్యోటో యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాబ్సన్ యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌లో, యాఘీ యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా (బర్కిలీ)లో సేవలందిస్తున్నారు.



సుసుము కిటగావా



రిచర్డ్ రాబ్సన్



ఒమర్ యాఘీ

బాబ్బాబూ.. దరఖాస్తు చేసుకోండి!

మద్యం వ్యాపారానికి మించింది లేదు.. ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రచారం

- అయినా ఆసక్తి చూపని వ్యాపారులు
- రెండు వారాల్లో వచ్చిన దరఖాస్తులు 1,581.. మరో 10 రోజులే గడువు
- ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మద్యం వ్యాపారాన్ని మించినది లేదు.. తక్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చేది ఇదే.. ఫలానా మద్యం షాపు వాళ్లు ఇన్ని కోట్లు సంపాదించారు.. మీరూ దరఖాస్తు చేయండి.. మీతోటి వాళ్లతో దరఖాస్తులు చేయించండి' అంటూ ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నారు. అయినా అధికారుల అంచనాలకు తగ్గట్లు దరఖాస్తులు రావడం లేదు. దసరా రోజు భారీగా దరఖాస్తులు చేస్తారనే నమ్మకంతో పండుగకు ముందే నోటిఫికేషన్ జారీ చేశారు. రెండు వారాలుగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నా ఇప్పటి వరకు కేవలం 1,581 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఈ నెల 18తో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. ఈసారి దరఖాస్తుల విక్రయాల ద్వారానే రూ.3 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అంటే దాదాపు లక్ష దరఖాస్తులైనా రావాలి. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటి రెండేళ్ల గడువు నవంబరు 30తో ముగియనుండటంతో గత నెల 25న కొత్త మద్యం పాలసీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఈ నెల 23న లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారు. డ్రాలో ఎంపికైన వారు డిసెంబరు 1 నుంచి కొత్త దుకాణాలు ప్రారంభించుకోవచ్చు. క్రితం సారి దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు ఉండటంతో దాదాపు 1.31 లక్షల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల విక్రయాలతోనే దాదాపు రూ.2,645 కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తు రుసుమును ఈసారి రూ.3 లక్షలకు పెంచారు. దీంతో గతంలో కంటే దరఖాస్తులు తగ్గినా ఆదాయం పెరిగి రూ.3 వేల కోట్లకుపైనే రావచ్చని ఎక్సైజ్ శాఖ భావించారు. ఈ ఆదాయం రావాలంటే గడువు ముగియడానికి మిగిలిన 10 రోజుల్లో రోజుకు 10 వేల చొప్పున దరఖాస్తులు రావాలి. కానీ గత నెల 26 నుంచి బుధవారం వరకు 1,581 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో దరఖాస్తులు చేసుకోమంటూ ఎక్సైజ్ శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రస్తుతం చాలామంది స్థానిక సంస్థల ఎన్నికల్లో నిమగ్నమయ్యారు. మద్యం షాపులు, బార్ల యజమానులు సిండికేట్‌గా దరఖాస్తులు వేస్తున్నారు. గతంలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు. దరఖాస్తు రుసుం రూ.లక్ష పెంచడం భారంగా మారిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి దుకాణాల వారీగా గతంలో వచ్చిన దరఖాస్తులకు తగ్గకుండా చూడాలని ఆదేశించారు. చివరి నాలుగైదు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,834 దుకాణాలు ఓపెన్ క్యాటగిరీలో ఉండగా వాటికి 992 దరఖాస్తులు వచ్చాయి. గౌడ్‌లకు 393 దుకాణాలు కేటాయించగా 223 మంది, ఎస్సీలకు 262 రిజర్వు చేయగా 55, ఎస్టీలకు 131 షాపులు కేటాయించగా 13 దరఖాస్తులు వచ్చాయి.

రెండువైపులా డీబీఎం

- టీబీఎంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం

అసాధ్యమనే నిర్ణయానికొచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగాన్ని టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)తో తవ్వి పూర్తిచేయడం అసాధ్యమని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. టన్నెల్ కూలడంతో దెబ్బతిన్న టీబీఎం శిథిలాలను తొలగించిన తర్వాత.. ఏకకాలంలో రెండువైపులా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం(డీబీఎం)లో తవ్వకం చేపట్టనున్నారు. ఇప్పటికే ఇన్‌లెట్(శ్రీశైలం) వైపు టీబీఎం భాగాలను తొలగించారు. తాజాగా ఔట్‌లెట్(మన్నెవారిపలి) వైపు భాగాలను కత్తిరించి బయటకు తీస్తున్నారు. వచ్చే జూన్ 30కల్లా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. టన్నెల్ నిడివి 43.93 కి.మీ. ఇందులో ఇన్‌లెట్ వైపు నుంచి 13.936 కి.మీ.. ఔట్‌లెట్ వైపు నుంచి 20.436 కి.మీ తవ్వారు. ఇక 9.56కి.మీ. మేర రెండువైపుల నుంచి తవ్వితే టన్నెల్ పూర్తవుతుంది. ఫిబ్రవరిలో శ్రీశైలం వైపు ప్రమాదం జరగడంతో పనులు ఆగిపోయాయి. ఇన్‌లెట్ వైపు టీబీఎం పూర్తిగా ధ్వంసం కాగా, దాని భాగాలను తొలగించారు. ఆ తర్వాత ఔట్‌లెట్ వైపు పని ఆగిపోవడంతో బేరింగులు తెప్పించారు. అయినా పనులు సాఫీగా సాగే అవకాశాల్లేవని ప్రభుత్వం గుర్తించింది. అనంతరం ఈ టన్నెల్ కోసమే సరిహద్దు రోడ్డు భద్రత సంస్థ(బీఆర్‌వో)కు చెందిన మేజర్ జనరల్ హర్పాల్‌సింగ్‌ను, ఆర్మీకి చెందిన సొరంగాల నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రాను డిప్యూటేషన్‌పై నియమించుకుంది. సొరంగం తవ్వడానికి టీబీఎం అనుకూలం కాదని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దాంతో రెండువైపులా డీబీఎంను ఎంచుకోవడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి, ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

16 మంది నక్సల్స్ లొంగుబాటు

వారిలో ఏడుగురు మహిళలు.. అందరిపై 70 లక్షల రివార్డు

చర్ల, ఏటూరునాగారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలున్నారు. వీరందరిపై సుమారు రూ.70లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ డిప్యూటీ కమాండర్, పీఎల్‌జీఏ పార్టీ సభ్యుడు, ఏసీఎం, జనతన సర్కార్ కమిటీ, మాడ్ ఏరియా కమిటీ మెంబర్లు, మిలీషియా సభ్యులున్నారని పోలీసులు పేర్కొన్నారు. వీరంతా నారాయణపూర్, అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో నిందితులని తెలిపారు.

ఆ మృతదేహం మావోయిస్టుదేనా?

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక-వీరాపురం అటవీ ప్రాంతంలో ఈ నెల 2న లభించిన మృతదేహం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీపీఐ మావోయిస్టు పార్టీ ఏరియా దళ కమాండర్ మాడవి లక్కి(36)దిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లోని గ్రాంపూర్ ప్రాంతానికి చెందిన లక్కి.. మావోయిస్టు పార్టీ ఆదేశాలను ధిక్కరించి అజ్ఞాతంలో ఉన్న ఓ మహిళా మావోయిస్టును తీసుకొని అడవి నుంచి బయటకు వచ్చినట్టు తెలిసింది. అనంతరం ఆమెతో ఛత్తీస్‌గఢ్‌లోని పాలెం ప్రాంతానికి చెందిన ఓ కొరియర్ సాయంతో ఏటూరునాగారం మండలం చల్పాక ప్రాంతంలోని వీరాపురం గొత్తికోయగూడెంలో ఆశ్రయం పొందినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న నలుగురు మావోయిస్టులు ద్విచక్రవాహనాల్లో అక్కడికి చేరుకుని లక్కిని ఛత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అతను ప్రతిఘటించడంతో మావోయిస్టులు అతన్ని చెట్టుకు ఉరివేసి హతమార్చినట్టు తెలిసింది. పార్టీ క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే లక్కిని హతమార్చినట్లు మావోయిస్టులు స్థానికులకు చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఈనెల 2న లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం లక్కిదేనని, హత్య వెనుక మావోయిస్టుల హస్తం ఉందనే సమాచారంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నిమ్స్ నుంచి డిశ్చార్జ్ అయిన మంత్రి దామోదర



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం నిమ్స్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. జ్వరంతో బాధపడుతూ మంగళవారం నిమ్స్‌లో చేరిన ఆయన, చికిత్స అనంతరం పూర్తిగా కోలుకున్నారు. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప నేతృత్వంలోని డాక్టర్ల బృందం దామోదరకు చికిత్స అందించింది.

కిడ్నాప్ చేసి.. తుపాకీతో బెదిరించి..

- ఓ వ్యక్తిని రూ.10 కోట్లు డిమాండ్ చేసిన ముఠా.. పోలీసుల అదుపులో ముగ్గురు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వాకింగ్ చేస్తున్న వ్యక్తిని కిడ్నాప్ చేయడమేకాకుండా ఆయనపై దాడి చేసి తుపాకీతో బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేసిన ఓ ముఠా ఆటకట్టించిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన మనోజ్ కుమార్ బాచుపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న స్నేహితుడితో కలిసి మియాపూర్ పరిధిలోని మాతృశ్రీ నగర్‌లో నడుచుకుంటూ వెళ్తుండగా.. వెంకట్ స్వరూప్ అనే వ్యక్తి అమీర్‌పేటలోని తన కార్యాలయానికి రమ్మని పిలిచి కారులో తీసుకెళ్లాడు. అక్కడున్న మరో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు మనోజ్‌పై దాడి చేశారు. తుపాకీతో బెదిరించి అక్కడి నుంచి ఎల్లారెడ్డిగూడలోని శివసాయి అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లారు. తమకు రూ.10 కోట్లు ఇవ్వాలని, లేకుంటే అతనితో పాటు అతని భార్య, పిల్లలను చంపుతామని బెదిరించారు. బాధితుడు తన భార్యకు ఫోన్‌లో ఈమేరకు సమాచారమిచ్చాడు. వెంటనే ఆమె 100కు ఫోన్ చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు అమీర్‌పేటలో వెతుకుతున్న క్రమంలో ఓ నిందితుడు ఫోన్ చేసి అమీర్‌పేట మెట్రో పిల్లర్ నంబర్ 1039వద్ద ఉన్నామని, డబ్బు తేవాలని హెచ్చరించాడు. అయితే పథకం ప్రకారం ఆమెతో పాటు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసులను చూసిన నిందితుల్లో ఇద్దరు బైక్‌పై పారిపోయారు. మరో ముగ్గురు నిందితులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు.

స్నేహితుడి గదికి తీసుకెళ్లి రేప్

- నీరసంగా ఉండటం, రక్తస్రావం జరగడంతో గదిలోనే బాలిక మృతి
- ఇంటర్ విద్యార్థిని మృతి కేసులో నిందితుడు, అతడి స్నేహితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు కృష్ణ, మధు

నల్లగొండ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అత్యాచార ఘటనకు సంబంధించి నల్లగొండలో ఇంటర్ విద్యార్థిని అప్పటికే నీరసంగా ఉండటం, ఆపై తీవ్ర రక్తస్రావం జరగడంతో ఘటనాస్థలిలోనే మృతిచెందిందని పోలీసులు వెల్లడించారు. బాలికపై అత్యాచారం, ఆమె మృతికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు నల్లగొండ మండలం గుట్టకింద అన్నారం గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణ, అతడికి సహకరించిన నల్లగొండకు చెందిన ఆటో డ్రైవర్ బచ్చలకూరి మధును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను బుధవారం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నల్లగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని నిత్యం ఆటోలో నల్లగొండలోని కళాశాలకు వచ్చి.. సాయంత్రం అదే ఆటో తిరిగి ఇంటికి వెళ్లేది. ఆ బాలిక ఉండే గ్రామంలో మూడు నెలల క్రితం గడ్డం కృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. బాలికను పరిచయం చేసుకున్నాడు. మూడు నెలలుగా ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో ఆమెతో చాటింగ్ చేస్తూ ప్రేమిస్తున్నానని చెప్పి దగ్గరయ్యాడు. రోజూ ఆమె వచ్చే ఆటోలోనే నల్లగొండకు వచ్చేవాడు. ఈ నెల 7న ఉదయం బాలిక ఆటోలో కాలేజీకి బయలుదేరింది. అయితే ఉదయం 8:30కు బాలిక ప్రయాణిస్తున్న ఆటో నల్లగొండ డీఈవో ఆఫీసు చౌరస్తాకు చేరుకుంది. అప్పటికే అక్కడికి బైక్‌పై వచ్చి వేచి ఉన్న కృష్ణ.. ఆమెను ఆ వాహనంలోంచి దింపాడు. బాలికను తన బైక్‌పై తీసుకెళితే.. ఆమె గ్రామస్థులు, ఇతరులు ఎవరైనా గుర్తుపడతారనే ఉద్దేశంతో పథకం ప్రకారం మధు అనే తన స్నేహితుడి ఆటోలో ఆమెను ఎక్కించాడు. మధు.. తన ఆటోలో ఆమెను తాను షంషూనగర్‌లో అద్దెకు ఉంటున్న గది వద్ద దిగబెట్టాడు. అనంతరం బైక్‌పై కృష్ణ ఆ గదికొచ్చాడు. గదిలోకి వెళ్లిన తర్వాత బాలికపై కృష్ణ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలికకు తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆ తర్వాత కొద్దిసేపటికే మృతిచెందింది. అనంతరం కృష్ణ ఆ గదికి తాళం వేసి పారిపోయాడు. బాలిక మృతిచెందిన విషయాన్ని అతడు తనకు తెలిసిన వ్యక్తికి చెప్పడంతో ఘటన గురించి బాలిక తల్లిదండ్రులకు, పోలీసులకు తెలిసింది. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం గడ్డం కృష్ణ పోలీసులకు లొంగిపోయాడు. అతడి స్నేహితుడు మధును పోలీసులు అరెస్టు చేశారు. మైనర్‌పై అత్యాచారం చేసినందుకు గడ్డం కృష్ణపై బీఎన్ఎస్ సెక్షన్ 65(1) కింద, పోక్సో చట్టంలోని సెక్షన్లు 5, 6 కింద, అత్యాచారం కారణంగా తీవ్ర రక్తస్రావంతో బాలిక మృతికి సంబంధించి బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. కృష్ణకు సహకరించిన అతడి స్నేహితుడు, ఆటో డ్రైవర్ మధుపై బీఎన్ఎస్ సెక్షన్ 107 కింద కేసు నమోదు చేశారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ వెల్లడించారు.

పాఠాలు చెబుతూ గుండెపోటుతో టీచర్ మృతి



సుజాత (ఫైల్)

జహీరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు చెబుతూ ఓ ఉపాధ్యాయురాలు గుండెపోటుతో మృతిచెందారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని నంబర్-4 ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. బుధవారం ఉదయం ప్రార్థనల అనంతరం తరగతి గదిలోకి వెళ్లిన ఉపాధ్యాయురాలు బి.సుజాత (47) విద్యార్థులకు హాజరు తీసుకుని, పాఠాలు బోధిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఛాతీలో నొప్పిరావడంతో అక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే విద్యార్థులు పక్కనే ఉన్న ఇతర ఉపాధ్యాయులకు చెప్పడంతో వారంతా వచ్చి చూడగా అప్పటికే ఆమె చనిపోయి ఉన్నారు.

కన్న తల్లిని చంపినోడు.. కళ్ల ముందే తిరుగుతున్నాడని..!

- నిందితుడిపై దాడి చేసి చంపిన తనయుడు
- సహకరించిన భార్య, ఇద్దరు బంధువులు

పుల్‌కల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తన తల్లిని చంపిన వ్యక్తి.. గ్రామంలోనే హాయిగా తిరగడాన్ని జీర్ణించుకోలేకపోయాడో తనయుడు.. ఎలాగైనా హతమార్చాలని భార్య, మరో ఇద్దరితో కలిసి అతడిపై విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణం తీశాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం బస్వాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బేగరి జయమ్మను మే 6న పుట్టా రాములు (50), అతడి కుమారుడు అనిల్‌కుమార్, కుమారుడి స్నేహితుడు డప్పు వినీత్‌లు కిడ్నాప్ చేసి హత్య చేశారు. ఆపై మృతదేహాన్ని ఓ చోట దహనం చేసి ఆమె నగలను అపహరించారు. దర్యాప్తు జరిపిన పోలీసులు.. నిందితులు రాములు, అనిల్, వినీత్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం వీరికి బెయిల్ రావడంతో గ్రామంలోకి రాకుండా దూరంగా నివాసముంటున్నారు. అయితే రాములు ఇటీవల గ్రామానికి వచ్చి తన వ్యవసాయాన్ని చూసుకుంటున్నాడు. ఇది చూసి బేగరి జయమ్మ కుమారుడు శివక్రాంతికుమార్, అతడి భార్య లక్ష్మి.. జీర్ణించుకోలేకపోయారు. బుధవారం రాములు పొలం నుంచి ఇంటికెళ్తుండగా అడ్డగించిన శివక్రాంతికుమార్, లక్ష్మి.. వారి బంధువులు మాణయ్య, రత్నమ్మతో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో రాములుకు తీవ్రగాయాలవ్వగా చనిపోయాడని వదిలేసి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు రాములును అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

పాక్ మీద ట్రంప్ ప్రేమకు కారణాలేమిటి?

చైనాతో అమెరికాకు తీవ్రమవుతున్న పోటీ.. ఆ దేశం నీడలోకి పాక్ వెళ్లకుండా ఆపటం లక్ష్యం

- ఇస్లామిక్ దేశాలతో సంబంధాల బలోపేతం కోసం పాక్‌లోని ఖనిజాలు, రాగి, బంగారు గనుల మీద కన్ను

భారీ ఎత్తున సుంకాలు, హెచ్1బీ వీసాల మీద తీవ్రమైన ఆంక్షలు విధించి భారత్‌ను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్న ట్రంప్.. పాకిస్థాన్ మీద మాత్రం ఎక్కడ లేని ప్రేమను ఒలకబోస్తున్నారు. ఆ దేశానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పాక్ ప్రధానిని, ఆర్మీ చీఫ్‌ను వైట్ హౌస్‌కు పిలిపించుకొని వారితో సమావేశమయ్యారు. ట్రంప్ 2.0లో ఈ అనూహ్య మార్పు కొట్టిచ్చినట్టుగా కనిపిస్తోంది. దీనికి కారణమేమిటి?... విశ్లేషకులు ఆర్థికం నుంచి దౌత్యం వరకూ పలు కారణాలను పేర్కొంటున్నారు.

చైనాతో తీవ్రమవుతున్న పోటీ

ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సోవియట్ రష్యాతో తీవ్రంగా పోటీ పడిన అమెరికా.. సోవియట్ రష్యా పతనానంతరం ఏకచత్రాధిపత్యం సాధించింది. అయితే, మార్కెట్ అనుకూల సంస్కరణలతో చైనా వడివడిగా అడుగులు వేసుకుంటూ.. ప్రస్తుతం అమెరికాను ఢీకొనే స్థాయికి చేరుకుంది. చైనాను బలమైన పోటీ దేశంగా అమెరికా భావిస్తోంది. అదే సమయంలో, చైనా-పాకిస్థాన్ మధ్య ఆర్థిక, సైనిక బంధం బలోపేతమవుతూ వస్తోంది. ఇదిలాగే కొనసాగితే, పాక్ పూర్తిగా చైనా శిబిరంలో చేరే అవకాశం ఉందని భావించిన ట్రంప్.. పాకిస్థాన్‌కు అమిత ప్రాధాన్యం ఇస్తున్నారని ఒక అంచనా. ఇక రెండో కారణం.. ఇస్లామిక్ దేశాల్లో ఓ ముఖ్యమైన, అణ్వాయుధ సామర్థ్యమున్న దేశం పాకిస్థాన్. ఆ దేశం తన వెంట ఉంటే.. ఇస్లామిక్ దేశాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవటం, గాజా ఒప్పందాన్ని గట్టెక్కించటం వీలవుతుందని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం.



ఆర్థిక కోణాలు

పాకిస్థాన్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద రాగి గనుల సముదాయం ఉంది. దాని పేరు రెకో దిఖ్. దీంట్లో బంగారం నిల్వలు కూడా ఉన్నాయి. ఈ గనులను తవ్వే కాంట్రాక్టును కెనడాకు చెందిన బారిక్ మైనింగ్ కార్పొరేషన్ (బీఎంసీ) సంపాదించుకుంది. ఈ కంపెనీ తన ప్రధాన కార్యాలయాన్ని అమెరికాకు తరలించాలని భావిస్తోంది. మరోవైపు, పాక్‌లోని బలూచిస్థాన్‌లో ఉన్న మరో భారీ రాగి-బంగారం గనుల సముదాయం సైందక్ పూర్తిగా చైనా కంపెనీల నియంత్రణలో ఉంది. ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్న చైనీయుల మీద బలూచ్ మిలిటెంట్లు తరచూ దాడులు జరుపుతున్నారు. ఈ రిస్కులు ఎలా ఉన్నప్పటికీ.. చైనా కంపెనీలతో బీఎంసీ పోటీ పడే పరిస్థితి నెలకొంది. పాక్‌పై ట్రంప్ ప్రేమకు ఇదొక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతోపాటు అమెరికా నుంచి పాకిస్థాన్ భారీగా చమురు కొనుగోలు చేయటం, పాక్‌లో ఉన్న అరుదైన ఖనిజాలు అమెరికా కంపెనీలను ఊరిస్తుండటం కూడా ఈ రెండు దేశాలు సన్నిహితం కావటానికి కారణమవుతున్నాయి. ట్రంప్ సన్నిహిత వర్గాలకు చెందిన కొన్ని కంపెనీలు పాకిస్థాన్‌తో క్రిప్టో ఆధారిత ఒప్పందాలు చేసుకున్నట్లుగా కొన్ని మీడియా సంస్థల్లో వార్తలు వెలువడ్డాయి.

పాక్ బేషరతు మద్దతు

ప్రస్తుత పాకిస్థాన్ పాలకులు ట్రంప్ ఎలా అంటే అలా తలూపుతున్నారు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానన్న ట్రంప్ మాటకు నిజమేనని తలాడించారు. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి మీద ఉన్న ఆరాటం చూసి.. ఆ ప్రతిష్ఠాత్మక ప్రైజ్‌కు ఆయన పేరును ఏకంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ రకంగా పూర్తి బేషరతు మద్దతు ఇవ్వటం కూడా ట్రంప్‌కు బాగా నచ్చుతోంది. మరోవైపు, పాక్‌తో అంటకాగినట్లు కనిపించటం వల్ల భారత్ మీద ఒత్తిడి పెంచవచ్చని, తద్వారా భారత్‌తో కొనసాగుతున్న ఆర్థిక, వ్యూహాత్మక ఒప్పందాల నుంచి అమెరికాకు అనుకూలంగా మరింత రాబట్టుకోవచ్చని ట్రంప్ వ్యూహమన్నది మరో వాదన.

- సెంట్రల్ డెస్క్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విషం-విషాదం

మీ దేశంలో సరే, పసిపిల్లలను పొట్టనబెట్టుకున్న ఆ దగ్గు మందును ఇతర దేశాల్లోనూ అమ్ముకున్నారా? అని ప్రపంచ ఆరోగ్యసంస్థ మనల్ని నిలదీస్తోంది. అవునని మనం గనుక అంటే, భారతదేశం నుంచి వచ్చిన సదరు విషపూరిత దగ్గుమందుతో మీ పిల్లల ప్రాణాలను ప్రమాదంలో పడవేయకండి అంటూ ప్రపంచ దేశాలన్నింటిలోనూ అది టమకు వేయిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థకు మనమీద ప్రత్యేకమైన పగలూవగలూ ఏమీలేవు. కానీ, మన దగ్గుమందుకు విదేశాల్లో సైతం పసిప్రాణాలను పెద్దసంఖ్యలో చిదిమేసిన ఘనమైన గతం ఉన్నది కనుక, మరో కొత్త విషం విషయంలో ఆరోగ్యసంస్థ ఇలా ఉలిక్కిపడటం తప్పేమీ కాదు.

ఈ కాలకూట విషానికి రోజూ ఒక్కరొక్కరుగా ప్రాణాలు వదిలేస్తూనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా, రాజస్థాన్‌తోనూ కలిపి ఇప్పటి వరకూ 22మంది పిల్లలు మరణించారు. నాగపూర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు చిన్నారుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నదని, ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాల్లో తెలియక ఈ దగ్గుమందువాడే ప్రమాదం కూడా లేకపోలేదని అధికారులు అంటున్నారు. తమిళనాడులో ఎన్నికలు ఉన్నందువల్ల కాబోలు, ఈ విషాదఘట్టం కూడా రాజకీయమైపోయింది. సదరు దగ్గుమందు తయారైంది కాంచీపురంలో కనుక, ఆ కంపెనీమీదా, దాని యజమాని మీద మేము చెప్పినమేరకు, ఆదేశించిన రీతిలో తమిళనాడు ఆరోగ్య శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేంద్రం నిలదీస్తోంది. శ్రేసన్ ఫార్మామీద దాడి సహా చేయాల్సినవన్నీ చేస్తూనే ఉన్నామని తమిళనాడు వాదిస్తోంది. రాజకీయానికి ఇది సమయం కాదని అంటూనే ఈ విమర్శలు, ప్రతివిమర్శల పర్వం సాగుతోంది.

పరిమితికి ఐదురెట్లు అధికంగా డైఎథిలీన్ గ్లైకాల్ వినియోగించిన ఈ కోల్డ్‌రిఫ్ దగ్గుమందును చాలా రాష్ట్రాలు నిషేధించాయి, ప్రకటనలు కూడా జారీ చేశాయి. దీనిని ముందు జాగ్రత్త అనుకోవాలో, చేతులు కాలాక ఆకులుపట్టుకోవడమేనని బాధపడాలో తెలియదు. అంతమంది పిల్లలు కన్నుమూస్తే కానీ, తమిళనాడు ప్రభుత్వం మేలుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫిర్యాదు అందుకున్న తమిళనాడు అధికారులు సదరు ఫార్మా కంపెనీలో కాలూని, అక్కడి వాతావరణం చూసి నిర్ఘాంతపోయారని మీడియా అంటోంది. ఫార్మారంగంతో సంబంధం లేని కార్మికులు తుప్పుపట్టిన పరికరాలు వాడుతూ, గ్లౌజులు, మాస్కులు లేకుండా గ్యాస్‌స్టవ్‌లపైన రసాయనాలు వండుతున్నారనీ, అపరిశుభ్రమైన నీరు, దుమ్మూ ధూళి కలగలసి ఆ సిరప్పులు తయారవుతున్నాయని మీడియా తెలియచేసింది. ఈ మందులో వినియోగించాల్సిన రసాయనాలను పెయింట్ పరిశ్రమ డీలర్లనుంచి కొనుగోలు చేస్తున్నారని, వాటిని కచ్చితంగా తూచకుండా, పరీక్షించకుండా కలిపివేస్తున్నారని అధికారులు గ్రహించారు. చట్టం ప్రకారం ఈ సంస్థ నలభై అతి కీలకమైన, మూడువందలకు పైగా అతిముఖ్యమైన ఉల్లంఘనలకు పాల్పడిందని తమిళనాడు అధికారులకు అప్పుడు గానీ తెలియరాలేదట.

సదరు కంపెనీ మీద తమిళనాడు ఏ చర్యలు తీసుకున్నా, డాక్టర్‌ను అరెస్టుచేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల వంటివారిని మధ్యప్రదేశ్ ప్రభుత్వం సస్పెండ్ చేసినా అంతా ఉపరితలవిన్యాసమే. ఒక అనుమతిపొందిన కంపెనీ తయారుచేసిన దగ్గుమందును చీటీమీద రాసినందుకు వైద్యుడిని ఎలా అరెస్టుచేస్తారని వారి సంఘం ప్రశ్నిస్తున్నదట. చవుకబారు రసాయనాలతో, తప్పుడు విధానాలతో, నాణ్యతలేని ఒక దగ్గుమందును తయారుచేసి, ఐదారురెట్ల ధరకు దానిని విక్రయిస్తున్న ఆ కంపెనీని మాత్రమే తప్పుబట్టి ప్రయోజనం లేదు. దాని లాభాల్లో వాటాలు పొందుతున్న వైద్యులు, అధికారులు కూడా పాపంలో భాగస్వాములే. రసాయనాల కొనుగోలు, తయారీ, పంపిణీ ఇత్యాది ప్రతీ దశా మన వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. రాజకీయ నాయకుల పరోక్ష అనుమతితో, అధికారుల ప్రత్యక్ష సహకారంతో కళ్లముందు తయారవుతున్న విషం ఇది. ఐదేళ్ళక్రితం జమ్మూకశ్మీర్ సహా కొన్ని రాష్ట్రాల్లో చిన్నారులను చిదిమేసిన ఘటనలు మన మనసుకు తాకలేదు. మరో రెండేళ్ళకు గాంబియాలోనూ, ఆ తరువాత ఏడాది ఉజ్బెకిస్థాన్‌లోనూ మన దగ్గుమందు పెద్దసంఖ్యలో పసిప్రాణాలతో పాటు అంతర్జాతీయంగా భారత్ పరువు కూడా తీసింది. ఫార్మా కంపెనీలు, ఫ్యాక్టరీల మీద నిఘా, పర్యవేక్షణ మరింత పెరగాలి. పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధిలేనంత కాలం ఇటువంటివి జరుగుతూనే ఉంటాయి.

ప్రజాస్వామ్య భరోసానివ్వని బిహార్ 'సర్'

బిహార్ ఓటర్ల తుది జాబితాలు వెలుడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల తేదీలూ ప్రకటించారు. పూర్తయిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్) కార్యక్రమాన్ని నిశితంగా పరీక్షిస్తే మా దృష్టికి వచ్చిన వాస్తవాలను వివరించడమే ఈ వ్యాస లక్ష్యం. కొత్త ఓటర్ జాబితాల నాణ్యతను అంచనా వేసేందుకు గాను ఓటర్ల నమోదు కార్యక్రమాలకు అంతర్జాతీయ స్థాయిలో అంగీకార యోగ్యమైన మూడు మార్గదర్శక సూత్రాలను ప్రాతిపదికగా తీసుకున్నాం: సమగ్రత, నిష్పాక్షికత, నిర్దుష్టత.



■ యోగేంద్ర యాదవ్

తొలుత ఓటర్ జాబితా సమగ్రతను చూద్దాం. ఓటర్ జాబితాలో చోటు చేసుకున్న అర్హులైన జనుల నిష్పత్తిని దీనికి కొలమానంగా తీసుకున్నాం. గత జూలైలో ప్రచురితమైన ముసాయిదా ఓటర్ జాబితాలలో చోటుచేసుకున్న వయోజనుల నిష్పత్తి ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో దిగ్భ్రాంతికరంగా 97 శాతం నుంచి 88 శాతానికి తగ్గిపోయింది. తుది ఓటర్ల జాబితాలో కొంత మేరకు మెరుగుదల కనిపించినప్పటికీ, విస్తృత పరిశీలనలో పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని స్పష్టమయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా ఓటర్లకు-జనాభాకు మధ్య నిష్పత్తి గణనీయంగా పడిపోయింది మరి. భారత ప్రభుత్వ నిపుణుల బృందం విడుదల చేసిన జనాభా అంచనాల ప్రకారం సెప్టెంబర్ 2025లో బిహార్‌లో 8.22 కోట్ల మంది ఓటర్లు ఉండాలి. తుది ఓటర్ జాబితాలో ఉన్నవారు 7.42 కోట్లు మాత్రమే! అంటే దాదాపు 80 లక్షల మంది సంభావ్య ఓటర్లు తుది జాబితాలో కనిపించడం లేదు! ఇదేమంత సంతోషించదగిన విషయం? దీన్నెలా అంగీకరించాలి?

తుది ఓటర్ జాబితాలు భ్రమపూరితమైన ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తున్నాయి. ఎందుకని? తుది జాబితా నుంచి తొలగింపులు ముసాయిదా జాబితాల నుంచి తొలగించబడిన 65లక్షల కంటే తక్కువ కాబట్టి. నిజానికి రెండు కోట్ల మంది ఓటర్లు తొలగింపుకు గురవుతారని భయపడ్డాము. అంత పెద్ద సంఖ్యలో ఓటు హక్కు తొలగింపులు సంభవించ లేదంటే అందుకు కారణం 'సర్' గానీ, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ కాదు. దేశ సర్వోన్నత న్యాయస్థానం అప్రమత్తత వల్లే అటువంటి అప్రజాస్వామిక చర్య చోటుచేసుకోలేదు. సుప్రీంకోర్టు కృత నిశ్చయంతో 'సర్' అమలును పర్యవేక్షించింది. గౌరవ భంగం కాకుండా ఉండేందుకు ఈసీఐ తన ఆదేశాలకు, కార్యనిర్వహణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరించింది. తొలుత ఎన్యూమరేషన్ ఫామ్‌లను సమర్పించని ఓటర్లు పెద్ద సంఖ్యలో లేరనే వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు కచ్చితంగా ప్రయత్నించింది. ఈ ప్రకారం కనీసం 20 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లను బీఎల్‌ఓలే నింపి ఈసీఐకు సమర్పించడం జరిగింది. ఈ ఫోర్జరీని ఈసీఐ ప్రోత్సహించింది. పిదప సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆధార్ కార్డును ఓటర్ నమోదుకు ఒక ప్రామాణిక పత్రంగా ఈసీఐ అంగీకరించింది.

తుది జాబితాలలో నిష్పాక్షికత ఉన్నదా? ఓటు హక్కుకు అర్హులైన జనాభాలో తమ నిష్పత్తికి సమరీతిలో అన్ని సామాజిక బృందాలకు ప్రాతినిధ్యం లభించిందా? దళితులకు, వచ్చిపోయే వలసకారులకు ఈ విషయంలో న్యాయం ఏ మేరకు జరిగింది? వీటిపై మరింత నిశిత శోధన జరగవలసివున్నది.

మహిళలు, ముస్లింలకు న్యాయం జరగలేదన్నది మా పరిశీలనలో స్పష్టంగా వెల్లడయింది. బిహార్ ఓటర్ జాబితాలలో మహిళల నిష్పత్తి రాష్ట్ర జనాభాలో వారి వంతు కంటే ఎప్పుడూ తక్కువగా ఉండడం పరిపాటి. ఇటీవలి సంవత్సరాలలో ఈ అంతరం తగ్గింది. 2012లో 21 లక్షలుగా ఉండగా అది ఈ ఏడాది 7 లక్షలకు తగ్గింది. 'సర్'తో ఈ అంతరం మరింతగా తగ్గక పోగా 16 లక్షలకు పెరిగింది.

ముస్లింల విషయంలో సాక్ష్యాధారాలు స్పష్టంగా లేవు. ఈసీఐ రికార్డులో ముస్లింలు ఒక అధికారిక వర్గంగా లేకపోవడమే అందుకు కారణం. అయితే పేర్ల గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించగా ఆందోళనకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి మినహాయింపబడిన 65 లక్షల మంది ఓటర్లలో ముస్లింలు 24.7 శాతం కాగా తుది జాబితాల నుంచి తీసివేసిన 3.88 లక్షల పేర్లలో వారు 33 శాతంగా ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వారి నిష్పత్తి 16.9 శాతంగా ఉండడం గమనార్హం. అంటే ఆరు లక్షల ముస్లిం ఓటర్ల పేర్లను అదనంగా తొలగించారు.



> బిహార్‌లో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ నిష్పాక్షికంగా జరగలేదు. బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా దేశ వ్యాప్తంగా 'సర్' అమలుకు ఈసీ పూనుకుంటే భారీ సంఖ్యలో ప్రజల ఓటుహక్కు రద్దయ్యేందుకు అవకాశమున్నది. పర్యవసానంగా ఎన్నికలపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు. భారత ప్రజాస్వామ్యానికి ఇదెలా మేలుచేస్తుంది?

తుది ఓటర్ జాబితాలు నిర్దుష్టంగా ఉన్నాయా? ప్రత్యేక సమగ్ర సవరణతో ఈ విషయంలో పరిస్థితి మరింత దిగజారినట్టు అర్థమవుతున్నది. 'సర్' ముందు జాబితాలు, 'సర్' తరువాతి జాబితాలలోని నిర్దుష్టతపై మరింత పరిశీలన జరగవలసి ఉన్నది. అయితే మా ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేశామన్న ఈసీఐ వాదన సమర్థనీయంగా లేదు. తుది ఓటర్ జాబితాలలో 24 వేల పేర్లు అర్థంకాని రీతిలో ఉన్నాయి. 5.2 లక్షల పేర్లు నకిలీవి. 6,000 మంది ఓటర్ల జెండర్ ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. రెండు లక్షల మంది ఓటర్ల ఇంటి నెంబర్లు సక్రమంగా లేవు. ప్రక్షాళన జరగాల్సింది ఇలాగేనా? చాలా అంశాలలో ముసాయిదా జాబితాల కంటే తుది జాబితాలు మరింత ఘోరంగా ఉన్నాయి.

ఓటర్ జాబితాల నుంచి విదేశీయుల (బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు అని చదువుకోండి) పేర్లను తొలగించడమే 'సర్' లక్ష్యమని బీజేపీ వాదించింది. ఈ వాదనతో ఈసీఐ ఏకీభవించింది. అయితే 'సర్'కు సంబంధించి ఈసీఐ తొలగించిన ఓటర్ల పేర్లను ఏ కారణాలతో తొలగించడం జరిగిందో రోజువారీ బులెటిన్‌లో వివరంగా తెలిపారు. అయితే ఇంటింటికి వెళ్లి ధ్రువీకరించుకున్న కార్యక్రమంలో ఎంతమంది విదేశీయులు తమ దృష్టికి వచ్చారన్న విషయమై ఎలాంటి వివరాలను ఈసీఐ వెల్లడించలేదు. విదేశీయుడు అన్న కారణంగా ఏ ఒక్క ఓటరు విషయంలోనూ బీజేపీ తన అభ్యంతరాన్ని ఈసీఐకి తెలుపలేదు. బిహార్ సీఈఓ వెబ్‌సైట్ ముసాయిదా జాబితాలకు 2.4 లక్షల ఫిర్యాదులు తమకు అందాయని పేర్కొంది. వీటిలో 1,087 మాత్రమే (మొత్తం ఓటర్లలో వీరు 0.015 శాతం మాత్రమే) భారతీయ పౌరులు కారనే కారణంతో చేసినవి. ఈ ఫిర్యాదుల్లో 226 మాత్రమే ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నవి కనుక మిగతా 779 విదేశీయులు అన్న ఆక్షేపణతో చేసినవి అయివుంటాయి. బహుశా వారంతా నేపాలీలు అయివుండొచ్చు. ఈ ఫిర్యాదుల్లో 390ని మాత్రమే ఈసీఐ ఆమోదించింది. తుది జాబితాల నుంచి సదరు ఓటర్ల పేర్లను తీసివేసింది. ఇలా తీసివేతకు గురైన వారిలో ముస్లింలు 87 మంది మాత్రమే ఉన్నారు.

పారదర్శకత, సక్రమత అనే ప్రమాణాల ప్రాతిపదికన ఈ తుది జాబితాల నాణ్యతను నిర్ధారించేందుకు సంపూర్ణ తనిఖీకి వేచివుండవలసిన అవసరం లేదు. 2003 నాటి సమగ్ర సవరణ ఉత్తర్వు ప్రతిని అందించాలని సమాచార హక్కు చట్టం కింద చేసిన అభ్యర్థనకు ఈసీఐ ప్రతిస్పందించనే లేదు. తుది ఓటర్ల జాబితాలను సరైన రీతిలో విడుదల చేయనే లేదు. అనేక విషయాలలో నియమ నిబంధనలకు విరుద్ధంగా ఈసీఐ వ్యవహరించింది. కనుకనే ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగించిన 65 లక్షల ఓటర్ల పేర్లను సంపూర్ణంగా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం అనివార్యమయింది. ప్రతి ఎన్నికల సంఘం విధిగా చేయవలసిన దానికి, గతంలో తాను నెలకొల్పిన సంప్రదాయాలకు విరుద్ధంగా ఈసీఐ వ్యవహరించింది. 'సర్' నిర్వహణపై ముందుగా సంప్రదింపులు చేయకపోవడం, హడావుడిగా అమలుపరచడం, అన్ని నిర్ణయాలనూ పారదర్శకంగా తీసుకోకపోవడం, ప్రతిపక్షాలతో కలహశీలంగా వాదప్రతివాదాలు చేయడం మొదలైనవన్నీ భారత ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే భావనను ప్రజలలో నెలకొల్పాయి.

వర్ధమాన దేశాలలోని ఎన్నికల సంఘాలకు ఆదర్శప్రాయంగా వెలుగొందిన, దేశ ప్రజల సంపూర్ణ విశ్వాసాన్ని పొందిన ఈసీఐ బిహార్‌లో 'సర్'ను అమలుపరిచిన తీరు ఆమోదయోగ్యంగా లేదని చెప్పక తప్పదు. బిహార్‌లో అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా దేశ వ్యాప్తంగా 'సర్' అమలుకు పూనుకుంటే భారీ సంఖ్యలో ప్రజల ఓటు హక్కు రద్దు జరిగేందుకు అవకాశమున్నది. పర్యవసానమేమిటి? ఎన్నికలపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు. భారత ప్రజాస్వామ్యానికి ఇదెలా మేలు చేస్తుంది?

(రాహుల్ శాస్త్రి సహకారంతో)

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఇరు మతాల మధ్య ఎటూ కాని మాలలు!

భారతదేశంలో హిందూ మతం వదిలి క్రైస్తవ మతం స్వీకరించిన అంటరాని జాతులు ఎదుర్కొనబోయే పరిస్థితుల గురించి డా. అంబేడ్కర్ 'అస్పృశ్యులకొక హెచ్చరిక', 'హిందువుల నుంచి దూరంగా', 'కులం – మతాంతీకరణ', 'మతం మార్చుకొన్న దళితుల పరిస్థితి' మొదలైన వ్యాసాలలో విపులంగా చర్చించారు. ఆయన ఈ వ్యాసాలు రాసి దాదాపు వందేళ్ళవుతోంది.

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చాక అంటరాని జాతుల ప్రజలను షెడ్యూల్డు కులాలు అని పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా 35కోట్ల మంది అంటరాని జాతుల ప్రజలు నేటికీ హిందువులుగా ఉన్నారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో కన్వర్టెడ్ క్రిస్టియన్లు 2శాతం, హిందూ మాల, హిందూ మాదిగ కుల సర్టిఫికెట్లతో విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు పొందుతూ చర్చిలకు వెళ్ళే ప్రజలు 20శాతం ఉంటారు.

1928లో సైమన్ కమిషన్ దక్షిణ భారత పర్యటన సందర్భంగా... ఇక్కడి క్రైస్తవ వర్గాల వారు తమ స్థితిగతులపైన కుల సమస్యపైన సమర్పించిన వినతి పత్రంలో "మతాంతరీకరణ పొందిన దళిత క్రైస్తవుల జీవన స్థితిగతులు, మతమార్పిడి చెందని హిందూ దళిత వర్గాల జీవన స్థితిగతులు ఒకేరకంగా ఉన్నాయి" అని పేర్కొన్నారు. 2025లో కూడా ఇంకా ఈ పరిస్థితులే కొనసాగుతున్నాయి. నేడు క్రైస్తవంలో కూడా కులాధిపత్యం, మత వివక్ష తీవ్రంగా కొనసాగుతున్నాయి. కమ్మ, రెడ్డి, కాపు, బ్రాహ్మణ, మాల, మాదిగ క్రైస్తవులు తమ కులాల క్రైస్తవులతో మాత్రమే సంబంధ బాంధవ్యాలు కలుపుకుంటున్నారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభావం చూపిన కారంచేడు, చుండూరు ఉద్యమ ఫలాలను క్రైస్తవ సంస్థలు, ఎన్‌జీఓలు వందల కోట్ల నిధుల రూపంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి తెచ్చుకున్నాయి. దళిత ఉద్యమ ఫలితంగా ప్రభుత్వాలు స్పందించి విద్య, ఉపాధి, ఉద్యోగ, సంక్షేమ, పునరావాస పథకాలను బాధితులకు అందించాయి. దళిత ఉద్యమ ఫలితంగానే యస్.సి, యస్.టి అత్యాచార చట్టం అమలులోకి వచ్చింది. క్రైస్తవ చర్చిలు, ఎన్‌జీఓలు మాత్రం రకరకాల దళిత ఉద్ధరణ ప్రాజెక్టుల ద్వారా వందల కోట్ల విదేశీ నిధులు తెచ్చుకొని బాధితులకు కానీ, దళిత క్రైస్తవులకు కానీ పైసా విదల్చలేదు. నేటికీ చర్చిలు, ఎన్‌జీఓలు దళిత ఉద్ధరణ పేరుతో విదేశీ నిధులు పొందుతూ విలాసవంతమైన సామ్రాజ్యాలు నిర్మించుకుంటున్నాయి.



హిందూ మతం దళితులను అంటరాని వారిగా సమాజానికి దూరంగా తరిమివేసింది. క్రైస్తవ మతం మాల మాదిగ పల్లెలను కేథలిక్కులు, ప్రొటెస్టెంట్లు, బాప్టిస్టులు, బ్రదరన్ గ్రూపు, యెహోవా సాక్షులు... ఇలా ముక్కలు చెక్కలుగా దళితుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసింది.

ప్రస్తుతం భారతదేశంలో 2 కోట్ల 80 లక్షల మంది క్రైస్తవులు ఉన్నారు. వీరిలో 30 లక్షల మంది అగ్రకులస్థులు. 2 కోట్ల 50 లక్షల మంది హిందూ మతం వదలి క్రైస్తవ మతం స్వీకరించిన దళితులు. వీరంతా కన్వర్టెడ్ క్రిస్టియన్లు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో అధికారికంగా క్రైస్తవం స్వీకరించిన వారు బీసీ(సీ)గా పరిగణించబడుతున్నారు. వీరు దళిత కులాల జనాభాలో 2శాతం. వీరు కాకుండా దళిత కులాలలో 20శాతం మంది హిందూ, మాల మాదిగ కులాలుగా ధ్రువీకరణ పత్రాలు పొంది విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి, సంక్షేమ ఫలాలు పొందుతూ చర్చిలకు వెళుతున్నారు. హిందువులుగా కొనసాగుతున్న 80శాతం మంది మాలలకు ఎలాంటి అస్తిత్వం లేదు. కారణం హిందువులుగా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది క్రైస్తవ మత విశ్వాసంలో ఉన్న మాలలే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ముందున్నారు. హిందూ మాలలు 80శాతం మందిని హిందూ సమాజం దూరంగా నెట్టివేస్తే, అన్ని రంగాలలో ముందున్న క్రైస్తవ మాల సమాజం అన్యులుగా ముద్ర వేసి మరింత దూరం పెట్టింది.

దళిత ఉద్యమ, పోరాటాల ఫలితంగా, విద్యా, ఉద్యోగ సంక్షేమ రంగాలలో ఎస్సీ, ఎస్టీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెరిగి ఉచిత, విద్య, వైద్యం, హాస్టళ్ళు, ఫీజు రీయింబర్స్‌మెంటు వంటి అనేక ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయి. క్రైస్తవ మిషనరీలు పూర్తిగా సంక్షేమ కార్యక్రమాలు ఆపివేసాయి. మిషనరీల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విద్యా సంస్థలు, హాస్పిటల్ సేవలు అన్నీ ఫీజులు చెల్లించి పొందాల్సిన పరిస్థితి దళిత క్రైస్తవులకు ఏర్పడింది. మతం మార్చుకొని, క్రైస్తవ జీవన విధానంలో ఉన్న అంటరాని వారి సామాజిక స్థాయిని క్రైస్తవం పెంచగలిగిందా అంటే అదీ లేదు. దళిత క్రైస్తవ విద్యావంతులకు తమ కుల సమస్యల పట్ల స్పందించి పోరాడే గుణం లేదు. హిందూ మతం దళితులను అంటరాని వారిగా సమాజానికి దూరంగా తరిమివేసింది. క్రైస్తవ మతం మాల మాదిగ పల్లెలను కేథలిక్కులు, ప్రొటెస్టెంట్లు, బాప్టిస్టులు, బ్రదరన్ గ్రూపు, యెహోవా సాక్షులు... ఇలా ముక్కలు చెక్కలుగా దళితుల సంఘటిత శక్తిని నిర్వీర్యం చేసింది. దళిత విద్యావంతులు, రిజర్వుడు ఉద్యోగులు తమ దళిత సోదరుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయకుండా, అంతా ప్రభువే చూసుకుంటాడు అని శుష్క పలుకులు పలుకుతున్నారు. హిందువులుగా ఉన్న 80 శాతం మాలలు హిందూ సమాజం నుంచి, తమ పొరుగున ఉన్న దళిత క్రైస్తవ సమాజం నుంచి కూడా తిరస్కారం పొందుతున్నారు. వారు అగ్రకుల హిందువులకు, దళిత క్రైస్తవులకు మధ్య నలిగి అస్తిత్వాన్ని కోల్పోయారు.


హిందువులుగా ఉన్న మాలలు ఆచరిస్తున్నది నేడు సమాజంలో ఉన్న కులాధిపత్య, నిచ్చెనమెట్ల, ఛాందస బ్రాహ్మణ, మనువాద, సనాతన హిందూ ధర్మం కాదు. భారత దేశాన్ని నిర్మించి, పాలించిన, సింధూ నాగరికత, వ్యవసాయ సంస్కృతి, సహోదరత్వం, సకల జనుల క్షేమం పునాదిగా ఉన్న మాతృస్వామిక పురాతన హిందూ ధర్మాన్ని వారు ఆచరిస్తున్నారు. బేతాళ పురాణం, మాల చెన్నయ్య కథ, జాంబపురాణం, కాకతీయ సామ్రాజ్య సేనాధిపతి యుగంధరుడు, పల్నాటి సర్వసైన్యాధ్యక్షుడు మాలకన్నమనీడు, మాలమాస్టీన్‌లు, వీరవిద్యావంతులు, హరిదాసులు, గతించిన నాగరాజ్యాలు, గణాలు, ఉరుముల కథకులు, కాటిపాపరులు, పోలేరమ్మ, గొంతేలమ్మ, గంగమ్మ, అంకాలమ్మ, పోచమ్మ జాతరలు, దేవర స్థలాలు... ఇవన్నీ నేటికీ మనుగడలో ఉండి హిందూ మాలల సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. సర్వమానవాళి శ్రేయస్సును కాంక్షించే పురాతన హిందూ ధర్మాన్ని నేటికీ ఆచరిస్తున్న మాల హిందువులు క్రైస్తవ సంస్థల ఉన్మాదం, వివక్ష, దోపిడీతో పాటు అన్ని రకాల మతోన్మాదాలను సమైక్యంగా తిప్పికొట్టి, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి.

● మల్లెల వెంకట్రావు

మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు

బహుజన హితమే కాన్షీరామ్ అభిమతం

కులాల కుంపట్లతో దేశ వ్యవస్థలు, రాజకీయాలు మలినమవుతున్న తరుణంలో బహుజనుల బతుకులు మార్చడానికి భారత రాజకీయ యవనికపైకి వచ్చిందో ధ్రువతార. ఆయనే మాన్యశ్రీ కాన్షీరామ్. పూణేలోని ఓ లేబొరేటరీలో సైంటిస్టుగా పనిచేస్తున్నప్పుడు అక్కడ జరిగిన కొన్ని సంఘటనలు ఆయన జీవితాన్ని మలుపుతిప్పాయి. అప్పుడే తన జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని అటువైపుగా పయనించాలని బలంగా సంకల్పించుకున్నారు కాన్షీరామ్. అంబేడ్కర్ రచించిన 'కులనిర్మూలన పుస్తకం' ఆయన్ను మరింతగా ప్రభావితం చేసింది. 1971లో 'దళిత్ శోషిత్ సమాజ్ సంఘర్ష్ సమితి'ని ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో అది 'ఆలిండియా బ్యాక్‌వర్డ్, మైనారిటీ కమ్యూనిటీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్'గా మారింది. ఈ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ఉద్యోగులను సమీకరించి అంటరానితనం, అస్పృశ్యత వంటి సామాజిక రుగ్మతలపై పోరాటం సాగించారు. బుద్ధుడు, పూలే, పెరియార్, నారాయణగురు, అంబేడ్కర్‌లను తన గురువులుగా ప్రకటించుకున్నారు. దేశంలోని అగ్రకుల వ్యవస్థీకృత రాజకీయాలను ప్రక్షాళన చేయడం కోసం నడుం బిగించారు. 'ఓట్లు మావి, సీట్లు మీవా?' అని నినదించారు. 1984 ఏప్రిల్ 14 (అంబేడ్కర్ జయంతి)న బీఎస్పీని స్థాపించారు. బహుజనులను కూడగట్టి వారిలో రాజ్యాధికార కాంక్షను రగిలించారు. బీఎస్పీని దేశంలో అతిపెద్ద మూడవ జాతీయ పార్టీగా తీర్చిదిద్దారు. రాజకీయ దర్పానికి, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ తను నమ్మిన సిద్ధాంతం కోసం నిష్కళంకంగా, నిర్విరామంగా పనిచేసిన కాన్షీరామ్ ఈ దేశ బహుజనులకు ఆదర్శప్రాయుడు.



– ధీరన్ కొడారి

(నేడు కాన్షీరామ్ వర్ధంతి)

వికసిత్ భారత్‌కు 'యువజన' బాట

ఒక దశాబ్దం క్రితం వరకు పేదరికం, నిరుద్యోగం, ఆహార సంక్షోభం వగైరా సమస్యలకు దారితీస్తోందనే సాకుతో జనాభా పెరుగుదలపై ఆందోళనలు వ్యక్తమవుతుండేవి. అంతకంతకు పెరుగుతున్న జనాభాను మానవవనరులుగా పరిగణించే సానుకూల భావన ఇటీవల ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆ మధ్య తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కువమంది పిల్లల్ని కనాలంటూ పిలుపునివ్వడం తెలిసిందే. ఈ నేపథ్యంలో జనాభా పెరుగుదల అనేది ప్రతికూలత కన్నా ఎక్కువగా అనుకూలతను వ్యాప్తి చేస్తోంది. యువశక్తిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశం కొంతవరకు సరైనదే అయినా... వనరులు, మౌలిక సదుపాయాలు లేకుండా జనాభా పెరుగుదల అనారోగ్యకరమని అంగీకరించాల్సిందే. విద్య, ఉపాధి, ఆరోగ్య సేవలు సమర్థంగా లేని పరిస్థితిలో, అధిక జనాభా సామాజిక అసమానతలను, వనరులపై ఒత్తిడిని మరింత పెంచుతుంది.

'పాపులేషన్ హాలిడే' భావన అనేది నిర్దిష్ట కాలానికి జనాభా పెరుగుదలపై అంక్షలు విధించడాన్ని సూచిస్తుంది. ఇది పంటకు ఇచ్చే విరామం లాంటిది. భూసారం పెంచేందుకు పంటల విరామం పాటించడం ఆనవాయితీ. దీన్ని క్రాప్ హాలిడే అంటారు. ముక్కారు పంటలు పండే చోట కూడా నేలను కొంత కాలం ఖాళీగా ఉంచి విరామం ఇవ్వడం వల్ల భూమిలో పోషకాల సమతుల్యత సర్దుబాటు అవుతుందనేది శాస్త్రవేత్తల మాట. సహజవనరుల ఆదాకు చైనా లాంటి దేశాలు జనాభా విరామాన్ని అధికారికంగా అమలు చేసే క్రమంలో దశాబ్దం గడిచే సరికి సంతానోత్పత్తి రేటు దారుణంగా క్షీణించింది. అయితే మనదేశంలో కుటుంబ నియంత్రణ కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ప్రభుత్వ పరంగా కాకుండా ప్రజలస్వామ్యంతో విజయవంతమయింది. చిన్న కుటుంబాల సిద్ధాంతం విజయవంతం కావడం అనేది మహిళల విద్య, ఆరోగ్య పరిరక్షణలో పెట్టుబడి వల్ల సాధ్యమైంది. దీన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తే జనాభా నియంత్రణ సాధ్యపడుతుంది. చిన్న కుటుంబాలకు పన్ను లాభాలు, ప్రోత్సాహకాలు ఇవ్వడం ఈ విధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

జనాభా పెరుగుదల సహజవనరులైన నేల, నీరు, ఇంధనం వగైరాలపై ఒత్తిడి కలిగించి, వాటి కొరతకు దారితీస్తుంది. అధిక జనాభా వల్ల పర్యావరణానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదు. సమాజంపై దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందనడానికి పెచ్చరిల్లే నిరుద్యోగం, పేదరికం, నివాసాల లేమి, ఆహార సంక్షోభం, విద్యా వైద్య వనరుల్లో కోత ఆపై పట్టణాలు, నగరాలు కిక్కిరిసిపోవడం... ఇలా అనేక సమస్యలకీ అధిక జనాభా ప్రధాన కారణమవుతుంది. ఈ సమస్యలు మన దేశంలో స్పష్టంగా కనిపిస్తాయి. మొత్తంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై జనాభా పెరుగుదల భారంగా పరిణమిస్తుంది. జనాభా పెరుగుదల అదుపులోకి రావాలంటే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అవసరమవుతుంది.

జనాభా పెరుగుదల ఆర్థికవృద్ధికి దారితీయదు. ప్రపంచంలోని కొన్ని పేద దేశాలలో అధిక జనాభా ఉంది. శ్రమశక్తిలో చురుకుగా పాల్గొనే కార్మికుల విద్య, నైపుణ్యాలు ఆర్థిక వృద్ధిని ప్రభావితం చేస్తాయి. జనాభా గణాంకాలు ఆర్థిక వృద్ధి భవితవ్యాన్ని నిర్ణయించవు. అయితే అవి ఆర్థిక వ్యవస్థ వృద్ధి సామర్థ్యానికి కీలకం కావచ్చు. అభివృద్ధి చెందిన దేశాలలో తగ్గుతున్న జనన రేటుతో పాటు వృద్ధాప్య జనాభా భవిష్యత్తులో ఆర్థిక వృద్ధిలో తగ్గుదలను సూచిస్తుంది. విద్య, నైపుణ్యాలు, ఉత్పాదకత పెరుగుదల వగైరా చర్యలు జనాభా మార్పుల ప్రభావాన్ని తగ్గించగలవు. సాంకేతిక పురోగతి ఉత్పాదకత పెంపుదలకు ఒక మూలం. జనాభాలో యువజన సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాలు బాగా లబ్ధి పొందుతాయి. ప్రపంచంలో అధిక యువజనాభా కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. 2024లో దాదాపు 65 శాతం భారతీయ జనాభా 35 ఏళ్లలోపు వారే. ప్రపంచవ్యాప్తంగా పనిచేసే వయస్సు కలిగిన కార్మిక జనాభా తగ్గుతుండగా, పనిచేయని జనాభా పెరుగుతోంది. శ్రామికశక్తి జనాభా తగ్గుతున్న

> జనాభాలో యువజన సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాలు బాగా లబ్ధి పొందుతాయి. ప్రపంచంలో అధిక యువజనాభా కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. 2024లో దాదాపు 65 శాతం భారతీయ జనాభా 35 ఏళ్లలోపు వారే. ఆర్థిక వృద్ధిని నిలబెట్టుకోవాలంటే, జననాల రేటు పెద్ద మొత్తంలో పెరగాలి లేదా ఉత్పాదకత పెరుగుతూనే ఉండాలి.



ప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానంలో పురోగతి కారణంగా యూరప్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందింది. జపాన్‌లో, కొరియాలో వృద్ధుల జనాభా ఆందోళన కలిగిస్తోంది. సామాజిక భద్రత, వైద్య సేవలు సవాలుగా మారాయి. అమెరికా, యూరోపియన్ దేశాలలో శ్రామిక వయస్సు జనాభా గరిష్ఠ స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. 2040 నాటికి యువ జనాభా కనీస స్థాయికి చేరుకుని శ్రామిక సంక్షోభం తలెత్తుతుందని అంచనా. తక్కువ శ్రామికశక్తి జనాభా కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి భవిష్యత్తులో తగ్గే అవకాశాన్ని సూచిస్తోంది. సాంకేతిక పురోగతి ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇస్తున్నది. ఆర్థిక వృద్ధిని నిలబెట్టుకోవాలంటే, జనన రేటు పెద్ద మొత్తంలో పెరగాలి లేదా ఉత్పాదకత పెరుగుతూనే ఉండాలని చాలామంది భావిస్తున్నారు. సాంకేతిక ఆవిష్కరణల కారణంగా ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత నైపుణ్యాలలో శిక్షణ పొందిన వారికి లబ్ధి చేకూరుతుంది.

ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ మధ్య, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారత, రష్యా ఆర్థిక వ్యవస్థలను ఉద్దేశించి 'డెడ్ ఎకానమీ' (నిర్వీర్య ఆర్థిక వ్యవస్థ)లు అంటూ ఎత్తి పొడిచారు. ప్రపంచంలో అతి పెద్ద జనసంఖ్య కలిగిన దేశంగా మారిన భారతదేశం ఏ రకంగా చూసినా డెడ్ ఎకానమీ అనిపించుకోదు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగిన సదుపాయాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి పెడితే, జనవనరుల ద్వారా అద్భుతాలు చేసే వీలుంది. దేశీయంగా బలమైన మార్కెట్ ఉన్న దేశం ఎప్పటికీ నిర్జీవం కాదు. అసలు అతిపెద్ద వినిమయ దేశంగా ఉన్న అమెరికానే ఇప్పుడు ఆర్థిక సంక్షోభం కోరల్లో ఉంది. అమెరికా అభివృద్ధి చెందిన దేశమే అయినా, దాని ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి రేటు నమోదు చేయడం లేదు. అమెరికా ప్రభుత్వ రుణభారం 35 ట్రిలియన్ డాలర్లు మించిపోయింది. అదే సమయంలో భారతదేశంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు వేగం అందుకున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగానే ఉంది. ట్రంప్ చెప్పిన దానికి, వాస్తవానికి పొంతన లేనేలేదు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే ముందు మన ప్రజల ప్రయోజనాలే అంతిమ లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అడుగులు వేయాలి.

ట్రంప్ 'డెడ్ ఎకానమీ' ఎత్తి పొడుపును సవాల్‌గా తీసుకున్న ప్రధాని మోదీ 'వికసిత భారత్' లక్ష్యాన్ని మరింత దృఢంగా పునరుద్ఘాటించారు. ఈ లక్ష్య సాధన ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలు, ప్రజల ఆశయాల్లో భాగంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, ఇంధన స్వాతంత్ర్యం కలిగి ఉండడం, డిజిటల్ రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని సాధించడం, ఉత్పత్తి–సేవల రంగాల్లో అంతర్జాతీయ పోటీతత్వం ప్రదర్శించడం మొదలైన లక్ష్యాల సాధనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ లక్ష్యాలను నిజంగా అభివృద్ధిగా మార్చాలంటే, ఎన్నో విషయాల్లో పురోగతి చెందాలి. ముఖ్యంగా నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. కార్మిక చట్టాల సరళీకరణ, భూసంస్కరణలు, బ్యాంకింగ్ రంగంలో నాన్–పెర్ఫార్మింగ్ అసెట్స్ క్లీన్–అప్, పచ్చదనం, డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అనే సంస్కరణలు లేకుండా సుస్థిర అభివృద్ధి సాధ్యం కాదు. ఈ మార్పులతో మాత్రమే భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచ నాయకత్వ స్థానాన్ని సొంతం చేసుకొనే మార్గం సుగమం అవుతుంది.

■ నిమ్మగడ్డ లలితప్రసాద్

డైరెక్టర్, బ్రహ్మయ్య అండ్ కో



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
గురువారం 9 అక్టోబరు 2025

సమరానికి సై

నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్



- రెండు విడతల్లో పరిషత్, మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- తొలి విడతకు నేటి నుంచి 11వరకు నామినేషన్ల స్వీకరణ
- 15న ఉపసంహరణ.. 23న ఎన్నికలు..
- రెండో విడతకు 13వ తేదీ నుంచి 15వరకు నామినేషన్లు
- 19న ఉపసంహరణ.. 27న ఎన్నికలు.. నవంబరు11న రెండు విడతల ఓట్ల లెక్కింపు
- ఉమ్మడి జిల్లాలో 778 ఎంపీటీసీ, 74 జడ్పీటీసీ, 1,708 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
- తొలి విడతలో 37, రెండో విడతలో 38 మండలాల్లో ఎన్నికల నిర్వహణ
- అక్టోబరు 17నుంచి నవంబరు 8వ తేదీ వరకు మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

స్థానిక ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లపై బుధవారం హైకోర్టులో వాదోపవాదాలు జరగగా, తుది తీర్పును గురువారం మధ్యాహ్నం 2.30గంటలకు ప్రకటించే అవకాశం ఉంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లతో ఇప్పటికే ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. గురువారం షెడ్యూల్ ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రెండు విడతల్లో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించనుంది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలు కానుంది.

రెండు విడతల్లో ఎన్నికలు..

ప్రభుత్వం తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. గురువారం పరిషత్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 75 మండలాలు ఉన్నాయి. వీటిలో ములుగు జిల్లా మంగపేట మండలంలో ఎన్నికలపై కోర్టు స్టే ఉండటంతో అక్కడ మినహా మిగతా 74 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి విడతలో ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 12వ తేదీన నామినేషన్ల పరిశీన, 15వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. 23న ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

అలాగే రెండో విడతలో 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అలాగే 16వ తేదీన నామినేషన్ల పరిశీలన, 19వ తేదీన ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. 27 తేదీన ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

ఇక సర్పంచ్ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. తొలి విడత 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 20వ తేదీన నామినేషన్ల పరిశీలన, 23వ తేదీన ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. 31న ఎన్నికలు నిర్వహించి, అదే రోజు ఓట్ల లెక్కింపు చేయనున్నారు. రెండో విడత సర్పంచ్ ఎన్నికలకు 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 24వ తేదీన పరిశీలన, 27వ తేదీన ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. నవంబరు 4వ తేదీన ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేయనున్నారు. మూడో విడత 25వ తేదీ

(మిగతా 7లో..)

తొలి, మలి విడతల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వివరాలు

విడత	నామినేషన్లు	చివరి తేదీ	పరిశీలన	ఉపసంహరణ	ఎన్నికలు
1	అక్టోబరు 9	అక్టోబరు 11	అక్టోబరు 12	అక్టోబరు 15	అక్టోబరు 23
2	అక్టోబరు 13	అక్టోబరు 15	అక్టోబరు 16	అక్టోబరు 19	అక్టోబరు 27
సర్పంచ్..					
1	అక్టోబరు 17	అక్టోబరు 19	అక్టోబరు 20	అక్టోబరు 23	అక్టోబరు 31
2	అక్టోబరు 21	అక్టోబరు 23	అక్టోబరు 24	అక్టోబరు 27	నవంబరు 4
3	అక్టోబరు 25	అక్టోబరు 27	అక్టోబరు 28	అక్టోబరు 31	నవంబరు 8

బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తు ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. వీటికి 42శాతం బీసీ రిజర్వేషన్లు కలిపితే 69శాతం రిజర్వేష్లు అవుతుంది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మించకూడదని రెడ్డి జాగృతి నేతలు హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం జాగృతి నేతలు, ప్రభుత్వం తరుఫున హైకోర్టులో వాదనలు వినిపించారు. సుదీర్ఘంగా సాగిన వాదనల అనంతరం హైకోర్టు గురువారం మధ్యాహ్నానికి తీర్పు వాయిదా వేసింది. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం 10.30గంటలకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. దీంతో కోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికి. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తొలి రోజే పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేసేందుకు కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతున్నారు. పార్టీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు గురువారం నామినేషన్‌లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ నేతలు మాత్రం హైకోర్టు తీర్పు వచ్చే వరకు ఎదురుచూడాలని నిర్ణయించకున్నారు.

సమన్వయంతోనే ట్రాఫిక్ నియంత్రణ

- పలుచోట్ల నూతనంగా సిగ్నల్స్ ఏర్పాటు
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో సమావేశం



మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, పక్కన సీపీ

వరంగల్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ కలిసి సమన్వయంతో పని చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటలో రోజురోజుకూ వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతున్న దృష్ట్యా సమస్యను అధిగమించడంలో భాగంగా బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి ఆధ్వర్యంలో ట్రాఫిక్, మున్సిపల్ అధికారులతో సీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్కింగ్ స్థలాలు, రోడ్ల ఆక్రమణ, ప్రధాన మార్గాల్లో రోడ్ల గుంతలకు మరమ్మతులు, వడ్డేపల్లి, కాళోజీ సెంటర్, మడికొండ చౌరస్తా, తెలంగాణ జంక్షన్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, రోడ్లపై వ్యాపారుల సైన్ బోర్డులు తొలగించడం, వ్యాపార సముదాయాల్లోని సెల్లార్‌లలో వాహనాలు మాత్రమే పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవడంతో

(మిగతా 6లో..)

గంజాయి రవాణాదారుల అరెస్టు

- రూ.20.50 లక్షల విలువ గల సరుకు స్వాధీనం
- నిందితులు పశ్చిమ బెంగాల్ వాసులు



వివరాలను వెల్లడిస్తున్న హనుమకొండ ఏసీపీ పి.నర్సింహారావు

హసన్‌పర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని కేయూ పోలీసులు మంగళవారం ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ నర్సింహరావు తెలిపారు. వారి వద్ద రూ.20.50 లక్షల విలువ చేసే 41 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాకతీయ వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏసీపీ నర్సింహరావు కేసు వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కొచ్ బెహర్ దిన్హతకు చెందిన రాణా హుస్సేన్ పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. డబ్బులు సరిపోకపోవడంతో ఇదే గ్రామానికి చెందిన గంజాయి రవాణా చేసే కృష్ణచంద్ర బర్మన్ వద్ద నాలుగు నెలల కిందట తన దగ్గర ఉన్న డబ్బుతో గంజాయి కొనుగోలు చేశాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ గచ్చిబౌలి, కోకాపేటతో పాటు కూలీల అడ్డా వద్ద గంజాయి అమ్మేవాడు. తన గ్రామానికి చెందిన స్నేహితుడు సెంట్రింగ్ పనిచేస్తున్న నూర్ మహ్మద్ మియాతో కలిసి గంజాయి రవాణా చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పాడు. దీంతో ఇద్దరు కలిసి చెరో రూ. లక్ష వేసుకొని రూ.2 లక్షలతో గంజాయి విక్రయదారుడు కృష్ణచంద్ర బర్మన్ వద్ద 41 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ప్యాకెట్లు చేసి లగేజ్ బ్యాగులలో వేసుకొని మంగళవారం ముచ్చర్ల క్రాస్‌రోడ్డు వద్దకు ఆటోలో చేరుకున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు లారీలు అపే క్రమంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఎస్సై ఎ.కల్యాణ్‌కుమార్, కానిస్టేబుళ్లు కె.భిక్షపతి, పి.తరుణ్‌కుమార్, హీరాలాల్ శర్మ, బి.రవీందర్‌ను ఏసీపీ అభినందించారు.

'బెస్ట్ అవైలబుల్' బకాయిలు విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల బైఠాయింపు



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు


హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): 'బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ పరిధిలోని విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని హనుమకొండ కలెక్టరేట్ ఎదుట బుధవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ధర్నా చేశారు. బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఇప్పటికైనా విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు నినాదాలు చేశారు. కలెక్టరేట్ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని, లేదంటే ఇక్కడి నుంచి కదలబోమని విద్యార్థులు, తల్లిదండ్రులు రోడ్డుపై భీష్మించుకూర్చున్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు విద్యా సంవత్సరం మధ్యలో ఫీజులు కట్టాలని చెబుతున్నారన్నారు. దీంతో సుమారు 30నిమిషాల పాటు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. సుబేదారి పోలీసులు ఆందోళన చేస్తున్న బాధితులను కలెక్టరేట్‌లోకి అనుమతించడంతో బాధితులు జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నా, బైఠాయింపు కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఛైర్మన్ చందా మల్లయ్య, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్, స్వేరోజ్ జిల్లా మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్, గుగులోతు రాజన్న, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మైదం రవి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్కూరి సునిల్, యేసోబు, మురళి, విద్యార్థుల తల్లిదండ్రులు మహేందర్, అనిల్, తితరుపతి, రాజేష్, వినయ్, నరేష్, సాంబయ్య, సమ్మయ్య, రాజేందర్, ప్రణీత, వాణి, శ్వేత, అశ్విని, రజినితోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా నేర నియంత్రణ చట్టాలు

- చట్టాల అమలులో కంటి తుడుపు చర్యలు
- నల్సార్ వర్సిటీ లా ప్రొఫెసర్ కృష్ణదేవరావు
- కేయూలో బాలగోపాల్ ఎండోమెంట్ లెక్చర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణదేవరావు




మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

కేయూ క్యాంపస్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యక్తుల స్వేచ్ఛను హరించేలా నేర నియంత్రణ చట్టాలు ఏకపక్షంగా నడుస్తున్నాయని హైదరాబాద్ నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కృష్ణదేవరావు అభిప్రాయపడ్డారు. బుధవారం కేయూ సెనెట్ హాల్‌లో బాలగోపాల్ ఎండోమెంట్ లెక్చర్ జరిగింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కృష్ణదేవరావు 'కన్‌స్టిట్యూషలైజేషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. నేర నియంత్రణ, ప్రక్రియలలో సంఘర్షణ ఉందన్నారు. చట్ట సంబంధిత వ్యక్తులు, పోలీస్‌ల మధ్య సంఘర్షణ ఉందన్నారు. నేర నియంత్రణ కాగితాలపైనే ఉందన్నారు. ఖైదీల హక్కులు, పోలీస్ సంస్కరణలు అవసరమన్నారు. చట్టాల అమలులో కంటి తుడుపు చర్యలు వద్దన్నారు. జైళ్ల అండర్ ట్రయల్స్ ఖైదీలో నిండి ఉన్నాయన్నారు. లీగల్ ఎయిడ్ అవశ్యతను వివరించారు. టెక్నాలజీ అందుబాటులోకి రావాలని చెప్పారు. డిజిటల్ ఫోరెన్సిక్స్ అవశ్యత అవసరమన్నారు. రాజ్యాంగవాద ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌ను ఉదాహరించారు. బాలగోపాల్ బహుముఖ ప్రజ్ఞశాలని, 21వ శతాబ్దపు ప్రత్యేక వ్యక్తి అని కొనియాడారు.

ప్రముఖ సామాజిక వేత్త, రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. బాలగోపాల్ దృక్పథానికి సమాజమే కేంద్రమన్నారు. యువత ఆయన స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. కేయూ గోల్డెన్ జూబ్లీ సందర్భంలో బాలగోపాల్ స్మారక ఉపన్యాసం జరుగుతోందన్నారు. బాలగోపాల్ రచనలు సమాజం చదవాలని చెప్పారు. వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. స్మారకోపన్యాసాలతో విద్యార్థులు మంచి ప్రేరణ కలుగుతోందన్నారు. ఈ సందర్భంగా బాలగోపాల్ సతీమణి వసంత లక్ష్మి బాలగోపాల్ రచనల పుస్తకాలను వర్సిటీ గ్రంథాలయానికి బహుకరించారు. సభ ప్రారంభంలో బాలగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎ.సదానందం, మాజీ వీసీ సీతారామారావు, ప్రొఫెసర్ కిష్టయ్య, అకూట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, ఏసీపీ జితేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, పిమల్లారెడ్డి, కట్ల రాజేందర్, లా ప్రిన్సిపాల్ నిమ్మ సుదర్శన్, పలు విభాగాధితులు, పరిపాలన అధికారులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో జీయర్ స్వామి



హనుమకొండ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అష్టాక్షరి పీఠ వ్యవస్థాపకుడు, అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి మూడు రోజుల పర్యటన కోసం బుధవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. కవిశాబ్దిక కేసరి నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్య స్వామి శత జయంతి ఉత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. అదే విధంగా నగరంలోని పలు ఆలయాలను స్వామివారు సందర్శిస్తారు. గురువారం హనుమకొండ ఏకశిలా పార్కు సమీపంలోని శ్రీ సీతారామచంద్ర, ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో రఘునాథచార్యస్వామి వారి శత జయంతి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా వెలువరించిన ప్రత్యేక గ్రంథాన్ని ఆవిష్కరించి అనుగ్రహభాషణం చేయనున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు సముద్రాల శఠగోపాచార్య నేటి తరానికి రామాయణ వైవిధ్యంపై ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు. బుధవారం నగరానికి చేరుకున్న అష్టాక్షరి జీయర్ స్వామికి సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ పక్షాన శఠగోపాచార్యతోపాటు ఎస్ఆర్ విద్యాసంస్థల నిర్వాహకులు సుమతి వరదారెడ్డి, వికాస తరంగిణి సభ్యులు, చిన్నజీయర్ స్వామి శిష్యులు పూర్ణకుంభంతో స్వాగతించారు. ఆదివారం స్వామివారు సుమతి వరదారెడ్డి స్వగృహంలో తీర్థ గోష్ఠి నిర్వహించనున్నారు.

బాణసంచా దుకాణాల కోసం
దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి



వరంగల్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని తాత్కాలిక బాణసంచా విక్రయ కేంద్రాల అనుమతి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు దరఖాస్తు సమయంలో అగ్నిమాపక శాఖ జారీ చేసే ఎన్ఓసీతో పాటు ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసినట్లయితే సంబంధిత స్థల యజమాని అనుమతి పత్రం, ప్రభుత్వ స్థలమైతే ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం, సొంత స్థలంలో అయితే పక్క బిల్డింగ్ వారి అనుమతి తీసుకొని స్టేట్ ఆఫ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అదాలత్ శాఖలో రూ.800 ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లుగా సంబంధిత బ్యాంక్ నుంచి చలానా పొందాలన్నారు. అనంతరం వాటి న్నింటినీ జత చేసి అక్టోబర్ 16వ తేదీలోపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ లోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్లలోని విక్రయదారులు ఆయా డీసీపీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులు అనుమతులు ఇస్తారని సీపీ పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శివరాత్రి రవీందర్ (ఫైల్)

ధర్మసాగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగరావుపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి రవీందర్ (43) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జానీ పాషా బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రవీందర్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. రవీందర్ మంగళవారం రాత్రి ఇంటి నుంచి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుమందు తాగాడు. ఈ విషయన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. రవీందర్‌ను వారు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవీందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది.

అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలి

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● కార్పొరేషన్‌లో పలు విభాగాల అధికారులతో సమావేశం



సమావేశంలో శానిటేషన్ గురించి తెలుసుకుంటున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్, ఐసీసీసీ, మెప్మా, డీఆర్ఎఫ్ విభాగాల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిషనర్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కన్‌స్ట్రక్షన్, డిమాలీషన్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బయోమెథనైజేషన్‌కు సంబంధించిన టెండర్లు పూర్తి చేసి నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. ఇంటీరియల్ రికార్డ్ ఫెసిలిటీ (ఐఆర్ఎఫ్) కోసం ఏజెన్సీలకు స్థలం గుర్తించి టెండర్లు ఆహ్వానించాలని ఎస్ఈని ఆదేశించారు. వాహన మరమ్మతుల్లో జాప్యాన్ని వీడి క్రమశిక్షణతో పని చేయాలన్నారు. సిబ్బందిని నియమించుకుని వాహన మరమ్మతులను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఐసీసీసీ సిబ్బంది బల్క్ జనరేటెడ్ వేస్ట్‌కు వాహనాలు ఏర్పాటు చేసి వారికి రూట్ మ్యాప్ ఇవ్వాలన్నారు. చెత్త సేకరణకు ఉపయోగించిన వాహనాల పని తీరును ఐసీసీసీ నుంచి పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, డీసీ సమ్మయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కంపోస్టును విక్రయించాలి

కంపోస్టు ఎరువులను బ్రాండ్‌ల పేరుతో విక్రయాలు జరపాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సూచించారు. బుధవారం నగర పరిధిలోని పలివేల్పుల, కాకతీయ యూనివర్సిటీ, ఫిల్టర్‌బెడ్, పోతన రోడ్డుతోపాటు బల్దియా ప్రధాన కార్యాలయంలోగల బయోగ్యాస్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు సమర్థవంతంగా చేసేందుకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వర్మీ బయో కంపోస్ట్ యూనిట్లు టెండర్లు పూర్తి చేసి వర్క్ ఆర్డర్లు ఇచ్చామన్నారు. బయోగ్యాస్ ఉత్పత్తి పలివేల్పుల ప్రాంతంలో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేస్తామన్నారు. బయో కంపోస్ట్ ఎరువులను తయారుచేసిన తర్వాత మెప్మా ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ బాషా నాయర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆపద్బాంధవులు అల్లం దంపతులు

పేద విద్యార్థులకు, వృద్ధులకు, ఆపన్నులకు చేయూత ● సామాజిక సేవలో తమదైన ముద్ర



పేదలకు ఆర్థికసాయం చేస్తున్న కిశోర్‌రెడ్డి



బాలకిశోర్‌రెడ్డి దంపతులు

గీసుగొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు అండగా, ఆపదలో ఉన్న వారికి భరోసాగా నిలుస్తూ సమాజ సేవలో తరిస్తున్నారు అల్లం బాలకిశోర్‌రెడ్డి. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన బాలకిశోర్‌రెడ్డి, స్వప్నదేవి దంపతులు లక్షలాది రూపాయలను నిరుపేదల కోసం ఖర్చు చేస్తూ ఆపన్న హస్తంగా నిలుస్తున్నారు.

మనుగొండకు చెందిన అల్లం జోజిరెడ్డి-రాణి దంపతుల చిన్న కుమారుడే బాలకిశోర్‌రెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. గీసుగొండలో టెన్త్ వరకు చదువుకున్న కిశోర్‌రెడ్డి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ పలు వ్యాపారాలు చేసి పారిశ్రామికవేత్తగా ఎదిగారు. స్వగ్రామం మనుగొండలో మొదటగా ముఖద్వారాన్ని సుందరంగా ఏర్పాటు చేయించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని పలువురు నిరుపేదలకు ఆర్థికసాయం అందించారు. మండలంలో పలువురి జీవనస్థితిగతులను తెలుసుకుంటూ పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఆలయాల నిర్మాణాలకు విరాళాలు అందిస్తూ దైవభక్తిని చాటుకుంటున్నారు.

గీసుగొండలో రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన ఖోఖో పోటీలకు రూ. 5 లక్షలు అందించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూస్, బ్యాగ్స్ అందించారు. మొగిలిచర్లలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీకి ఆర్థికసాయం, చనిపోయిన నిరుపేద కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయాన్ని, వృద్ధులకు నిత్యావసర వస్తువులను పండుగ సమయాల్లో అందిస్తున్నారు. మనుగొండలో నిర్మించే ప్రైవేటు బ్రిడ్జికి రూ.5లక్షలు విరాళంగా ఇచ్చారు. కొమ్మాల జాతరలో ప్రభలను ఏర్పాటు చేసి అట్టహాసంగా నిర్వహించారు. ఆత్మకూరు మండలం అక్కంపేటలో సమ్మక్క-సారక్క జాతరలో రూ.10లక్షలతో ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేయించారు. మరియపురంలో చర్చికి రూ.5లక్షలతో సీసీ రోడ్డు, ఊకల్‌లో పెద్దమ్మగుడి ప్రహరి నిర్మాణం రూ.5లక్షల సొంత ఖర్చులతో చేయించారు. ఎలుకుర్తి అంబేద్కర్ విగ్రహానికి, లక్ష్మినసింహస్వామి బ్రహ్మోత్సవాలకు విరాళాలు అందించారు. గణపతి ఉత్సవాల సందర్భంగా మహా అన్నదానాలు చేయగా ఆయన సతీమణి స్వప్నదేవి పాల్గొన్నారు. బాలకిశోర్‌రెడ్డి బెంగుళూరు, హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ తన టీం ద్వారా సామాజిక సేవ చేయడం పట్ల ప్రజలు ఆయనను అభినందిస్తున్నారు. ఇటీవల బాలకిశోర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించి ఆత్మీయత, అభిమానాన్ని చాటుకున్నారు.

వనదేవతల ప్రేరణతోనే ట్రైబల్ వర్సిటీ లోగో రూపకల్పన

కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ

కేయూక్యాంపస్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారమ్మల ప్రేరణతోనే గిరిజన వర్సిటీ లోగో రూపొందించామని కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, లోగో రూపకల్పన బాధ్యుడు ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. తల్లుల త్యాగం, ధైర్యం, సేవాభావం మనందరికీ స్ఫూర్తినిస్తాయన్నారు. గిరిజన సంప్రదాయాల గౌరవం, ప్రకృతి పట్ల కృతజ్ఞత, జ్ఞానదీపం సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే విశ్వవిద్యాలయ దృక్పథాన్ని ప్రతిఫలింపచేస్తాయని వివరించారు. సాంస్కృతిక అవగాహన, శాస్త్రీయత, భాగస్వామ్యం, సృజనాత్మకత లోగోకు ప్రాణంగా నిలిచాయని పేర్కొన్నారు. గిరిజన సాంస్కృతిక మూలాలను జ్ఞానక్రాంతితో మేళవించి లోగోను రూపకల్పన చేసినట్లు వివరించారు. సమ్మక్క- సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ గిరిజన సంస్కృతిని పరిరక్షిస్తూ సమానత, సాధికారత, సుస్థిరత అభివృద్ధిలక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. జ్ఞానం-శక్తి-సేవతో సమాజంలో మార్పులు తేవాలని కోరారు.

రూ.94 లక్షల అవినీతిపై అధికారుల నివేదిక సిద్ధం

ధాన్యం కొనుగోలు అక్రమాలపై డీసీవో కార్యాలయంలో ముగిసిన విచారణ

శాయంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శాయంపేట మండల కేంద్రంతో పాటు కాట్రపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలులో రూ.94 లక్షలు అవినీతి జరిగినట్లుగా అధికారులు నివేదిక సిద్ధం చేసి సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు అందజేసినట్లు తెలుస్తోంది. శాయంపేట మండలంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ అధికారులు రెండు రోజులుగా తనిఖీలు చేసి, మూడో రోజు బుధవారం డీసీవో కార్యాలయంలో పలు వివరాలు సేకరించారు. రెండు సెంటర్లలో ధాన్యం లేకుండానే టోకెన్లు జారీ చేసి, ఆన్‌లైన్ ఎంట్రీలు చేసి, ట్రక్ షీట్లు రాసి, మిల్లులో దిగుమతి లేకుండా ఎంట్రీలు చేసి, మిల్లర్‌కు చెందిన రైతుల ఖాతాల్లో రూ.లక్షల్లో చెల్లింపులు చేశారు. ఇదంతా కమలాపూర్ మండలంలోని ఓ మిల్లర్, శాయంపేట, కాట్రపల్లి సెంటర్ల మహిళా నిర్వాహకులు, ఓ బుక్ కీపర్ సూత్రధారులుగా అవినీతికి పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే మిల్లర్ తనకు చెందిన కమలాపూర్ మండలంలోని 12 మంది రైతుల ఖాతాల్లో చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. అలాగే సెంటర్‌లో ధాన్యం కొనుగోలు సమయంలో టోకెన్లు జారీ చేసి, ఘటనలో భాగస్వామ్యం అయిన వ్యవసాయ అధికారులపై వేటు పడే చాన్స్ ఉందని, అలాగే నిర్వాహకులు, బుక్ కీపర్, రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకొంటారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విచారణలో కొంత మంది అధికారులు, నిర్వాహకులు తప్పు ఒప్పుకుని వాగ్మూలం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని విచారణ అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

ఇన్నర్ రింగురోడ్డును అభివృద్ధి చేస్తాం..

కుడా కార్యాలయంలో రైతులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



కుడా కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరం చుట్టు పక్కల ఉన్న ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)ను అభివృద్ధి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో పాటు విలీన గ్రామాల రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. వరంగల్ ఇన్నర్ రోడ్డు పరిధిలో పట్టా, అసైన్డ్ భూముల అభివృద్ధి కోసం ల్యాండ్ పూలింగ్ పద్ధతిలో భూములు సేకరించేందుకు సంబంధించిన అంశాలపై రైతులతో మాట్లాడారు. ప్రధానంగా ఆరెపల్లి గ్రామ రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోస ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన భూములకు న్యాయపరమైన విధానంలో సహకారం అందిస్తామన్నారు. పెద్ద మొత్తంలో భూములు కోల్పోయిన రైతులకు ముందుగా ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఇంకా రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు పక్కా లాభం చేకూరే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బాక్సింగ్ ఎంపిక పోటీలు

ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహణ



జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-17 ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలను హనుమకొండ డీవైఎస్‌వో అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా స్థాయి క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పాల్గొని పతకాలు సాధించాలన్నారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 క్రీడా పోటీల కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17బాలబాలికల విభాగంలో నిర్వహించి ఎంపిక పోటీల్లో 150మంది పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీలో హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-17బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీవైఎస్‌వో రఘు, ఒలంపిక్ అసోసియేషన్ వరంగల్ జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామిచరణ్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్(ఎస్ఏపీఈటీ)లు సుభాష్‌కుమార్, సురేష్, ప్రేమ్, నాగరాజు, మనోహర్, పార్థసారథి, లక్ష్మణ్, రెబెకా, మమత, రెఫరీలు, సీనియర్ బాక్సర్లు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు

మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ సజావుగా జారీ చేయాలి : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



హనుమకొండ కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ.రాణి కుముదిని కలెక్టర్‌లను ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాణి కుముదిని బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ 9న ఉదయం 10:30గంటలకు విడుదల చేయాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ పరిధిలోని ఓటరు జాబితా వివరాలను ప్రచురించాలన్నారు. అక్టోబర్ 9నుంచి అక్టోబర్ 11వరకు ప్రతీరోజు ఉదయం 11:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారుల వద్ద నామినేషన్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రతీ నామినేషన్ కేంద్రం వద్ద పూర్తిస్థాయి బందోబస్తు కల్పించాలన్నారు. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 12న సాయంత్రం 5గంటల వరకు పూర్తి చేసి చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలన్నారు. అభ్యర్థుల జాబితాపై అప్పీళ్ల కోసం అక్టోబర్ 13న సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంటుందని, అక్టోబర్ 14నాడు అప్పీళ్లు పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 15 మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంటుందని, అదేరోజు పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా అవసరమైన మార్గదర్శకాలు జిల్లా ఎన్నికల అధికారులు జారీ చేయాలన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లాకు సంబంధించిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ గురించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలో మొదటి విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో మొదటి విడతలో ఆరు మండలాల్లో ఆరు జడ్పీటీసీ స్థానాలకు, 67 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా సాగేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జడ్పీ సీఈఓ రవి, ఎంసీసీ నోడల్ అధికారి ఆత్మారామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతికి మంత్రి 'తుమ్మల' పరామర్శ



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి తదితరులు

భీమదేవరపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిలు బుధవారం పరామర్శించారు. ఐదు రోజుల కిందట నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి తల్లి కాంతమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మాధవరెడ్డిని హనుమకొండలోని వారి స్వగృహంలో పరామర్శించారు. కాంతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాధవరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమన్వయంతోనే ట్రాఫిక్ నియంత్రణ

(5వ పేజీ తరువాయి)

పాటు ప్రధాన మార్గాల్లో ఉన్న డివైడర్‌ల ఎత్తు పెంచాలనే అంశాలపై ప్రధానంగా చర్చించారు. వర్షాకాలంలో వరద నీరు నిలిచి రోడ్లపై ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వరద నీరు నిల్వ కాకుండా నీరు సాఫీగా పోయేందుకు చర్యలు తీసుకోవాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులు కోరారు.

అనంతరం సీపీ మాట్లాడుతూ.. పోలీస్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా పనిచేస్తేనే నగరంలో ట్రాఫిక్ సాఫీగా సాగి రోడ్డు ప్రమాదాలను నివారించగలమన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ట్రైసిటీలో పార్కింగ్ స్థలాలు గుర్తించేందుకు మున్సిపల్, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించాలన్నారు. రోడ్లపై ఆక్రమణల తొలగింపుపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్స్ జి.సీతారెడ్డి, కె.సుజాత, వెంకన్న, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ముమ్మరంగా స్థానిక ఎన్నికల ఏర్పాట్లు

పూర్తయిన ఆర్‌వో, ఏఆర్‌వోల నియామకం

- ప్రిసైడింగ్ అధికారుల ఎంపిక పూర్తి
- ఒక విడత శిక్షణ పూర్తి
- క్లస్టర్ల వారిగా ఎంపీటీసీ స్థానాల విభజన
- ఆ మేరకు అధికారులకు బాధ్యతల అప్పగింత
- నేటి హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

హనుమకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా పరిషత్తు ఎన్నికల దిశగా జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఒక పక్క స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తీర్పు గురువారం వెలువడనుండగా సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో అధికారులు మాత్రం ఏర్పాట్లు విషయంలో తమ పని తాము చేసుకుపోతున్నారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా అన్ని ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉండేందుకు కసరత్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే మండల, జిల్లా పరిషత్తు, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

క్లస్టర్ల వారీగా..

ఈనెల 9వ తేదీన నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచే నామినేషన్లు స్వీకరించాల్సి ఉండడటంతో ఇందుకు తగిన సదుపాయాలు మండలాల వారీగా సమకూరుస్తున్నారు. దసరా పండుగ మరుసటి రోజే జిల్లా కలెక్టర్ ఆయా విభాగాల అధికారులకు ఎన్నికల పర్యవేక్షణ బా. ధ్యతలు అప్పగించారు. ఎప్పటికప్పుడు జిల్లాలోని పరిస్థితులను రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తున్నారు. ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులకు ఒక విడత శిక్షణ ఇవ్వడం పూర్తి చేశారు.

ఆర్‌వో, ఏఆర్‌వోల నియామకం

ఇప్పటికే ఆయా మండలాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారుల (ఆర్‌వోల) నియామకాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయా మండలాల్లో ప్రత్యేకాధికారులుగా ఉన్నవారే ఆర్‌వోలుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు వేసే అభ్యర్థులు ఆయా మండలకేంద్రాల్లోని మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో పత్రాలను సమర్పించాలి. మూడు లేదా నాలుగు ఎంపీటీసీ స్థాన్థాలు కలిపి ఒక క్లస్టర్ అధికారిని నియమించారు. ఈ క్లస్టర్ స్థాయి అధికారి ఆర్‌వోకు వీటిని అందించాలి. అదే విధంగా జడ్పీటీసీ స్థానానికి సంబంధించి మండల స్థాయి అధికారులుగా గెజిటెడ్ హోదా కలిగిన ప్రధానోపాధ్యాయులతోపాటు జిల్లా స్థాయి అధికారులను నియమించారు. నామినేషన్ల పరిశీ లన, స్ర్కూటినీలో తొలగింపు, ఫిర్యాదుల స్వీకరణ, బరిలో ఉన్న వారిపేర్ల ప్రకటన, ఇతరత్రా పనులను రిటర్నింగ్ అధికారులే చేస్తారు. ఫలితాల వెల్లడి వరకు వీరు విధులు నిర్వహిస్తారు. ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు గెజిటెడ్ హోదా ఉన్న లెక్చరర్లు, హెడ్‌మాస్టర్లు ఇతర అధికారులను ఎంపిక చేసేప్పుడు వారు పని చేసే మండలం, సొంత మండలం.. రెండు అంశాలను కొలమానంగా తీసుకొని ఇతర మండలాల్లో వారికి ఎన్నికల బాధ్యతలు అప్పగించారు. ఎంపీటీసీ ఆర్‌వోలకు సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌వో)గా స్కూల్ అసిస్టెంట్ సమాన స్థాయి ఉద్యోగులను నియమించారు. జడ్పీటీసీ రిటర్నింగ్ అధికారికి సంబంధించి ఎంపీటీసీ రిటర్నింగ్ అధికారులే ఏఆర్‌వోలుగా వ్యవహరిస్తూ సహకారం అందిస్తారు. ప్రతీ కేటగిరిలో అదనంగా సిబ్బందిని ఎంపిక చేశారు.

నాలుగు చెక్‌పోస్టుల ఏర్పాటు

ఎన్నికల సందర్భంగా ఎలాంటి అక్రమాలు జరగకుండా నిరోధించేందుకు హనుమకొండ జిల్లాను కలిపే నాలుగు ప్రధాన రహదారులపై నాలుగు చెకపోస్టులను ఏర్పాటు చేశారు. హనుమకొండ - కరీంనగర్ హైవే, హనుమకొండ - హైదరాబాద్ హైవే, హనుమకొండ - ఖమ్మం హైవే, అలాగే హనుమకొండ - ములుగు హైవేపై వీటిని ఏర్పాటు చేశారు. ఇవి ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన రోజు నుంచి పని చేయడం ప్రారంభిస్తాయి. ఒక రెవెన్యూ అధికారి, ఒక పోలీసు అధికారి, ఒక వీడియోగ్రాఫర్ ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. ఎన్నికల పరిశీలకులను కూడా నియమించారు. జిల్లాలోని మొత్తం 12 మండలాలకు 12 మంది పరిశీలకును ఎంపిక చేశారు. వీరు కూడా నోటిషికేషన్ జారీ అయిన రోజు నుంచే పని చేయడం మొదలు పెడతారు.

ప్రిసైడింగ్ అధికారుల ఎంపిక

హనుమకొండ జిల్లాలో 12 జడ్పీటీసీ స్థానాలకు ఒక్కొక్కరు చొప్పున 12 మంది ఆర్‌వోలను నియమించారు. జిల్లాలో 129 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వీటిని 46 క్లస్టర్లుగా విభసించి ఒక్కో క్లస్టర్‌కు ఒక ఆర్‌వో చొప్పున 46 మంది ఆర్‌వోలను, అలాగే మరో 46 మంది ఏఆర్‌వోలను నియమించారు. ప్రిసైడింగ్ అధికారులుగా 20 శాతం రిజర్వు కలుపుకొని మొత్తం 757 మందిని నియమించారు. వీరితో పాటు ఎన్నికల తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 13 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను కూడా ఎంపిక చేశారు.



కానుకలను లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

వనదేవతల హుండీ ఆదాయం రూ.27 లక్షలు

తాడ్వాయి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల హుండీ ఆదాయం రూ.27 లక్షల 117 సమకూరిందని దేవస్థానం కార్యనిర్వాహక అధికారి వీరస్వామి తెలిపారు. జూన్ 18 నుంచి సెప్టెంబరు 8 వరకు భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. పూజారుల సమక్షంలో పోలీసుల భద్రత నడుమ ఈ కార్యక్రమం జరిగింది. సమ్మక్క తొమ్మిది హుండీల్లో రూ. 15,16,975, సారలమ్మ తొమ్మిది హుండీల్లో రూ. 10,96, 025, గోవిందరాజు హుండీలో రూ. 41,956, పగిడిద్దరాజు హుండీలో రూ. 36,321 వచ్చాయని ఈవో వీరస్వామి తెలిపారు. మొత్తం 27,00,177 ఆదాయం సమకూరిందని అన్నారు. కానుకుల్లో రూ. 8.900 చెల్లని చిరిగిన నోట్లు వచ్చాయని తెలిపారు. ఈ మొత్తాన్ని తాడ్వాయి కెనరా బ్యాంకులో జమ చేశామన్నారు.

తల్లుల గద్దెపై ఏర్పాటు చేయడా నికి మరో 20హుండీలకు పూజరులు, అధికారుల సమక్షంలో సీలు వేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఇన్ స్పెక్టర్ కవిత, సూపరింటెంట్ విజయ్ కుమార్, సిబ్బంది మధు, బాలకృష్ణ, పూజా రుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు రెవన్యూ అధికారులు, పోలిసులు బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుబాంబు పేలి రైతుకు తీవ్ర గాయాలు



బాంబు పేలుడులో గాయపడిన కుంటమల్ల సాంబయ్య

ములుగు రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాటు బాంబు పేలి ఓ రైతు గాయపడిన సంఘటన ములుగు జిల్లా ములుగు మండలంలోని మదనపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మదనపల్లి గ్రామానికి చెందిన రైతు కుంటమల్ల సాంబయ్య గతంలో పొలాన్ని పందుల నుంచి కాపాడేందుకు నాటు బాంబులను ఇంట్లోనే తయారు చేసేవాడు. ఈ క్రమంలో ఇల్లు సర్దుతుండగా ఓ నాటు బాంబు అతడికి కనిపించింది. దీంతో దానిన్ని బయటకు తీసుకెళ్తున్న క్రమంలో అది చేతి నుంచి జారి కిందపడింది. బాంబు పేలడంతో సాంబయ్య తీవ్ర గాయపడ్డాడు. కాలు నుజ్జునుజ్జు అయ్యి రక్తసిక్తమైంది. దీంతో అతడిని ములుగులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయం కావడంతో సాంబయ్య కాలును తొలగించే అవకాశం ఉందని తెలిసింది. సంఘటన స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్ సందర్శించారు. ప్రమాదంపై స్థానికులను ఆరా తీశారు. ఇప్పటి వరకు ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం విచారణ చేపడుతున్నామని ఆయన తెలిపారు.

మృతి చెందిన వ్యక్తి మావోయిస్టేనా?



చల్పాక ప్రాంతంలో మృతదేహం (ఫైల్)

- ఈ నెల 2న చల్పాక అడవుల్లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం
- మావోయిస్టు దళకమాండ్ అని ప్రచారం
- క్రమశిక్షణా చర్యల్లో భాగంగా మావోయిస్టులే చంపారని సమాచారం

ఏటూరునాగారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చల్పాక-వీరాపురం అటవీ ప్రాంతంలో ఈనెల 2న లభించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీపీఐ మావోయిస్టు పార్టీ ఏరియా దళ కమాండర్ మాడవి లక్కి(36) అనే వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గ్రాంపూర్ ప్రాంతానికి చెందిన లక్కి మావోయిస్టు పార్టీ ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి, అజ్ఞాతంలో ఉన్న ఒక మహిళా మావోయిస్టును తీసుకొని అడవి నుంచి బయటకు వచ్చాడని తెలిసింది. అనంతరం ఆమెతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పాలెం ప్రాంతానికి చెందిన ఒక కొరియర్ సహాయంతో ఏటూరునాగారం మండలంలోని చల్పాక ప్రాంతంలోని వీరాపురం గొత్తికోయగూడెంలో ఆశ్రయం పొందారని తెలిసింది. అయితే గొత్తికోయగూడెంలో లక్కి ఉన్నట్లు విషయం తెలుసుకున్న నలుగురు మావోయిస్టులు ద్విచక్రవాహనాల్లో అక్కడికి చేరుకున్నారని, లక్కిని ఛత్తీస్‌గఢ్‌కు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, అతడు ప్రతిఘటించాడని, దీంతో మావోయిస్టులు అతడిని చెట్టుకు కట్టేసి ఉరివేసి హతమార్చారని తెలిసింది. పార్టీ క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే లక్కిని హతమార్చినట్లు మావోయిస్టులు స్థానికులకు చెప్పి వెళ్లినట్లు తెలుస్తోంది.

ఈ విషయంపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈనెల 2న లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం మావోయిస్టు పార్టీ దళ కమాండర్ లక్కిదేనని, హత్య వెనుక మావోయిస్టుల హస్తం ఉందనే సమాచారంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మొరాన్ని మింగేస్తున్నారు!

- ఎస్సారెస్పీ కాలువ మొరం గడ్డలు మాయం
- రాత్రికి రాత్రే టిప్పర్లతో తరలింపు
- అన్యాక్రాంతం అవుతున్న ఎస్సారెస్పీ భూములు
- మామూళ్ల మత్తులో అధికారులు



మొరాన్ని తరలించిన దృశ్యం

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) స్టేజ్-2 కాలువకు ఇరువైపులా ఉండే మొరాన్ని అక్రమార్కులు మింగేస్తున్నారు. కాలువకు రక్షణగా ప్రభుత్వం కాలువ పక్కనే భూములను కొనుగోలు చేసి వాటిలో మొరాన్ని కట్టలుగా పోసి పెట్టింది. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఉపయోగించేందుకు, కట్ట ధృడంగా ఉండేందుకు కాలువ పొడవునా గుట్టలుగా పోసి భద్రపరిచింది. ఇప్పుడు వాటిని కొందరు తమ లాభాపేక్ష కోసం ఇష్టానుసారంగా తవ్వేస్తూ తరలించుకుపోతున్నారు.అధికార పార్టీ అండదండలతో కొందరు అనుమతులు తెచ్చుకుని, నిబంధనలను అతిక్రమించి తీసుకెళ్తుండగా మరికొందరు రాత్రి వేళల్లో తరలించుకోపోవడం పరిపాటిగా మారింది. సంబంధిత ఎస్సారెస్పీ అధికారులు నిఘా పెట్టి కట్టడి చేయాల్సింది పోయి మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎస్సారెస్పీ భూముల్లోనే వ్యవసాయం..

శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ పక్కనే ఉండే రక్షణ మొరం గడ్డలను కబ్జా చేయడం పరిపాటిగా మారింది. మొరాన్ని మింగేసి, భూములను కబ్జా చేసి దర్జాగా సాగు చేసుకున్నా, బాటలు వేసి నింబంధనలు తుంగలో తొక్కినా అధికారుల జాడమాత్రం కనిపించడం లేదు. వరంగల్ జిల్లా నుంచి వివిధ మండలాల మీదుగా ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించే కాకతీయ కాలువకు అడుగడున కబ్జా రాయుళ్లు పాగా వేసుకుని ఉన్నారు. కోట్ల రూపాయాలతో వేల ఎకరాల భూమిని కొనుగోలు చేసిన ప్రభుత్వం, నిబంధనల ప్రకారం కాలువను తవ్వి, కాలువకు రెండు వైపులా రక్షణ కవచంలా మొరం గడ్డలను పోసింది. కాలువ ఎంత లోతుగా ఉంటుందో, పక్కనే ఉన్న రక్షణ మొరం గడ్డలు అంతా ఎత్తులో ఉంటాయి. మొరం పోసిన స్థలాన్ని సైతం రైతుల వద్ద కొనుగోలు చేసి నష్టపరిహారం అందించి ప్రభుత్వంతన ఆధీనంలో ఉంచుకుంది.

రాత్రికి రాత్రే తరలింపు...

ఎస్సారెస్పీ కాలువకు ఇరు పక్కల ఉన్న మొరాన్ని ఇష్టానుసారంగా తరలించుకుపోతున్నారు. సంగెం, పర్వతగిరి, వర్ధన్నపేటతో పాటు రాయపర్తి మండలాల్లో ఎక్కువగా మొరాన్ని తరలించడం కనిపిస్తోంది.ఆ మధ్య కాలంలో సంగెం, పర్వతగిరి మండలాల్లో ఎక్కువగా తరలించగా, అక్కడ చాలా శాతంపూర్తిచేశారు. ప్రస్తుతం వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని తండాల మీదుగా వెళ్తున్న ఎస్సారెస్పీ కాలు వను టార్గెట్ చేసి తవ్వకాలు చేస్తున్నారు. దీనికి ఇరుపక్కల ఉన్న రైతులు కొందరు పొక్లైన్లు, జేసీబీలు, డోజర్‌లు, ట్రాక్టర్ల యజమానులతో కుమ్మక్కై మొరం గడ్డలను తొలగిస్తే కొంత మొత్తంలో భూమిని కబ్జా చేసి కాస్తు చేయవచ్చనే ఆలోచనలో పడి మొరం తరలించడానికి ప్రోత్సహిస్తున్నారు. పలు చోట్ల ఎస్సారెస్పీ కాలువ రోడ్డు మీదనే బోరు బావులు వేశారు.

అధికారులకు మామూళ్లు..

మొరందందాలో దళారుల పాత్ర క్రియాశీలకంగా కనిపిస్తోంది. అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో పాటు మొరం తరలించే వారితో కుమ్మక్కవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి అర్ధ రాత్రి వేళల్లో హిటాచీ, టిప్పర్లు పెట్టి తరలించాడు. దీంతో పోలీసులు టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌లో పెట్టారు. కానీ, పోలీసులు వెళ్లిన తర్వాత అధికార పార్టీ అండదండలతో మళ్లీ ఆ రాత్రే పనులు సాగించాడనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు స్థానికులు సైతం జేసీబీలు, ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మొత్తానికి ఇటు ఎస్సారెస్పీ అధికారులకు, అక్రమార్కులకు, దళారులకు ఎస్సారెస్పీ మొరం కల్పతరువుగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే ఈ తరలింపులకు అడ్డుకట్ట పడుతుందని రైతులు అంటున్నారు.

'టెట్'.. ఎట్టెట్టా!?

- సుప్రీంకోర్టు తీర్పుతో ఉపాధ్యాయుల్లో కలవరం
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- రివ్యూ కోరుతున్న పంతుళ్లు



పాలకుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సర్వీసులో వున్న ఉపాధ్యాయులందరూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణత సాధించాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మెజారిటీ కలవరపెడుతోంది. ఐదేళ్లకు పైబడి సర్వీసు ఉన్న ఉపాధ్యాయులంతా రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని పేర్కొనడం భిన్న వాదనలకు తెరలేపుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సీటీఈ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటికే సర్వీసులో ఉన్న వారికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం టెట్ నుంచి మినహాయింపు నిచ్చింది. జనగామ జిల్లాలో ప్రస్తుతం డీఎస్సీ 1985 నుంచి డీఎస్సీ 2024 వరకు ఎంపికైన ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. 2,119 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా, టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు 1,120 మంది ఉన్నారు. అందులో టెట్ లేనివారు 999 మంది ఉన్నట్లుగా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే 2010 నుంచే టెట్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2012లో ఉమ్మడి రాష్ట్రంలోనే టెట్ నిర్వహించగా, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2017లో ఒకసారి, 2024లో మరోసారి ఇలా మూడు సార్లు డీఎస్సీలో నియమితుల య్యారు. వారు టెట్‌లో అర్హత సాధించగా, రెండేళ్ల క్రితం ఎన్‌సీటీఈ ఉత్తర్వులతోనూ కొందరు అర్హత సాధించారు. అలాంటి వారు కేవలం తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారనేది అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

ఇదిలా ఉంటే ఏడాది వ్యవధిలో జనగామ జిల్లాలో 17మంది ఉపాధ్యాయులు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, 87 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి సాధించిన వారిలో ఉన్నారు. టెట్ అర్హత లేకుండానే పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాబోవు పదోన్నతుల్లో జూనియర్లకు మేలు జరగనుంది. టెట్ మినహాయింపు ఇవ్వాలని మెజారిటీ ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీర్పును పునఃసమీక్షించేలా రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేస్తున్నాయి.


మినహాయింపు ఇవ్వాలి



సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. ఇందుకోసం విద్యాహక్కు చట్టంలో మార్పులు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరి ఉత్తీర్ణత సాధించాలని ప్రకటనలతో ఉపాధ్యాయ వర్గాలు కలవరం చెందుతున్నాయి.

- ఇమ్మడి అశోక్, టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడు జనగామ జిల్లా

రక్షణ కల్పించాలి



సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి.విద్యాహక్కు చట్టం సవరించాలి. రెండేళ్ల కాలంలో వీలైనంత ఎక్కువ కాలం టెట్ నిర్వహించాలి. అవసరమైన ఉపాధ్యాయులు అందరూ ఉత్తీర్ణత సాధించేలా అవకాశం ఇవ్వాలి. ఉపాధ్యాయులు టెట్ కావాల్సిందేనని కోర్టు ఇచ్చిన తీర్పు ఉపాధ్యాయులను కలవరపెడుతోంది.

- షరీఫ్, డీటీఎఫ్ అధ్యక్షుడు, జనగామ జిల్లా

డెంగీతో టెన్త్ విద్యార్థి మృతి



అజయ్ (ఫైల్)

బయ్యారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : డెంగీ జ్వరంతో ఓ విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. జగ్గు తండా గ్రామానికి చెందిన గోగుల సుబ్బు-అలివేలు దంపతులకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సుబ్బు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన పెద్ద కుమారుడు అజయ్ స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్నాడు. సెప్టెంబరు 28వ తేదీన విద్యార్థికి జ్వరం రాగా, తల్లిదండ్రులు ముందుగా మహబూబాబాద్‌లోని జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ జ్వరం సోకినట్లు తేలడంతో వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రిఫర్ చేశారు. రక్త కణాలు తగ్గి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం అజయ్ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. కాగా, బాలుడు అజయ్ మృతితో జగ్గుతండాలో విషాదచాయలు అలుముకున్నాయి.

సమరానికి సై..

(5వ పేజీ తరువాయి)

నుంచి 27వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 28వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపట్టి, 31వ తేదీన ఉపసంహరణకు గడువు ఇవ్వనున్నారు. నవంబరు 8వ తేదీన ఎన్నికలు నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి, విజేతలను ప్రకటించనున్నారు. సర్పంచ్ ఎన్నికలు పూర్తయిన తరువాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్లను నవంబరు 11వ తేదీన చేపట్టనున్నారు.

75 జడ్పీటీసీ, 778 ఎంపీటీసీ, 1,078జీపీలకు ఎన్నికలు

స్థానిక సంస్థల నోటిఫికేషన్ విడుదల కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. తొలుత పరిషత్ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 75 మండలాల్లో 778 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అయితే మలుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై కోర్టులో కేసు ఉండటంతో ఇక్కడ ఎన్నికలు నిర్వహించటం లేదు. 74జడ్పీటీసీ స్థానాలకే ఈసారి ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే మంగపేట మండలంలోని 14ఎంపీటీసీ స్థానాలకు కూడా ఎన్నికలు లేకపోవటంతో 764 ఎంపీటీసీ స్థానాలకే ఎన్నికలు జరుగనున్నాయి. 1,708 గ్రామపంచాతీలు ఉండగా, మంగపేట మండలంలోని 55జీపీలు పోగా, 1,653 జీపీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కోర్టు తీర్పు వచ్చిన తరువాత మంగపేట మండలంలోని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచులతో పాటు 14,786 వార్డులకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం ఉప సర్పంచులను కూడా ఎన్నిక చేయనున్నారు. మొత్తం 75 మండలాలు ఉండగా, తొలి విడతలో 37 మండలాలు, రెండో విడతలో 38మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

జిల్లా	ఎంపీటీసీలు	ఎంపీపీలు	జడ్పీటీసీలు	తొలి విడత	రెండో విడత	జీపీలు
వరంగల్	130	11	11	5	6	317
హనుమకొండ	129	12	12	6	6	210
జనగామ	134	12	12	6	6	280
మహ-బాద్	193	18	18	9	9	482
భూపాలపల్లి	109	12	12	6	6	248
ములుగు	83	10	10	5	5	171
మొత్తం	778	75	75	37	38	1,708



అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

మేడారం అభివృద్ధి పనుల పరిశీలించిన కలెక్టర్

తాడ్వాయి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క- సారలమ్మ దేవాలయ అభివృద్ధి పనులను కలెక్టర్ దివాకర బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. ఏమాత్రం అలసత్వం వహించకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్, ఆర్కిటెక్ట్ రాజశేఖర్, కాంట్రాక్టర్, దేవాదాయ ఇంజనీర్ అధికారులు, పూజారులు ఉన్నారు.

బాలగోపాల్ యాది సభ పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ 12న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న బాలగోపాల్ 16వ యాది సభ పోస్టర్‌ను బుధవారం కేయూ దూరవిద్య కేంద్రం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య మాట్లాడారు. బాలగోపాల్‌యాది సభలో ప్రొఫెసర్ నందిని సుందర్ యాదవ్, పీఎస్ అజయ్‌కుమార్, అపార్ గుప్తాలు ప్రసంగిస్తారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేతలు వసంత లక్ష్మి, బదావత్ రాజు, టి.హరికృష్ణ దిలీప్, రోహిత్, సంధ్య, వెంకట్‌నారాయణ, సాధు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మానవ హక్కుల నేతలు


పాలకుర్తిలో సిబ్బంది కిట్లను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్.. పాలకుర్తి పోలీస్‌స్టేషన్ తనిఖీ

పాలకుర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి మీడియా సమావేశంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. ఈ ప్రాంతంలో ఆర్‌బీఎఫ్ చైన్ సిస్టమ్‌లో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీపీ వెంట సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, లింగారెడ్డి, యాకూబ్ హుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

వడ్డెపల్లిలో పోషణ్ మాసోత్సవం

వడ్డెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ప్రాజెక్టు పరిధిలోని వడ్డెపల్లి సెక్టార్‌లోని 58, 60 డివిజన్లకు సంబంధించిన కుమ్మరివాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మాసోత్సవాలను నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో విశ్వజ, సూపర్‌వైజర్లు రమాదేవి, విజయ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఏడీఆర్‌ఎంకు సన్మానం

కాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ బాధ్యతలు చేపట్టిన అడిషనల్ డివిజనల్ మేనేజర్ (ఏడీఆర్‌ఎం) ఎ.సంజీవరావును బుధవారం టీ-రైల్వే జేఏసీ నాయకులు సికింద్రాబాద్‌లో కలిశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. కాజీపేటకు రైల్వేకు అన్ని విధాల సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో కన్వీనర్ పి. రమేశ్, సాయరాజ్, వైస్ చైర్మన్లు పి. శ్రీనివాస్, ఎం. మహేశ్, నల్లెల సోమేశ్వర్‌రావు పాల్గొన్నారు.


సంజీవరావును సన్మానిస్తున్న రైల్వే నాయకులు

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 39మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ నలుగురికి జైలు శిక్ష విధించగా, మిగతా 35 మందికి రూ.37,400 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.2వేలు జరిమానా విధించామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వడ్డెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వడ్డెపల్లిలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఇదే ప్రాంతానికి చెందిన రైతు అనుమాల నాగరాజు గేదెలను పెంచుతూ తద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన గేదెల్లో ఒకటి వడ్డెపల్లి దళితుల శ్మశానవాటికలో గడ్డి మేయడానికి వెళ్లింది. శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి అమర్చిన కేబుల్ వైర్లు తేలి ఉన్నాయి. గేదె తీగలను తగలడంతో విద్యుత్ ప్రసరించి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని పేర్కొన్నారు. రైతుకు ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్‌కువిజ్ఞప్తి చేశారు. పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌గేదెకు పోస్టుమార్టం నిర్వహించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హనుమకొండ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సుబేదారి ఎస్సై ఫణి అన్నారు. బుధవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాగృతి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఫణి మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు ర్యాగింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ డయల్ 100 సేవలు షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 సంప్రదించాలన్నారు. గంజాయి సరఫరా చేస్తే సమాచారం కోసం 8712584473 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బండ భూమి కబ్జాకు యత్నం

కాపాడాలని కలెక్టర్‌కు వడ్డెపల్లి వాసుల వినతి

వడ్డెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వడ్డెపల్లి శివారులోని ప్రభుత్వ భూములపై రియల్టర్ల కన్ను పడింది. ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపించినా కబ్జాకు యత్నిస్తున్న ఉదంతాలు వడ్డెపల్లి ప్రాంతంలో నిత్యాకృత్యమయ్యాయి. హనుమకొండ వడ్డెపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 690లో 33 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. పూర్వం నుంచి ఈ భూమిని బతుకమ్మ బండ భూమిగా వడ్డెపల్లి వాసులు పిలవడం గమనార్హం. విలువైన భూమి కావడంతో పది సంవత్సరాల నుంచి కొందరు రియల్టర్లు కబ్జాకు యత్నిస్తున్నారు. గతంలో ఈ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు రియల్టర్లు ఉపక్రమించగా వడ్డెపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. బుధవారం సైతం రియల్టర్లకు సంబంధించిన వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు భూమి వద్దకు చేరుకున్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని బతుకమ్మ బండ భూమిని కబ్జాదారుల బారిన పడకుండా కాపాడాలని కాంగ్రెస్ 56వ డివిజన్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నంచందర్, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పెంబర్తికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

హసన్‌పర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నుంచి హసన్‌పర్తి వయా పెంబర్తి బస్సును పునరుద్ధరించాలని హసన్‌పర్తి న్యాయవిద్యార్థి మేకల ప్రదీప్ ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. ఈ రూట్‌లో బస్సు నాలుగేళ్ల కిందట బంద్ అయినట్లు తెలిపారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి ఈ మార్గంలో బస్‌ను పునఃప్రారంభించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్
- ఆటో కార్మికులకు బాకీ కార్డుల పంపిణీ

కాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ బస్‌తో ఆటో కార్మికుల బతుకులను అన్యాయం చేసిన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బాకీ కార్డులతో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అడగాలన్నారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో బుధవారం ఆటోడ్రైవర్లకు దాస్యం వినయ్‌భాస్కర్ బాకీ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ అమలు కాని హామీలతో గద్దెనెక్కిందన్నారు. కేసీఆర్ 14 ఏళ్ల పాటు ప్రజల మధ్య తిరిగి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారని చెప్పారు. పదేళ్ల ప్రభుత్వంలో రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఊహించని రీతిలో అభివృద్ధి చేశారన్నారు. హామీలు అమలు చేయాలన్నందుకు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనంతా రివర్స్‌లో నడుస్తుందన్నారు. అనంతరం ఆటోలకు బాకీ కార్డులను అతికించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంకు నర్సింగ్, నాయకులు కొండ్ర శంకర్, తేలు సారంగపాణి, సోని, ఆటో యూనియన్ నాయకులు నరహరి పాల్గొన్నారు.


బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న దాస్యం వినయ్ భాస్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

సమాచార హక్కు చట్టం అమలుతో మార్పులు

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం అమలుతో పాలనలో కీలక మార్పులు ఉంటాయని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సమాచార హక్కు చట్టం-2005 అమల్లోకి వచ్చి 20 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో ఈ నెల 5 నుంచి 12వ తేదీవరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం అమలు కాకముందు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం అందేది కాదని, కానీ 2005లో అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నో ప్రయోజనాలు వచ్చాయన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్ మాట్లాడుతూ.. సమాచార హక్కుచట్టంపై డివిజన్, మండలస్థాయిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం దిష్టిబొమ్మ దహనం


పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మంద నరేశ్, తదితరులు

కేయూ క్యాంపస్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దళిత మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అనుచితంగా వ్యాఖ్యానించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను బుధవారం కేయూలో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మాదిగ వర్గానికి చెందిన మంత్రిపై మరో మంత్రి అనుచితంగా మాట్లాడటం హేయమని ఆందోళన వ్యక్తం చేశారు. హుస్నాబాద్‌లో మాదిగల ఓట్లతోనే పొన్నం గెలిచారని అన్నారు.

అనుచితంగా మాట్లాడినందుకు పొన్నంను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దళితులజోలికి వస్తే సహించేది లేదన్నారు. దిష్టిబొమ్మ దహనాన్ని కేయూ పోలీసులకు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు అర్షం చరణ్, నంద, పవన్, రాజు, అఖిల్, కిరణ్, సాయి, వెంకటేశ్, సూర్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో నేత్రదానం

హసన్‌పర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన విశ్వకర్మ కార్మికుడు క్రిష్టాది కుమారస్వామి అలియాస్ గౌస్ (65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు కుమారస్వామి నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐబ్యాంకు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూషన్ సంయుక్తంగా బుధవారం కుమారస్వామి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుడి కుటుంబ సభ్యులను హనుమకొండ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లోన్ మేనేజర్ పోన్నోజు శివప్రసాద్, క్రిష్టాది రాజేష్, రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంకు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సిబ్బంది అభినందించారు. ప్రతిఒక్కరూ నేత్ర దానం చేయాలని వారు కోరారు.


నేత్రదాత కుటుంబం నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్న వైద్యుడు

పాఠశాలలో నాగుపాము

భయాందోళన చెందిన టీచర్లు, విద్యార్థులు


పాఠశాలలోకి వచ్చిన నాగుపాము

హసన్‌పర్తి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి ప్రభుత్వ పాఠశాలలోకి తరచూ పాములు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ క్రమంలోనే బుధవారం పాఠశాల హెచ్‌ఎం గదిలోకి నాగుపాము రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల భయాందోళన చెందారు. గతంలో 'మన ఊరు-మన బడి' ప్రోగ్రాంలో కొత్తగా గోడను నిర్మించేందుకు పాతది కూల్చివేసినట్లు స్థానికులు తెలిపారు. ప్రహరీని మళ్లీ నిర్మించకపోవడంతో తరచుగా పాఠశాలలోకి పాములు వస్తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రాణసంకటంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాద నివారణకు చర్యలు తీసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బిట్ల సంధ్యారాణి మాట్లాడుతూ గోడ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.

టీ-సేఫ్ యాప్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలి

వరంగల్ క్రైం, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు టీ-సేఫ్ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని షీటీం కానిస్టేబుల్ కంచి వంశీకృష్ణ సూచించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలతో పాటు సైబర్ నేరాలపై బుధవారం షీటీం ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు న్యూశాయంపేటలోని జాగీర్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే షీటీం పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930, ఈవ్‌టీజింగ్ చేస్తే 8712685142 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ ఇమ్రాన్‌ఖాన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం అవివేక చర్య


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఎస్‌ఐ, అంబేద్కర్ సంఘం నేతలు



గోపాల్‌పూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

వడ్డెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్. గవాయ్‌పై దాడికి యత్నించడం అవివేక చర్య అని ఎస్సీ ఎస్టీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంధం శివ, భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్‌ఐ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి బొమ్మల్ల అంబేద్కర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్ అన్నారు. ఈ విషయంపై బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్‌ఐ, అంబేద్కర్ సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిందితుడు న్యాయవాది రాకేష్ కిశోర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ రక్షణకై ప్రజలందరు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో బీఎస్‌ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పి.కృష్ణస్వామి, ప్రజా సంఘాల నాయకులు కొంగర జగన్, జవ్వాజి కిషన్, కాడపాక రాజేందర్, మేడ రంజిత్‌కుమార్, ఏకు ప్రవీణ్, దీకొండ ప్రభంజన్, దుప్పటి సుభాష్, విశ్వేశ్వర్ రావు, నర్సన్న తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం ఉన్మాదం

చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) బీఆర్.గవాయ్‌పై దాడికి యత్నించడం ఉన్మాద చర్య అని సీపీఎం హనుమకొండ పశ్చిమ మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న అన్నారు. నిందితుడు రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం గోపాల్‌పూర్‌లోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాదులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు డి.రమేష్, సబిత, పద్మ, శృతి, లాలు, సాంబయ్య, సమ్మయ్య, స్వప్న, మల్లేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఓరియంటేషన్ కార్యక్రమంలో విద్యార్థులు

కేఎంసీలో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం

వరంగల్ మెడికల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన నీట్ కౌన్సెలింగ్‌లో కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందిన విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఎన్‌ఆర్‌ఐ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థులను అభినందిస్తూ కేఎంసీ చరిత్ర, వైద్య రంగంలో సాధించిన ప్రతిష్ఠాత్మక విజయాలను వివరించారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఎదుర్కొన్నా స్వేచ్ఛగా యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీపతి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్, ప్రెసిడెన్సీ పాఠశాల ఏరియాలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు, కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, సుబేదారి, పోస్టల్ కాలనీ, ఎక్సైజ్‌కాలనీ, అదాలత్ జంక్షన్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

- గోదావరి ఎక్స్‌ప్రెస్ వాష్ రూమ్‌లో మృతదేహం
- గంట ఆలస్యంగా వెళ్లిన రైలు.. ప్రయాణికుల ఆందోళన


కాజీపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైలులోని వాష్‌రూమ్‌కు వెళ్లి న ఓ వ్యక్తి గుండెపోటు వచ్చి అందులోనే మృతి చెందాడు. రైల్వే ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ గోపాలపురానికి చెందిన మా రపెల్లి సుజిత్ (45) హైదరాబాద్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగానికి రోజు హైదరాబాద్‌కు రైలులో వెళ్లి వస్తుంటారు. కాగా, బుధవారం కూడా ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఎస్-2 బోగీలో హైదరాబాద్ నుంచి కాజీపేటకు తోటి ఉద్యోగులతో వస్తున్నాడు. ఈ క్రమంలో మారపెల్లి సుజిత్ బాత్రూమ్‌కు వెళ్లాడు. అయితే కాజీపేట స్టేషన్ సమీపిస్తున్నప్పటికీ సుజిత్ ఎంతకూ రాకపోవడంతో తోటి ఉద్యోగులు వాష్‌రూమ్ తలుపు తీసేందుకు ప్రయత్నించారు. డోర్ లాక్ ఉండడం, సుజిత్ నుంచి స్పందన లేకపోవడంతో రైలు కాజీపేటకు వచ్చిన తర్వాత కిటికీల్లోంచి చూసే సరికి అతడు మృతి చెంది ఉన్నాడు. తోటి ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. తలుపు పగులకొట్టి అతడిని బయటకు తీశారు. రైల్వే వైద్యులు పరీక్షించి సుజిత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే మృతదేహాన్ని తీసి త్వరగా రైలును కదిలించాలని ప్రయాణికులు రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు స్టేషన్‌కు చేరుకుని గొడవ సద్దుమణిగించారు. ఈ ఘటనతో గోదావరి ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా కాజీపేట నుంచి బయలుదేరి వెళ్లింది. మృతుడు సుజిత్‌కు భార్య, పిల్లలు ఉన్నారని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు చెప్పారు.


మృతి చెందిన సుజిత్

కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కారించాలి

కేయూ క్యాంపస్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కేయూ పార్టుటైమ్ అధ్యాప కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు డిమాండ్ చేశారు. బుధవా రం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తమకు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని 6 నెలలకే వేతనాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానం విధులు నిర్వహిస్తామని చెప్పారు. అన్ని అర్హతలున్నప్పటికీ న్యాయం జరుగడం లేదన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌కు సమస్యలపై విన్నవిస్తున్నామని అన్నారు. డాక్టర్ తిరుణహరి శేషు మాట్లాడుతూ.. తమను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్ట్ చేయాలని అన్నారు.

నవ్య



భారత బ్యాడ్మింటన్ డబుల్స్‌పై చెరగని ముద్ర వేసిన వెటరన్ షట్లర్ **గుత్తా జ్వాల** సామాజిక సమస్యలపైనా గట్టిగా గళాన్ని వినిపిస్తారు. కొద్ది నెలల క్రితం తల్లి అయిన ఆమె... చనుబాల కొరతతో అలమటిస్తున్న పసిబిడ్డల గురించి తెలిసి వారి కోసం ఉద్యమించారు. తన చనుబాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మిల్క్ బ్యాంక్‌లకు దానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీని ద్వారా ఎంతో మంది చిన్నారులకు అమ్మనయ్యే అదృష్టం కలిగిందంటున్న జ్వాల 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

అమ్మతనానిదే ఆ గొప్పతనం...

ఒకరిని దత్తత తీసుకుంటా...

ప్రతి మహిళ జీవితంలో అమ్మతనం అనేది ఒక గొప్ప అనుభూతి. దాన్ని మాటల్లో వర్ణించలేం. అయితే, ఆర్థిక స్తోమత ఉన్న తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని అనాథలను దత్తత తీసుకుంటే వారికి ఒక మంచి జీవితాన్ని ప్రసాదించిన వారవుతారు. భవిష్యత్‌లో నేను కూడా ఒకరిని దత్తత తీసుకుంటా. అయితే నా జీవితంలోకి ఎంత మంది పిల్లలు వచ్చినా నా పెద్ద బిడ్డ మాత్రం టెడ్డీనే (పెంపుడు శునకం). వాడు లేకుండా మా కుటుంబం ఎక్కడికి వెళ్లదు. వాడు లేకుంటే మాకు నిమిషం గడవదు.

"అమ్మను అయ్యాకే నాకు తల్లి పాల విశిష్టత, విలువ తెలిసింది. నా కుమార్తెకు సరిపడినన్ని చనుబాలు ఇచ్చాక కూడా అదనంగా మిగిలే పాలతో మొదట్లో ఇబ్బంది పడ్డాను. ఈ విషయం గురించి నాకు తెలిసిన వైద్యురాలు విష్ణుతను సంప్రదిస్తే... చనుబాలను దానం చేయవచ్చని చెప్పారు. ఇటీవలి కాలంలో నెలలు నిండకుండానే ప్రసవించే వారి సంఖ్య పెరిగిందని, అలాంటి తల్లులు వారం రోజుల వరకు బిడ్డకు చనుబాలు ఇవ్వలేని స్థితిలో ఉంటారనీ, మార్కెట్‌లో దొరికే పాలను పిల్లలకు పట్టించడం వల్ల వారికి రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తెలిసింది. తల్లి పాలు సమయానికి అందక చనిపోయిన పిల్లల గణాంకాలు చూసి విస్తుపోయాను. అలాంటి వారికి 'బ్రెస్ట్ ఫీడ్ మిల్క్ బ్యాంక్స్' ద్వారా తల్లి పాలను అందించవచ్చనని తెలుసుకున్నాను. అప్పటి నుంచి నా కుమార్తెకు ఇవ్వగా మిగిలిన పాలను టెట్రా ప్యాకెట్లలో నింపి, ఇంట్లోని డీప్ ఫ్రీజర్‌లో భద్రపరిచి దానం చేస్తున్నాను. తొలి రెండు నెలల్లో 14.5 లీటర్లు, గడిచిన నాలుగు నెలల్లో దాదాపు 30 లీటర్ల చనుబాలను దానం చేశాను. పేద తల్లులు, వారి బిడ్డలకు ఎంతో కొంత ప్రయోజనం చేకూరాలనే ఆశయంతో నా పాలను ప్రభుత్వాసుపత్రుల్లో మిల్క్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థలకే ఇస్తున్నాను. 'అమృతం ఫౌండేషన్' ద్వారా చెన్నై ప్రభుత్వ పిల్లల ఆసుపత్రిలో, 'ధాత్రి ఫౌండేషన్' ద్వారా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రిలో ఉన్న మిల్క్ బ్యాంకులకు అందిస్తున్నాను. చనుబాల దానంతో నా బిడ్డతో పాటు ఎంతోమంది చిన్నారులకు అమ్మనయ్యే అదృష్టం కలిగింది.

విస్తృతంగా అవగాహన కల్పించాలి..

హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి విషయానికొస్తే ఏటా అక్కడ సుమారు తొమ్మిది వేలమంది పసిబిడ్డలు తల్లి పాలు లభించక ఇబ్బంది పడుతుంటారని తెలిసింది. వీరిలో కొంతమంది ఇక్కడే పుట్టినవారు కాగా మరికొందరు ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో అక్కడికి చికిత్స కోసం వస్తుంటారు. నెలలు నిండకుండా పుట్టిన, తక్కువ బరువుతో జన్మించే పిల్లలకు తల్లి పాలు కాకుండా పాల పిండితో తయారు చేసిన పాలు, మార్కెట్‌లో దొరికే సాధారణ పాలు పట్టించడం వల్ల 'నెక్రోటైజింగ్ ఎంటరోకోలైటిస్' అనే వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల పేగుల్లో చీము పట్టి, పొట్ట లోపల అవి అతుక్కుపోవడంతో వారం, పది రోజుల తర్వాత ఆ పాలు తాగలేక పిల్లలు చనిపోయే ప్రమాదం పొంచి ఉందట. ఈ మరణాలను అరికట్టడానికి ఉన్న ఏకైక మార్గం వారికి చనుబాలను అందించడమే. తల్లి పాలలోని ఔషధ గుణం కలిగిన కొన్ని అణువులు ఇలాంటి పిల్లలకు ప్రాణధారం. పాలిచ్చే తల్లులు తమ పిల్లలకు ఇవ్వగా... అదనంగా మిగిలే పాలను వృథాగా నేలపాలు చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు దానం చేసే... ఇతర బిడ్డల ఆకలి తీర్చిన వారు, ప్రాణం పోసిన వారు అవుతారు. సాంకేతిక పరిజ్ఞానం ఇంత అభివృద్ధి చెందాక కూడా దీనిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం బాధనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వార్తా సంస్థలు ఈ విషయం గురించి ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలి.

కులం ప్రాణం పోయదు...

ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైనప్పుడు కూడా ఇప్పటికీ కొందరు తమ కులం వారి రక్తం కోసం వెతుకులాడడం లాంటి విషయాలు సోషల్ మీడియాలో, ఇతరత్రా మాధ్యమాల ద్వారా నా దృష్టికి వచ్చినప్పుడు విస్మయం కలుగుతుంది. ఇదే తరహా ఆలోచన తల్లి పాల దానం విషయంలో కూడా ఉందని తెలిసి ఆశ్చర్యపోయా. మా పాలను వేరే వాళ్లకు ఎందుకు ఇవ్వాలనే వారికి ఒక విషయం చెప్పదలుచుకున్నా.



ఈ సృష్టిలో మరొకరికి జన్మనిచ్చి ప్రాణం పోసే అవకాశం తల్లులకే ఉంటుంది. ఎవరూ పుట్టే ముందు ఇదే మతం, కులం, ప్రాంతంలో జన్మించాలని ఎంచుకొని పుట్టరు. కాబట్టి పండంటి పసిబిడ్డలు ఈ లోకాన్ని చూడాలంటే తల్లి మనసుతో ఆలోచించి, చనుబాలను దానం చేయడానికి ప్రతి మాతృమూర్తి ముందుకు రావాలి. వస్తారని ఆశిస్తున్నా. ఎందుకంటే అమ్మతనంలోని గొప్పతనం మహిళలను ఈ పని చేయిస్తుందని భావిస్తున్నా. ఇక పుట్టిన పిల్లలకు పాలిస్తే తమ అందం తరిగిపోతుందనే అపోహలు ఉన్నాయి. చనుబాలలోని ఔషధ గుణాలు మరే పాలల్లో ఉండదని శాస్త్రీయంగా నిరూపితమైంది. తల్లి పాలు తాగడం వల్ల పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి బాగా పెరుగుతుంది. మన బిడ్డలు ఆరోగ్యంగా ఉండడానికి చనుబాల ఇవ్వడంలో తప్పేమిటి? ఒకవేళ నిజంగానే అందం పోతుందనే అనుకుందాం... మన బిడ్డలకన్నా అందం ముఖ్యం కాదు కదా! పెళ్లయ్యాక... ముఖ్యంగా గర్భం దాల్చాక అమ్మాయిల ఆలోచనల్లో, జీవన శైలిలో సహజంగా మార్పులు వస్తాయి. పిల్లలను కనడం, వారిని పెంచడంలో తండ్రి కంటే తల్లి పాత్ర ఎక్కువ ఉంటుంది. నేను షట్లర్‌గా కెరీర్ ముగించి, ఇప్పుడు తల్లి పాత్రలో ప్రవేశించాను. నా కుమార్తె (మీరా) పెరిగి పెద్దదై, తన నిర్ణయాలు తాను తీసుకునే పరిణతి వచ్చే వరకు తనను ముందుకు నడిపించడం, సంరక్షించడం నా బాధ్యత.

వాళ్లకు ఎన్ని అవార్డులు వచ్చినా వృథాయే...

నిజాన్ని నిర్భయంగా మాట్లాడలేని వారికి, అన్యాయాన్ని ప్రశ్నించలేని వారికి ఎన్ని ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు, బిరుదులు వచ్చినా నా దృష్టిలో వృథానే. కళ్ల ముందు తప్పు జరుగుతున్నప్పుడు, అది తప్పని తెలిసినప్పుడు కూడా స్పందించనినప్పుడు పేరు ముందు 'పద్మశ్రీ'లు, 'పద్మభూషణ్'లు పెట్టుకుని ఏం ఉపయోగం? నా దృష్టికి వచ్చిన సమస్యలపై నేను వెంటనే స్పందిస్తా. బాధితులకు నా మద్దతు తెలియజేస్తూ గొంతు విప్పుతా. నేను స్పందించాక కూడా బాధితులకు కానీ, నాకు కానీ మద్దతుగా ఇతర తెలుగు క్రీడాకారులు కనీసం స్పందించరు. రాజకీయ పార్టీలకు, క్రీడా సంఘాలలోని పెద్దలకు భయపడి నోరు విప్పరు. నా మాదిరిగా ప్రశ్నించే వారిమీద రెబల్, కమ్యూనిస్టు, హేతువాది అని రకరకాల ముద్రలు వేసి అవార్డులు, రివార్డులు రాకుండా చేస్తారు. నాకు అవార్డులు ఇవ్వకపోవడం వారి దౌర్భాగ్యం తప్ప... అవార్డులు రాలేదని నేను ఎప్పుడు బాధపడలేదు. పైరవీలు, సిఫార్సులు చేస్తే వచ్చే అవార్డులు నాకు అవసరం లేదు. 2011లో నాకు 'అర్జున' పురస్కారం ఇచ్చేముందు ఎవరైనా రాజకీయ నాయకులతో సిఫార్సు లేఖలు ఇప్పించాలని కొందరు సలహాలు ఇచ్చారు. నాకు అర్హత ఉంటే వస్తుంది కానీ అలాంటి పనులు చేయనని చెప్పా. ఇకపై కూడా అలానే ఉంటా."

• ఎస్.ఎస్.బి సంజయ్

కౌన్సెలింగ్

డాక్టర్! వివాహమై ఐదేళ్లు గడుస్తున్నా గర్భం దాల్చలేకపోతున్నాను. వైద్యులు సర్జరీ సూచిస్తున్నారు. ఆధునిక సర్జరీతో త్వరగా కోలుకుంటాననీ, సమస్య పరిష్కారమవుతుందనీ అంటున్నారు. ఇది నిజమేనా?

- ఓ సోదరి, హైదరాబాద్

సర్జరీతో సురక్షితమేనా?

కోలుకునే సమయాన్నీ తగ్గించడంతోపాటు, సమస్యను సమర్థంగా పరిష్కరించడమే ధ్యేయంగా సర్జరీలు సాగుతూ ఉంటాయి. అలాంటి అత్యాధునిక సర్జరీలే హిస్ట్రోస్కోపీ, ల్యాప్రోస్కోపీ! వీటికి ముందు గర్భాశయ సమస్యలన్నిటికీ గర్భాశయానికి కోతతో సాగే శస్త్రచికిత్సలు మాత్రమే అందుబాటులో ఉండేవి. వీటి వల్ల సర్జరీ సమయంతోపాటు రోగి కోలుకునే సమయం కూడా ఎక్కువగా ఉండేది. గర్భాశయం లోపల ఉన్న సమస్యలను హిస్ట్రోస్కోపీతో, గర్భాశయం బయట సమస్యలను



ల్యాప్రోస్కోపీతో సరి చేసే వెసులుబాట్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

హిస్ట్రోస్కోపీ: ఇది శరీరం మీద ఎటువంటి గాటు, కుట్లు లేకుండా యోని ద్వారా చేసే సర్జరీ. గర్భసంచి లోపలకు కెమెరా చొప్పించి అంతర్గతంగా సమస్యను స్పష్టంగా చూసే వీలుండే సర్జరీ కూడా ఇదొక్కటే! ఇలా చూడడం ద్వారా గర్భసంచి ఆకారం, పరిమాణం సరిగా ఉందా, లేదా? అనేది తెలుసుకోవచ్చు. పాలిప్ లేదా ఫైబ్రాయిడ్లు గర్భసంచిలో పెరిగాయా? అనేదీ గమనించవచ్చు. గర్భాశయం లోపల కోతలు, గాట్లు ఏర్పడి, వాటి కారణంగా గర్భధారణ జరగడం లేదా? అనేదీ నిర్ధారించుకోవచ్చు. అలా ఈ సర్జరీ ద్వారా పాలిప్స్, ఫైబ్రాయిడ్లు, గాట్లను తొలగించవచ్చు.

ల్యాప్రోస్కోపీ: పాలీసిస్టిక్ ఓవరీస్‌లో అండాలు ఎక్కువగా పేరుకుపోయినప్పుడు, వాటి నుంచి కొన్నిటిని తొలగించడం కోసం, ఫైబ్రాయిడ్లు, ఎండోమెట్రియాసిస్ సంబంధిత మాస్‌ను తొలగించడానికి ఈ సర్జరీ అవసరం అవుతుంది. కొంతమందిలో పొట్టలో తలెత్తే ఇన్‌ఫెక్షన్ల వల్ల ఫెలోపియన్ ట్యూబ్‌లు, పేగులు అతుక్కుపోయి, అండాన్ని ట్యూబులు అందుకోలేకపోతూ ఉంటాయి. ఈ సమస్యను కూడా ల్యాప్రోస్కోపీతో సరిచేయవచ్చు. బొడ్డు దగ్గర చిన్న కోత పెట్టి, అక్కడి నుంచి కెమెరాను పంపించి, పొట్ట దగ్గర ఐదు మిల్లీ మీటర్ల వ్యత్యాసంతో మూడు చిన్న గాట్లు పెట్టి పరికరాలు చొప్పించి ల్యాప్రోస్కోపీ సర్జరీ చేయవలసి ఉంటుంది. సర్జరీ చేసిన రోజు లేదా మరునటి రోజు ఆస్పత్రి నుంచి వెళ్లిపోవచ్చు.

డాక్టర్ నర్మదా కటకం
గైనకలాజిస్ట్, ఫర్టిలిటీ స్పెషలిస్ట్,
హైదరాబాద్.

మేఘన్ మెయిల్ చేసింది...



పిల్లలు చిన్నతనంలో చేసిన అల్లరి పనుల గురించి తల్లిదండ్రులు మురిపెంగా అందరికీ చెబుతూ ఉంటారు. వాళ్ల అందమైన బాల్యాన్ని కొంతవరకూ డైరీలు, ఫొటోలు, వీడియోల రూపంలో దాచిపెడుతూ ఉంటారు. కానీ పిల్లలకు మాత్రం అవేవీ గుర్తుండవు. పిల్లలు పెద్దయ్యాక వారి బాల్యాన్ని కళ్ల ముందు నిలపడమే కాదు ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకుని మురిసిపోయేలా ఏర్పాటు చేసింది మేఘన్ మార్కెల్ అనే అమెరికన్ అమ్మ. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పిల్లలకు అద్భుతమైన బహుమతిని సిద్ధం చేస్తోంది. పిల్లల పేరిట ఈ మెయిల్ ఐడీని సృష్టించి వాళ్ల బాల్యాన్ని వాళ్లకే మెయిల్ చేస్తోంది. ఈ సరికొత్త ఆలోచన సెలబ్రిటీలను సైతం ఆకర్షించడం విశేషం.

ఆలియా కూడా...

ఆలియా భట్ కూడా తన రెండేళ్ల కూతురు రాహా కోసం ఈ మెయిల్ ఐడి క్రియేట్ చేసినట్లు ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ చెప్పింది. నెలవారీ సంఘటనల సమాహారాన్ని ఫొటోలు, వీడియోలతో సహా తన కూతురికి మెయిల్ చేస్తున్నట్లు తెలిపింది. రాహా పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో అమూల్యమైన క్షణాలను మెయిల్ చేశానంది. ఈ మెయిల్ ఐడీని రాహాకు పద్దెనిమిదేళ్లు వచ్చాక ఆమెకు బహుమతిగా ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నట్లు చెప్పింది. ఓ స్నేహితురాలి ద్వారా ఈ అంశం తెలిసిందనీ తనకు బాగా నచ్చిందనీ తన కూతురికి ఇంతకంటే మంచి బహుమతి వేరే ఏదీ ఉండదని చెప్పుకొచ్చింది ఆలియా.



ఎవరీ మేఘన్?

పేరు వినగానే ఎక్కడో విన్నట్టు అనిపిస్తుంది కదా! ఆమె ఎవరో కాదు ప్రిన్స్ హ్యారీని పెళ్లి చేసుకుని బ్రిటిష్ రాజకుటుంబంలో అడుగుపెట్టిన అమెరికన్ మహిళ. వీరికి ఇద్దరు పిల్లలు. కొడుకు ఆర్చీకి ఆరేళ్లు కాగా కూతురు లిలిబెత్‌కు నాలుగేళ్లు. వివాహానికి ముందు మేఘన్ మార్కెల్ మంచి నటిగా పేరుతెచ్చుకున్నారు. తరువాత స్వశక్తితో శ్రమించి వ్యాపారవేత్తగా కూడా ఎదిగారు.

ఆలోచన అద్భుతం!

అమ్మకు పిల్లలే ప్రపంచం. వాళ్ల బాగోగులు చూస్తూ జాగ్రత్తగా పెంచడంలోనే ఆమెకు సమయమంతా గడుస్తుంటుంది. పిల్లలు పెరిగి పెద్దయ్యే క్రమంలో ఎప్పుడు ఎలాంటి అల్లరి పనులు చేశారో అన్నీ అమ్మకు గుర్తుంటాయి. అమ్మ తనివితీరా మాతృత్వాన్ని ఆస్వాదిస్తుంది. ఎన్నో మధురానుభూతులను మూటకట్టుకుంటుంది. చూస్తుండగానే రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచి పిల్లలు పెద్దయిపోతారు. చదువులు, పరీక్షలు అంటూ క్షణం విరామం లేకుండా ఉంటారు. వాళ్లకి సమయం ఉన్నప్పుడు మాత్రమే చిన్నప్పటి తీపి జ్ఞాపకాల గురించి అమ్మానాన్నలు చెప్పాల్సి వస్తుంది. దీని వల్ల పిల్లలు పూర్తి స్థాయిలో సంతోషాన్ని ఆస్వాదించలేకపోతున్నారని భావించింది మేఘన్. పిల్లల్ని పెంచుతూ ఒక అమ్మగా తను ఎంత ఆనందం పొందిందో... అంతే సంతోషాన్ని పిల్లలకు కూడా అందించాలనుకుంది. తమ బాల్యాన్ని మళ్లీ మళ్లీ చూసుకుంటూ పిల్లలు మురిసిపోవాలనుకుంది. ఈ క్రమంలోనే ఆమెకు తన స్నేహితురాలు అనుసరిస్తున్న ఈ మెయిల్ ప్రక్రియ గురించి తెలిసింది. వెంటనే పిల్లల పేరిట ఈ మెయిల్స్ క్రియేట్ చేసేసింది మేఘన్.

మార్కెల్ మెయిల్...

రోజూ పడుకునే ముందు ఆ రోజు పిల్లలు చేసిన అల్లరి పనులు, ఫన్నీ ఇన్సిడెంట్స్ గురించి రాసి వాళ్లిద్దరికీ మెయిల్ చేస్తుంది మేఘన్. సందర్భానుసారం తీసిన ఫొటోలు, వీడియోలను కూడా జతచేస్తుంది. పిల్లల మొదటి అడుగులు, వచ్చీరాని మాటలు, ఆట పాటల... ఇలా వాళ్ల బాల్యాన్ని ఏరోజుకారోజు మెయిల్ చేస్తోంది. రిపోర్ట్ కార్డులు, భోజనాల వేళ అలకలు, పిల్లలిద్దరి మధ్య పెరిగే అనుబంధం... ఇలా ఎన్నింటినో మెయిల్ ద్వారా పంపిస్తోంది. "పిల్లలు మెయిల్ చూస్తారా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే 'నా పిల్లలు పెద్దయ్యాక అంటే పదహారు లేదా పద్దెనిమిదేళ్లు వచ్చాక వాళ్లకి ఈ మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తాను. వీటిలో వాళ్ల బాల్యం ఉందని చెబుతాను. సమయం ఉన్నప్పుడల్లా చూసుకుని ఆనందించమంటాను. ఇదే తల్లిగా నేను వాళ్లకిచ్చే అద్భుతమైన బహుమతి.' అంటూ సమాధానమిస్తారు మేఘన్.

పేరెంటింగ్ పాఠం

మేఘన్ మార్కెల్ పంపిన మెయిల్స్ భవిష్యత్తులో పిల్లలకు మరుపురాని అనుభూతిని అందిస్తాయి. వాళ్ల చిన్నతనంలోకి తొంగిచూసే అవకాశాన్ని కల్పిస్తాయి. వాళ్ల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. అమెరికాలోని కాన్షియస్ కో పేరెంటింగ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడైన డోర్సీ పోర్టర్ మాట్లాడుతూ "మేఘన్ అనుసరిస్తున్న ఈ మెయిల్ ప్రక్రియ అనేది తల్లి బిడ్డల భావోద్వేగాలకు మాత్రమే పరిమితమైన అంశం కాదు, ఎంతో పకడ్బందీగా రూపొందించిన పేరెంటింగ్ పాఠం" అంటూ ప్రశంసించారు.

న్యూస్ మేకర్



'కాంతారా ఛాప్టర్ 1'లో యోధురాలైన రాకుమారి పాత్ర పోషించిన **రుక్మిణి వసంత్**, ఆ పాత్రలో ఒదిగిపోవడం కోసం ఎంతో శ్రమకోర్చి... శారీరకంగా, మానసికంగా సంసిద్ధురాలైంది. నాల్గవ శతాబ్దపు రాకుమారిగా ప్రేక్షకులను మెప్పించడం కోసం రుక్మిణి అనుసరించిన నియమాలు, తీసుకున్న శిక్షణలు ఇవే...

భళా...కాంతారా కాంత

పాత్ర స్వభావాన్ని అర్థం చేసుకున్నంత మాత్రాన ఆ పాత్రకు నూరు శాతం న్యాయం చేకూర్చడం సాధ్యపడదు. మరీ ముఖ్యంగా ఒక చారిత్రక పాత్రను పోషించే సందర్భంలో కాలమాన పరిస్థితులు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, ఆహార్యాలు, ప్రవర్తనలు లాంటి ఎన్నో అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఈ విషయంలో 'కాంతారా' కాంత రుక్మిణి ఎంతో జాగ్రత్తగా నడుచుకుంది.

బాడీ లాంగ్వేజ్ కీలకం

'కాంతారా ఛాప్టర్1' కథానాయకురాలైన రుక్మిణి వసంత్ తాను పోషించిన యోధురాలు కనకవతి పాత్ర గురించి వివరిస్తూ, "ఆ పాత్రలో ఒదిగిపోవడం కోసం అర్థం చేసుకోవలసిన సాంస్కృతిక అంశాలెన్నో ఉన్నాయనే విషయాన్ని నేను గ్రహించాను. ఆ ప్రాంతాన్ని అధ్యయనం చేయడం ద్వారా సాంస్కృతిక అవగాహన సాధ్యపడింది. అలాగే కత్తి యుద్ధం, గుర్రపు స్వారీలో కూడా శిక్షణ తీసుకున్నాను. ఏ పాత్రకైనా బాడీ లాంగ్వేజ్ ఎంతో కీలకం. రాకుమారి పాత్ర పోషించినా, కాలేజీ విద్యార్థి పాత్ర పోషించినా నాల్గవ శతాబ్దపు రాకుమారి పాత్ర పోషించినా, మనల్ని మనం తెర మీద ప్రదర్శించుకునే సందర్భంలో బాడీ లాంగ్వేజ్ ఒక కీలకమైన అంతర్గత భాగమవుతుంది. కాబట్టి ఈ పాత్ర కోసం షూటింగ్‌కు నాలుగు రోజుల ముందే రచయితలతో చర్చించి, ఎలా నడవాలో, ఎలా మాట్లాడాలో తెలుసుకుని తెర మీద కనబరచవలసిన బాడీ లాంగ్వేజ్ గురించి అవగాహన ఏర్పరుచుకున్నాను' అంటూ పాత్ర ప్రాధాన్యం గురించి వివరించింది రుక్మిణి.

కత్తి యుద్ధం, గుర్రపు స్వారీల కోసం...



రాకుమారి కేవలం రాజమందిరానికే పరిమితం కాదు. అవసరమైతే కరవాలం చేతపట్టి, కదనరంగంలో ధైర్యసాహసాలను ప్రదర్శించాలి. అందుకోసం కరవాలాన్ని ఉపయోగించడంలో కూడా శిక్షణ తీసుకుందామె. ఈ అనుభవం గురించి వివరిస్తూ...' 'ఒక చోట నిలబడడం, నడవడం సులభమే! కానీ కత్తియుద్ధం చేసేటప్పుడు మన శరీరం భిన్నంగా కదులుతుంది. ఆ సమయంలో శరీరం కదలికల మీద పట్టు పెంచుకోవడం కోసం ఆ పోరాటంలో పాఠాలు కూడా నేర్చుకున్నాను. అలాగే డైలాగులు చెప్పేటప్పుడు భావోద్వేగాలను ఒలికించడంలో మెలకువలు కూడా పెంపొందించుకున్నాను' అంటోంది రుక్మిణి. నిజానికి 'కాంతారా ఛాప్టర్1'లో రాకుమారి పాత్రకు సిద్ధపడే క్రమంలో... గుర్రపు స్వారీ మొదలు, కత్తి యుద్ధం, బాడీ లాంగ్వేజ్, సంప్రదాయ ఆధారిత డాన్స్ వరకూ తానెన్నో అంశాల మీద పట్టు పెంచుకున్నట్టు రుక్మిణి చెప్తోంది. ఈ సినిమాలో నటించడం తన కల అనీ, ఇలాంటి భిన్నమైన అంశాలను అన్వేషించే అవకాశం దొరకడం తన అదృష్టమని కూడా అంటోంది.

రుక్మిణి ప్రస్థానమిది

నటి రుక్మిణి తండ్రి, కల్నల్ వసంత్ వేణుగోపాల్ భారత సైన్యంలో ఉన్నతాధికారి. దేశానికి అందించిన సేవలకుగాను అతను అశోక చక్ర అవార్డును పొందడం విశేషం. రుక్మిణి తల్లి సుభాషిణి వసంత్ భరతనాట్య కళాకారిణి. ధైర్యసాహసాలు, కళల సమ్మిళిత కుటుంబానికి చెందిన రుక్మిణి కూడా ఆ అద్భుతమైన లక్షణాలను పుణికిపుచ్చుకుంది. కాబట్టే తన తల్లి అడుగుజాడల్లో నడుస్తూ భరతనాట్యం నేర్చుకుని తన తల్లి డాన్స్ ట్రూప్‌తో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది. లయ, భావ ప్రదర్శన, డాన్స్‌లో పొందిన శిక్షణలు ఆమెలోని కళాత్మకతను సుసంపన్నం చేయడమే కాకుండా, నటనలో కూడా ఆమెకెంతో తోడ్పడ్డాయి. రుక్మిణి ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక డ్రామా స్కూల్స్‌లో ఒకటైన లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్‌లో నటనలో శిక్షణ పొందింది. రుక్మిణికి పుస్తకాలంటే ఆపేక్ష ఎక్కువ. సాహిత్యం, కవిత్వాల పట్ల తనకున్న మక్కువను తరచూ ఇన్‌స్టా పోస్టుల్లో ప్రదర్శిస్తూ ఉంటుంది. నటిగా ఎదగడానికి తోడ్పడిన అంశాల్లో పుస్తకపఠనం ఒకటని రుక్మిణి చెబుతూ ఉంటుంది. కథల్లో లీనమైపోవడం ద్వారా భిన్నమైన భావోద్వేగాలు, దృక్కోణాలను అన్వేషించడం నేర్చుకున్నట్టు కూడా చెబుతుంది. విభిన్న భాషల్లో కూడా ఆమెకు ప్రావీణ్యం ఉంది. మాతృభాష కన్నడతో పాటు, ఇంగ్లీషు, హిందీ, తమిళం భాషల్లో అనర్గళంగా మాట్లాడగలుగుతుంది. 'కాంతారా ఛాప్టర్1'కు ముందు 'సప్తసాగరదాచె ఎల్లో' అనే సినిమాలో మర్చిపోలేని నటనను ప్రదర్శించి అవార్డులను సొంతం చేసుకుంది. తాజాగా 'కాంతారా ఛాప్టర్1' సినిమా విజయంతో రుక్మిణి తిరుగులేని నటిగా గుర్తింపు పొందుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



వ్యాయామం తరువాత...

రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే.. ఉదయాన్నే వ్యాయామం తప్పనిసరి. అలా వ్యాయామం చేసిన తరువాత అలసటగా, దాహంగా అనిపిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు నీళ్ల ఏ విధంగా తాగడం మంచిదో తెలుసుకుందాం...

- వ్యాయామం చేస్తున్నప్పుడు విపరీతంగా చెమట పడుతూ ఉంటుంది. కాబట్టి శరీరం డీహైడ్రేట్ కాకుండా మంచి నీళ్ల తాగడం అత్యవసరం. కనీసం అరలీటరు దాకా నీళ్ల తాగాల్సి ఉంటుంది. శరీర తత్వం, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని తాగే నీటి పరిమాణాన్ని సర్దుబాటు చేసుకోవచ్చు.
- వ్యాయామం పూర్తయిన పది నిమిషాల తరువాత గోరువెచ్చని నీళ్ల తాగడం మంచిది. దీనివల్ల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వస్తుంది. రక్త ప్రసరణ వేగం నియంత్రణలో ఉంటుంది.
- వ్యాయామం తరువాత దాహంగా ఉందంటూ చల్లటి నీళ్ల తాగకూడదు. అలా తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మందగించడంతోపాటు కండరాల తిమ్మిరి లాంటి సమస్యలు ఏర్పడతాయి.
- వ్యాయామానికి ముందు, తరువాత మంచినీళ్ల తాగడం మంచిదే అయినప్పటికీ.. అధికంగా నీళ్ల తాగడం లేదా అసలు తాగకపోవడం అనేవి రెండూ హానికరమని గుర్తుంచుకోవాలి. అవసరమైనంత వరకు మాత్రమే నీళ్ల తాగి శరీరాన్ని తేమగా ఉంచుకోవాలి.



పేలుడు జరిగిన గోదాములో మృతదేహాలు

బాణసంచా కేంద్రంలో భారీ విస్ఫోటనం

(మొదటిపేజీ తరువాయి)

తొమ్మిది దశాబ్దాలుగా శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్‌వర్క్స్ పేరుతో బాణసంచా తయారీ కేంద్రం నడుస్తోంది. వివిధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడి నుంచి దీపావళి సామగ్రి తరలిస్తుంటారు. ఎప్పుడూ 40 మందికి పైగానే కూలీలు పనిచేస్తుంటారు. అయితే, మధ్యాహ్నం భోజన విరామ సమయం కావడంతో చాలామంది భోజనానికి వెళ్లారు. దీంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి అలియాస్ సత్తిబాబు పర్యవేక్షణలో ప్రమాద సమయంలో ఏడుగురు పని చేస్తున్నారు.

ప్రమాదంపై భిన్న కథనాలు..

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. చిచ్చుబుడ్డు తయారుచేసి శాంపిల్‌గా దానిని వెలిగించారు. అది మండిన వెంటనే నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. తయారీ కేంద్రంలోనే స్టాకు పాయింట్ కూడా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం చోటుచేసుకుంది. మంటలు అలుముకోగానే.. లోపలకు వెళ్లి సరుకును బయటకు తీసుకువచ్చేందుకు చేసే ప్రయత్నంలో సత్తిబాబు సజీవ దహనమైనట్టు సమాచారం. కాగా, ప్రమాదంపై పోలీసుల కథనం భిన్నంగా ఉంది. చిచ్చుబుడ్డి తయారీ కోసం మందు కూరుతుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. కాగా, మృతులను సోమేశ్వరం గ్రామానికి చెందిన పాకా అరుణ (33), అనపర్తి సావరానికి చెందిన చిట్టూరి శ్యామల (38), కుడుపూడి జ్యోతి (38), అనపర్తి గ్రామానికి చెందిన పెంకే శేషారత్నం(35), ఒడిశాకు చెందిన కె.సదానందం (50)గా వీరిని గుర్తించారు. బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన పట్నూరి వెంకటరమణ (50) కాకినాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు

వంటిపై గుర్తుల ఆధారంగా..

మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలి బూడదయ్యాయి. దీంతో వంటిపై గుర్తుల ఆధారంగా మృతదేహాలను గుర్తించాల్సి వచ్చింది. చేతికి ఉన్న ఉంగరం ఆధారంగా యజమాని సత్తిబాబు మృతదేహాన్ని గుర్తించారు. కాగా, తీవ్రంగా గాయపడిన వేండ్రకు చెందిన లింగం వెంకటకృష్ణ అలియాస్ చిన్నా, లింగం చినబాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, అనపర్తికి చెందిన చిట్టూరి యామినిని కాకినాడ జీజీహెచ్, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సమాచారం. విస్ఫోటనానికి కారణాలను విశ్లేషించేందుకు అమరావతి నుంచి ఫోరెన్సిక్ సైన్స్ లేబోరేటరీకి చెందిన నిపుణుల బృందం వస్తోందని కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు.

అడ్డగోలు బదిలీలు, పదోన్నతులు

- ముందు అదనపు బాధ్యతలు.. ఆ తర్వాత శాశ్వత పదవులు
- గిరిజన సంక్షేమ శాఖలో ఇష్టారాజ్యం

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో అడ్డగోలుగా బదిలీలు, పదోన్నతుల పరంపర కొనసాగుతూనే ఉంది. నిబంధనలు, మార్గదర్శకాలను లెక్కచేయకుండా తాత్కాలిక బాధ్యతల పేరుతో ఉన్నత హోదాలో నియమించి, వెంటనే ఆ పోస్టుల్లోనే పూర్తిస్థాయిలో కొనసాగేలా డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) నుంచి ఆమోదం పొందేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దీని వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. ఇదే శాఖలో పదవీ విరమణ చేసి, ప్రస్తుతం సచివాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగి చక్రం తిప్పారనే విమర్శలున్నాయి. ఆగస్టు 30న ఇంజనీరింగ్ విభాగంలో కొందరికి పదోన్నతులు, బదిలీలు కల్పిస్తూ జీవో నెం.242 జారీ అయింది. ఏటూరునాగారం సబ్ డివిజన్‌లో డీఈఈగా ఉన్న ఎం.బాలుకు ఆరేడు నెలల క్రితమే హైదరాబాద్ మైదాన ప్రాంత ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీవో ప్రకారం ఆయనకే పూర్తి అదనపు బాధ్యతలతో హైదరాబాద్ ఎస్ఈగా నియమించి.. అదే రోజున కీలకమైన రాష్ట్రస్థాయి చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా కూడా బాధ్యతలు ఇచ్చారు. ఉద్యోగుల సీనియారిటీ జాబితాను రూపొందించేటప్పుడు మెరిట్ రోస్టర్ పాయింట్లు పరిగణనలోకి తీసుకోకుండా జీవో నెం.436కు తూట్లు పొడిచారనే విమర్శలొచ్చాయి. దీనిపై ప్రస్తుతం న్యాయస్థానంలో డబ్ల్యూపీ దాఖలైనా.. దానిని పట్టించుకోకుండా పదోన్నతులు కల్పించారనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ సబ్ డివిజన్‌లో డీఈఈగా ఉన్న ఆర్టీ ఫణికుమారికి సీఈ కార్యాలయంలో ప్లానింగ్ అండ్ మానిటరింగ్ ఈఈగా బాధ్యతలు అప్పగించి.. గత నెల 30న జరిగిన బదిలీల్లో ఆమెకు వరంగల్ ఎస్ఈగా పదోన్నతి కల్పించారు. రెండేళ్ల క్షేత్రస్థాయి అనుభవం లేకున్నా.. బాలుకు సీఈ, ఫణికుమారికి ఎస్ఈగా బాధ్యతలు అప్పగించడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సబ్ డివిజన్‌లో డీఈఈగా పనిచేసే ఏ.హేమలత హైదరాబాద్ టీడబ్ల్యూలో ఎస్ఈగా కొనసాగుతుండగా.. ఆమెకు సీఈ ఆఫీసులో ప్లానింగ్ అండ్ మానిటరింగ్‌లో ఈఈగా డిమోషన్ ఇచ్చారు. బాలుకే ఎస్ఈ, సీఈ పోస్టులు కేటాయించడంతో ఆమెకు ఈఈ పోస్టుతో సరిపెట్టాల్సి వచ్చింది. గత నెల విడుదల చేసిన మరో జీవో నెం.258 ప్రకారం తిరిగి ఆమెకు ఎస్ఈగా పదోన్నతి కల్పిస్తూ.. యథాస్థానం కేటాయించారు. మైదాన ప్రాంత ఐటీడీఏలో డీఈగా పనిచేస్తున్న సత్యానందంకు ఈఈగా పదోన్నతి కల్పించి భద్రాచలం బదిలీ చేశారు. నెల తిరగకముందే ఆయనను మళ్లీ హైదరాబాద్‌కు ఈఈగా బదిలీ చేస్తూ వారం క్రితం మరో జీవో విడుదలైంది. రోస్టర్ మెరిట్ పాయింట్లను పట్టించుకోకుండా, జీవో ఆర్టీ నెం.436కు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ పదోన్నతులు, బదిలీలతో అనేక మంది ఉద్యోగులు సీనియారిటీ కోల్పోయి తీవ్రంగా నష్టపోతారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

జామ ఆకా.. మజాకా!



ఆరోగ్యాభిలాషుల దృష్టి ఇప్పుడు జామ ఆకులపై ఆరోగ్యానికి మేలు అనే భావనతో మహా గిరాకీ

- ఆకులు, పొడి, టీ పొడి రూపంలో లభ్యం
- ఆన్‌లైన్‌లో 50 ఆకుల ధర రూ.199
- 100 గ్రాముల ఎండుటాకులైతే రూ.90
- పావుకిలో జామాకుల పొడి రూ.249
- మధుమేహం, కొవ్వు నియంత్రణకు మేలు
- ఇష్టంవచ్చినట్లు వాడితే అనర్థమే: వైద్యులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గల్లీలో అలా నడుస్తూ.. పక్కన జామ చెట్టు కనిపిస్తే నాలుగైదు చిగురుటాకులను తుంచి నోట్లో వేసుకోవడం ఎంతమందికి అలవాటు? ఇకముందు అలా ఆకులు తుంచితే ఆ యజమానులు ఊరుకోకపోవొచ్చు. ఎందుకంటే.. జామ ఆకులూ ఖరీదైపోయాయిప్పుడు. ఓ యాభై జామ ఆకుల ధర 199 రూపాయలు!! ఇది.. 50శాతం డిస్కౌంట్ ఆఫర్‌తో ఓ ప్రముఖ ఈ-కామర్స్ సైట్లో పెట్టారు. ఇంత ధర ఎందుకు? అయినా జామాకులను ఎందుకు కొనాలి? అనంటారా! ఆరోగ్యానికి జామాకులు మేలు చేస్తాయి అని కొందరు నిపుణులు సూచిస్తుండటంతో ఆరోగ్యాభిలాషుల దృష్టి వీటిపై పడింది. కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్‌లో జామాకులు విరివిగా దొరికే పరిస్థితి ఎక్కడుంది? అందుకే.. ఆరోగ్యాభిలాషుల్లో కొందరు జామాకుల కోసం ఆన్‌లైన్‌లో ఎగబడుతున్నారు. జామాకులే కాదు.. జామాకుల పొడి, జామాకుల టీపొడి అంటూ గ్రాముల లెక్కన ఈ-కామర్స్ సైట్లలో లభ్యమవుతున్నాయి. ఎండబెట్టిన జామాకులైతే 100 గ్రాముల ధర రూ.90 అట! జామాకుల పొడి అయితే పావుకిలో రూ.249కు దొరుకుతోంది.

ఏం ఉపయోగం?

అతిసారం, పేగులలో ఇన్‌ఫెక్షన్‌ల చికిత్స కోసం జామ ఆకులతో చేసిన చాయ్ మేలు చేస్తుందని.. దగ్గు నుంచి ఉపశమనం పొందేందుకూ తోడ్పడుతుందని, మధుమేహాన్ని, బరువును నియంత్రణలో ఉంచేందుకు దోహదం చేస్తుందని ఎప్పట్నుంచో నిపుణులు చెబుతున్నారు. జామాకుల రసాన్ని పలు రకాల ఔషధాలు, సౌందర్య ఉత్పత్తుల్లోనూ వినియోగిస్తున్నారు. జామాకులలో యాంటీ ఆక్సిడెంట్స్ ఫ్లావనాయిడ్స్ వంటివి ఉన్నాయి. మెక్సికో, సెంట్రల్ అమెరికా దేశాల్లో జామాకులను పలు రకాల చికిత్సల కోసం వినియోగిస్తుండటం ఎప్పటి నుంచో ఉందని.. ఇటీవల ఈ ధోరణి మన దగ్గరా పెరిగిందని వైద్యులు చెబుతున్నారు. జామాకుల రసాన్ని జుట్టు రాలడాన్ని నివారించేందుకు హెయిర్ మాస్క్‌గా, జీర్ణకోశ సమస్యలకు, చెడు కొవ్వు కరిగించేందుకు, దంత సమస్యల నివారణకు వాడుతున్నారు. జామాకులతో మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవొచ్చునని, ఈ ఆకులు క్యాన్సర్ నిరోధకంగా పని చేస్తాయని శ్రీయం ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో చీఫ్ ఫిజిషియన్, డాక్టర్ నాగేంద్ర పేర్కొన్నారు. జామాకుల రసంతో శరీరంలోని విషపదార్థాలు తొలగిపోతాయని.. తద్వారా కాలేయం పనితీరుకు ఉపయోగపడుతుందని చెప్పారు.



డాక్టర్ సూచనల మేరకే..

జామాకులు ఆరోగ్యానికి ఉపయుక్తమైన సహజ ఔషధంగా ప్రాచుర్యం పొందాయి. ఈ ఆకుల్లో క్వెర్సెటిన్, అపిజెనిన్, గాలిక్ యాసిడ్, కాటెకిన్, కాంప్ఫెరాల్ వంటి ఫైటో కెమికల్స్ ఉన్నాయి. ఇవి మధుమేహం, క్యాన్సర్, జీర్ణ సమస్యలు, ఇన్‌ఫెక్షన్ల నివారణకు సాయపడతాయి. వీటిని అధిక మోతాదులో తీసుకోవడం వల్ల కడుపునొప్పి, వాంతులు చేసుకోవడం వంటి దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. మధుమేహానికి మందులు వాడుతున్న వారు ఈ ఆకులను తీసుకోవడంలో జాగ్రత్తగా ఉండాలి. అందుకే.. రోజుకు ఒకటి లేదా రెండు కప్పుల జామాకుల టీనే తీసుకోవాలి. పొడి రూపంలో తీసుకుంటే 250-500 మిల్లీగ్రాముల మోతాదు మించకూడదు. ఆయుర్వేద వైద్యుడి సూచనలు పాటించకుండా జామాకులను వాడటం మంచిది కాదు.

\- డాక్టర్ నాగేంద్ర, చీఫ్ ఫిజిషియన్, శ్రీయం ఆయుర్వేదిక్ హాస్పిటల్

గుడ్డిగా వాడితే సమస్యలు రావొచ్చు



జామపండుతో ఆరోగ్య ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. రోజుకు ఒక పండు తిన్నా ఆరోగ్యానికి మంచిది. జామాకుల తోనూ మునగాకుల మల్లే కొంతమేర ప్రయోజనం ఉంటుంది. అయితే ఈ ఆకులను పరిమిత మోతాదులోనే తీసుకుంటేనే మంచిది. గుడ్డిగా వాడితే ఆరోగ్యపరమైన సమస్యలు రావచ్చు. కొంతమంది జామాకుల టీ తాగుతున్నారు అది కూడా పరిమితంగా తీసుకుంటేనే మంచిది.

\- డాక్టర్ గాయత్రి, కన్సల్టెంట్ డైటిషియన్, అపోలో హాస్పిటల్స్

మక్క రైతులకు భరోసా!

- 5 లక్షల టన్నుల సేకరణకు సన్నాహాలు
- రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదనలు
- నేడో, రేపో సీఎం నిర్ణయం తీసుకునే అవకాశం
- సిండికేట్ వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో మొక్కజొన్న (మక్కలు) ధరలు పడిపోతున్న నేపథ్యంలో రైతులకు మద్దతుగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ముఖ్యమంత్రి కార్యాలయానికి ప్రతి పాదనలు పంపింది. సీఎం రేవంత్‌రెడ్డి మక్కల కొనుగోళ్లపై నేడో, రేపో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో సుమారు 6.5 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా, ఉత్పత్తి సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని వ్యవసాయశాఖ అంచనావేసింది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర (ఎమ్ఎస్పీ) రూ. 2,420 కాగా, ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు రూ. 2,000కు మించి ధర పెట్టడంలేదు. ప్రభుత్వ సంస్థలు మార్కెట్‌లో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు, పౌల్ట్రీ, ఇథనాల్ కంపెనీల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి ధరలను శాసిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి మక్కలు కొనుగోలు చేయాలని రైతుల నుంచి ఒత్తిడి వస్తోంది. వారి విజ్ఞప్తి మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు రూపొందించి సీఎంవోకు పంపించింది. ఇందులో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్ ప్రణాళిక సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి ఆమోదం లభించిన వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



పువ్వుల వల వేశావే.. చిట్టి చిలకా

రవితేజ కథానాయకుడిగా భాను బోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల హీరోయిన్. సితార ఎంటర్టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 31న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ప్రచార చిత్రాలు, పాటలు ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి 'హుడియో హుడియో' అనే హుషారైన మెలోడీని విడుదల చేశారు మేకర్స్. 'నా గుండె గాలి పటమల్లే ఎగరేశామే.. నే వెళ్లేదారుల్లో పువ్వుల వల వేశావే.. అరే నీలో ఏదో ఉందే.. చిట్టి చిలకా' అంటూ సాగే ఈ గీతం ఆకట్టుకుంటోంది. దేవ్ పాటను రచించగా, హేషమ్ అబ్దుల్‌వహాబ్ ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: విధు అయ్యన్న.

పెద్దితో ప్రేమగీతం





రామ్ చరణ్ కథానాయకుడిగా క్రీడా నేపథ్యంలో తెరకెక్కుతోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. నేటి నుంచి పుణేలో ఈ చిత్రం కొత్త షెడ్యూల్ మొదలవనుంది. రామ్‌చరణ్, జాన్వీకపూర్‌పై ఓ డ్యూయెట్‌ను తెరకెక్కించనున్నారు. ఈ పాటకు ఏ. ఆర్ రెహమాన్ స్వరాలందించగా, జానీ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చుతున్నారు. చిత్రీకరణతో పాటు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో గ్రామీణ యువకుడిగా మాస్ లుక్‌లో రామ్‌చరణ్ కనిపించనున్నారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్ రత్నవేలు, ఎడిటర్: నవీన్ నూలీ

చిత్రీకరణ షురూ



వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ తెరకెక్కించనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ బుధవారం ప్రారంభమైంది. వెంకీ 77 అనేది వర్కింగ్ టైటిల్. ఈ సందర్భంగా షూటింగ్‌లో వెంకటేశ్, త్రివిక్రమ్ కలసి దిగిన ఫొటోను నిర్మాత నాగవంశీ అభిమానులతో పంచుకున్నారు. '20 నెలల సుదీర్ఘ విరామం తర్వాత మాటల మాంత్రికుడు మళ్లీ మెగాఫోన్ పట్టారు. అందరికీ అభిమాన కథానాయకుడైన వెంకటేశ్‌తో చేతులు కలిపారు. ఓజీస్ ఎంటర్టైన్‌మెంట్స్ మళ్లీ పునరావృతం అవుతుంది' అని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు నటించే అవకాశం ఉందని, త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్ పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం.

నిర్మాతలకు పేరు తెచ్చే చిత్రం



సత్యదేవ్


పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'శ్రీ చిదంబరం'. వినయ్ రత్నం దర్శకుడు. చింతా వరలక్ష్మి సమర్పణలో వినీషా రెడ్డి, గోపాల కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాత. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ, గోపీనాథ్ ప్రధాన తారాగణం. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నటుడు సత్యదేవ్ చేతుల మీదుగా యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ 'క సినిమాతో చింతా గోపాల కృష్ణారెడ్డి నిర్మాతగా ఘన విజయాన్ని అందుకున్నారు. మంచి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ సినిమాను చేస్తున్నామని వారు నాతో చెప్పారు. వినయ్ రత్నం తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. 'శ్రీ చిదంబరం' నిర్మాతలకు గొప్ప పేరు తెస్తుంది' అని అన్నారు. గోపాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'పూర్తిగా నూతన నటీనటులతో ఈ సినిమాను నిర్మిస్తున్నాం. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో వినయ్ రత్నం ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కథలో కొత్త కోణం, కథనంలో వేగం ఆయన ప్రత్యేకత' అన్నారు. వినయ్ రత్నం మాట్లాడుతూ 'నూతన నటీనటులతో సరికొత్త తరహాలో కామెడీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. వినోదభరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం. ఈ చిత్రంలో ప్రతి పాత్రకూ ప్రత్యేకత ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకులు సందీప్, సుజిత్, వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు.


వినోదం పంచే డ్యూడ్



తమిళంతో పాటు తెలుగులోనూ హీరోగా సత్తా చాటుతూ వరుస విజయాలను అందుకుంటున్నారు ప్రదీప్ రంగనాథన్. ఆయన కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న చిత్రం 'డ్యూడ్'. కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మమితా బైజు కథానాయిక. శరత్ కుమార్ కీలకపాత్ర పోషించారు. దీపావళి సందర్భంగా ఈనెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం తిరుపతిలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ 'డ్యూడ్ చిత్రం ప్రేమ, కుటుంబ విలువలతో హృద్యంగా ఉంటుంది. మనవైన జీవితాల్ని, పరిస్థితుల్ని ఆవిష్కరిస్తూ దర్శకుడు తెరకెక్కించారు. ప్రథమార్థం వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. దయచేసి పైరసీని ప్రోత్సహించకుండా థియేటర్లలో మా సినిమాను చూడండి' అని ప్రేక్షకులను కోరాడు.

మమ్ముట్టి, దుల్కర్ సల్మాన్ ఇళ్లలో ఈడీ సోదాలు





స్థానిక రాజా అన్నామలైపురం ప్రాంతంలోని ప్రముఖ సినీ నటుడు మమ్ముట్టి, ఆయన కుమారుడు దుల్కర్ సల్మాన్ ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం(ఈడీ) అధికారులు బుధవారం ఉదయం సోదాలు చేశారు. భూటాన్ సైనిక దళం నిర్వహించిన వేలం పాటల ద్వారా లాండ్ క్రూసా, లాండ్ రోవర్ లగ్జరీ కార్లను కొనుగోలు చేసి, వాటిని భారతదేశంలోకి అక్రమంగా దిగుమతి చేసుకున్నట్లు వారిపై ఆరోపణల రావడంతో ఈడీ అధికారులు ఈ సోదాలు చేపట్టారు. సీఐఎస్ఎఫ్ బలగాల భద్రత నడుమ వారి ఇళ్లలో తనిఖీలు చేశారు. ఈ వ్యవహారంలో దుల్కర్ సల్మాన్ వద్ద భూటాన్ నుండి దిగుమతి చేసుకున్న రెండు లగ్జరీ కార్లను ఈడీ ఇదివరకే స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అరిషడ్వర్గాలను జయించే అరి

జయశంకర్



'అరిషడ్వర్గాలు అనే ఆధ్యాత్మిక అంశాన్ని సాధారణ ప్రేక్షకులకు కూడా సులువుగా అర్థం అయ్యేలా వివరించడానికి 'అరి' సినిమాను రూపొందించాను. ఇలాంటి కథల్ని పూర్తిగా సందేశాత్మకంగా కాకుండా, ఎంటర్‌టైనింగ్‌గా చెప్పాలి. ఆ ప్రయత్నంలో దర్శకుడిగా నేను సఫలమయ్యాననే అనుకుంటున్నాను' అని దర్శకుడు జయశంకర్ అన్నారు. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రమిది. ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జయశంకర్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

'నాకు చిన్నప్పటి నుంచి పురాణాలు, ఇతిహాసాలు అంటే ఆసక్తి. వాటి గురించి తెలుసుకొని, అవగాహన పెంచుకున్నాను. మన పురాణాల్లో అరిషడ్వర్గాలను జయించాలని చెప్పారే తప్ప వాటిని ఎలా జయించాలో సవివరంగా చెప్పలేదు. ఈ పాయింట్‌తో ఓ సినిమా చేయాలనిపించింది. హిమాలయాలకు వెళ్లి యోగులను కలిశాను. నా ఆలోచన వారికి చెప్పాను. మంచి ప్రయత్నం అని అభినందించి వారు అనేక విషయాలు చెప్పారు. అరిషడ్వర్గాలను జయించేందుకు వారి ద్వారా మార్గాలు, సూచనలు తెలుసుకున్నాను. వాటి ఆధారంగానే 'అరి' చిత్రాన్ని రూపొందించాను. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గారు, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, నిర్మాత అశ్వనీదత్ తదితరులు 'అరి' సినిమాను చూసి 'ఆధునిక భగవద్గీతలా ఉంది. పురాణాలు, ఇతిహాసాలు చదవని యువతకు ఈ సినిమాను చూస్తే వాటిలోని సారం తెలుస్తుంది' అని ప్రశంసించారు.

శ్రీకాంత్‌భరత్‌పై ఫిర్యాదు



మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు శ్రీకాంత్‌భరత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైశ్య వికాస వేదిక ఛైర్మన్ కాచం సత్యనారాయణ గుప్త బుధవారం సాయంత్రం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్యకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి అవహేళన వ్యాఖ్యలను చేసిన శ్రీకాంత్ భరత్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి)

చారిత్రక నేపథ్యంతో గత వైభవ



ఎస్ ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం 'గత వైభవ'. చారిత్రక నేపథ్యంలో కాల్పనిక గాథగా తెరకెక్కుతోన్న చిత్రమిది. సింపుల్ సుని దర్శకత్వం వహిస్తూ దీపక్ తిమ్మప్పతో కలసి నిర్మిస్తున్నారు. నవంబర్ 14న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దుష్యంత్ మాట్లాడుతూ 'దర్శకుడు సుని గారు కన్నడలో పలు విజయవంతమైన చిత్రాలను అందించారు. సనాతన ధర్మంలోని కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథ ఇది. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కించారు. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. నిర్మాతలు భారీస్థాయిలో నిర్మించారు. తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ 'ఇది నా తొలి కన్నడ చిత్రం. తెలుగులోనూ విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర కొత్త తరహాలో ఉంటుంది. సునీ గారి మేకింగ్ తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అని అన్నారు. 'ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రమిది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు. ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుందని నిర్మాత అన్నారు.

రూ.900 కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రం

టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలోని డేటా వనరులు, స్పెక్ట్రమ్ ఆస్తులను పరిరక్షించేందుకు దాదాపు రూ.900 కోట్లతో జాతీయ శాట్‌కామ్ పర్యవేక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బుధవారం వెల్లడించారు. ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) సదస్సులో శాటిలైట్ కమ్యూనికేషన్స్ అంశంపై జరిగిన సెషన్‌లో మాట్లాడుతూ టెలికం, బ్రాడ్‌కాస్టింగ్ కూడిన దేశీయ శాట్‌కామ్ మార్కెట్ గత ఏడాది 430 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుందన్నారు. 2033 నాటికి దాదాపు 1,500 కోట్ల డాలర్ల స్థాయికి పెరగవచ్చన్నారు. దేశంలో శాటిలైట్ ద్వారా వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రైవేట్ రంగంలోని మూడు సంస్థలు యూటెల్‌శాట్ వన్‌వెబ్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్, జియో ఎస్‌జీఎస్‌కు లైసెన్సులు మంజూరు చేసింది. ఈ మూడు సంస్థలు శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన స్పెక్ట్రమ్ కేటాయింపుల కోసం ఎదురు చూస్తున్నాయి.

వేగంగా శాట్‌కామ్ సేవల విస్తరణ


భారత టెలికం సంస్థలు ఇప్పటివరకు 4.8 లక్షల టవర్లు ఏర్పాటు ద్వారా దేశంలోని 99.9 శాతం జనాభాకు 5జీ సేవలను అందుబాటులోకి తెచ్చాయని సింధియా అన్నారు. "ఇక శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల్లో అడుగుపెట్టబోతున్నాం. ప్రపంచంలోనే అత్యంత వేగంగా శాటిలైట్ సేవలు విస్తరించడమే కాకుండా మానవాళికి శాట్‌కామ్ అవసరాన్ని పునర్నిర్వచిస్తాం. ఇంతక్రితం 5జీతో ఇదే చేశాం. ప్రపంచ దేశాలన్నింటిలోకెల్లా వేగంగా 20 నెలల్లోనే 5జీ సేవలను విస్తరించాం. శాట్‌కామ్ విషయంలోనూ ఆ ఫలితాన్ని పునరావృతం చేస్తామని హామీ ఇస్తున్నా" అని మంత్రి పేర్కొన్నారు.

6జీలో 10 శాతం పేటెంట్ల లక్ష్యం

భారత ఆశయాలు 5జీని దాటి 6జీ, శాట్‌కామ్‌కు విస్తరించి ఉన్నాయని సింధియా అన్నారు. 6జీ సాంకేతికతలో 10 శాతం పేటెంట్లను కలిగి ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో శాట్‌కామ్ సేవల వినియోగ వృద్ధి చెందనున్నాయని, 2033 నాటికి ఈ మార్కెట్ మూడింతలు కావచ్చన్నారు.

భారతీయులకు భద్రమైన, ఆమోదనీయమైన, అత్యంత నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ అనుభూతిని పంచేందుకు సంసిద్ధంగా ఉన్నాం.
- పర్నిల్ ఉర్ధ్వరేశ్, స్టార్‌లింక్ ఇండియా ప్రతినిధి

టెలికం శాఖ అభివృద్ధి చేసిన ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ ప్లాట్‌ఫామ్ సహాయంతో ఫోన్‌పే, పేటీఎం వంటి పేమెంట్ యాప్‌లు రూ.200 కోట్ల విలువ చేసే మోసాలను అరికట్టగలిగాయి.
- రాహుల్ చారి, ఫోన్‌పే సహ-వ్యవస్థాపకుడు



భారత్‌లో శాట్‌కామ్ సేవలపై ప్రజల అంచనాలు పెరుగుతున్న తరుణంలో యూటెల్‌శాట్ వన్‌వెబ్ ద్వారా శాట్‌కామ్ సేవలను ప్రారంభించేందుకు కేంద్రం అనుమతి కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాం.
- సునీల్ మిత్తల్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్



సెమీకండక్టర్ల నుంచి ఫ్రాడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ వరకు, త్వరలో రాబోతున్న 6జీలో భారత్ పురోగతిని ఐఎంసీలో ప్రదర్శించిన పూర్తి స్థాయి సాంకేతికతలు నొక్కి చెబుతున్నాయి. డిజిటల్ విప్లవంలో భారత్‌ను అగ్రస్థానంలో ఉంచడంతో పాటు నవ ఆవిష్కరణలకు మా కంపెనీ కట్టుబడి ఉంది.
- ఆకాశ్ అంబానీ, రిలయన్స్ జియో చైర్మన్

నెఫ్రోప్లస్ @ 500 క్లినిక్‌లు

న్యూఢిల్లీ: నెఫ్రోప్లస్ పేరుతో డయాలిసిస్ సేవలందిస్తోన్న హైదరాబాద్ సంస్థ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ కార్యకలాపాలు కీలక మైలురాయికి చేరాయి. 2010లో ఒక క్లినిక్‌తో ప్రారంభమైన తమ ప్రస్థానం. ప్రస్తుతం 500 కేంద్రాలకు పెరిగిందని నెఫ్రోప్లస్ బుధవారం వెల్లడించింది. భారత్‌తోపాటు నేపాల్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్తాన్ మార్కెట్లకూ తమ సేవలను విస్తరించినట్లు, ఏటా 33,000 మందికి పైగా రోగులకు సేవలందిస్తున్నట్లు తెలిపింది. కాగా ఈ సంస్థ ఐపీఓకి కూడా సిద్ధమవుతోంది.

ఆరో రియల్టీ రూ.2,000 కోట్లు సమీకరణ

న్యూఢిల్లీ: అరబిందో గ్రూప్‌నకు చెందిన ఆరో రియల్టీ బాండ్ల విక్రయం ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించనుంది. కీలక కొనుగోళ్లకు ఈ నిధులు వినియోగించుకోనున్నట్లు ఇద్దరు మర్చంట్ బ్యాంకర్లు వెల్లడించినట్లు ఒక వార్తా సంస్థ ప్రచురించింది. కంపెనీ 11 నుంచి 15 శాతం వడ్డీరేటుతో రెండేళ్లు, నాలుగేళ్ల కాలపరిమితి గల బాండ్లు జారీ చేయనున్నట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్ బంజారా సహా కొన్ని ఆస్తుల కొనుగోలుకు ఇది ప్రమోటర్ల స్థాయి ఫైనాన్సింగ్ అని ఆ బ్యాంకర్లలో ఒకరు చెప్పారు. ఈ వార్తలపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధులు నిరాకరించారు.

'టాటా' పరువు తీయొద్దు

● అమిత్ షా హెచ్చరిక
● ప్రభుత్వం ముందుకు పంచాయతీ

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఇంటి పోరు ప్రభుత్వం ముంగిటికి చేరింది. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, వైస్ చైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా గ్రూప్ కంపెనీల మాతృ సంస్థ టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, ట్రస్టీ డరియస్ కంబట్ట బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో కలిసి తాజా పరిస్థితిని వివరించారు. వారు చెప్పిన విషయాలు సావధానంగా విన్న కేంద్ర హోం మంత్రి దేశ ఆర్థిక వ్యవస్థలో టాటా గ్రూప్ ప్రాధాన్యత దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని...ముఖ్యంగా గ్రూప్ కంపెనీల ఆర్థిక స్థిరత్వానికి ఎలాంటి ఢోకా లేకుండా వ్యవహరించాలని గట్టిగా చెప్పినట్టు సమాచారం. టాటా ట్రస్ట్‌లో నెలకొన్న అంతర్గత కుమ్ములాటల ప్రభావం ఏట్టి పరిస్థితుల్లోనూ టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌పై పడకుండా చూడాలని కూడా అమిత్ షా స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. దాదాపు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా పాల్గొన్నారు. టాటా సన్స్ ఈక్విటీలో 66 శాతానికిపైగా వాటా ఉన్న టాటా ట్రస్ట్‌లో ఇటీవల కుమ్ములాటలు పెరిగిపోయాయి. ముఖ్యంగా నలుగురు ట్రస్టీలు ట్రస్ట్ చైర్మన్ నోయెల్ టాటా నిర్ణయాలకు అడ్డు తగులుతున్నట్టు తెలుస్తోంది. దీంతో గత నెలాఖరుకు పూర్తి కావాలసిన టాటా సన్స్ కంపెనీ ఐపీఓ కూడా అమలుకు నోచుకోలేదు. కేంద్ర మంత్రులతో జరిగిన భేటీలో ఈ అంశం కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	528	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	124
వరంగల్	105	గుంటూరు	114
కరీంనగర్	105	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	95
కర్నూలు	105	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,170 ▲	1,12,900 ▲	1,67,000 ▼
విజయవాడ	1,20,600 ▼	1,15,000 ▼	1,60,000 ▲
విశాఖపట్నం	1,26,050 ▲	1,11,850 ▲	1,70,000 ▲
రాజమండ్రి	1,23,920 ▲	1,13,600 ▲	1,54,200 ▲
ప్రొద్దుటూరు	1,27,000 ▲	1,16,840 ▲	1,58,000 ▲
ముంబై	1,22,100 ▲	1,11,840 ▲	1,52,700 ▲

అన్ని వర్గాల అవసరాలు తీర్చాలి

ఫిన్‌టెక్ కంపెనీలకు ఆర్‌బీఐ గవర్నర్ సూచన



ముంబై: ఫిన్‌టెక్ కంపెనీలు ఉత్పత్తుల రూపకల్పనలో సమాజంలోని దిగువ వర్గాలు, ప్రత్యేక అవసరాలు గల వ్యక్తులకు సేవలందించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సూచించారు. సంపన్నులకు సేవలందించడం లాభదాయకమే కాని...అదే సమయంలో అన్ని వర్గాలకు అవి ఉపయోగకరంగా ఉండడం కూడా ప్రధానమేనన్నారు. ఆర్థిక అక్షరాస్యత లేని వారు, వయోవృద్ధులు, దివ్యాంగులు, చిన్న వ్యాపారుల అవసరాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రధానంగా చిన్న వ్యాపార సంస్థలు, అల్పాదాయ వర్గాలకు అవసరమైనంతగా రుణం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉన్నదన్న విషయం ఆయన గుర్తు చేశారు. ఫిన్‌టెక్ కంపెనీలు ఉత్పత్తులు పారదర్శకంగా, ఖాతాదారుల డేటాను పరిరక్షించేలా ఉండాలని కోరారు. దేశంలో పెరిగిపోతున్న డిజిటల్ మోసాలపైనా ఆర్‌బీఐ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టేందుకు వెంటనే వర్గాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త తరం ఫైనాన్షియల్ మార్కెట్ సాధనంగా ఆర్‌బీఐ "యూనిఫైడ్ మార్కెట్స్ ఇంటర్‌ఫేస్"ను రూపొందించినట్టు మల్హోత్రా చెప్పారు. ఇది సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీని (సీబీడీసీ) ఉపయోగించుకుని ఆస్తులు, సెటిల్మెంట్లు చేయగల సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. దీనికి సంబంధించిన తొలి ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నట్టు చెప్పారు.

నిధులకు ఢోకా లేదు: ఎస్‌బీఐ చైర్మన్

లిస్టెడ్ కంపెనీల కొనుగోళ్లు, విలీనాలకు అవసరమైన రుణాలు సమకూర్చేందుకు తమ బ్యాంకుకు ఎలాంటి నిధుల కొరత లేదని గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఇటీవల ప్రకటించిన ద్రైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో, లిస్టెడ్ కంపెనీలు వేరే కంపెనీలను కొనుగోలు చేయడం లేదా విలీనాలకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ఆర్‌బీఐ బ్యాంకులను అనుమతించింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ఈ విషయంలో తమ బ్యాంకుకు పూర్తి పరిజ్ఞానం ఉందన్నారు. ఇప్పటికే తమ బ్యాంకు భారతీయ కంపెనీలు విదేశీ కంపెనీలను కొనేందుకు అవసరమైన నిధులు సమకూర్చిన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. యూపీఐ ద్వారా జరిగే రుణ వసూళ్ల విషయంలో బ్యాంకులు తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవల్సిన అవసరం ఉందని శెట్టి స్పష్టం చేశారు.

పసిడి మరో కొత్త రికార్డు

ప్రొద్దుటూరులో 10 గ్రాములు రూ.1.27 లక్షలు

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో రికార్డుల హోరు కొనసాగుతోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధర బుధవారం మరో రికార్డు స్థాయికి చేరింది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్) బంగారం ధర ఒక్క రోజులోనే రూ.2,600 పెరిగి రూ.1,26,600కు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. గత మూడు రోజుల్లోనే 10 గ్రాముల పసిడి ధర రూ.6,000 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 4,050 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఢిల్లీలో కిలో వెండి ధర సైతం బుధవారం రూ.3,000 లాభంతో రూ.1.57 లక్షలకు చేరింది.

తెలుగు రాష్ట్రాల్లో : తెలుగు రాష్ట్రాల్లోనూ బంగారం, వెండి ధరలు బుధవారం చుక్కలంటాయి. ప్రొద్దుటూరులో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.2,500 లాభంతో రూ.1.27 లక్షలకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది. విశాఖపట్నంలో కిలో వెండి రూ.2,900 లాభంతో రూ.1.7 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది.

నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో నాలుగు రోజుల ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద ముగియగా నిఫ్టీ 62.15పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిశాయి. ఆర్‌ఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వంటి బ్లూచిప్ కంపెనీలు, ఆటో, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాలు బుధవారం సూచీలను కిందికి లాగాయి. క్యూ2లో కంపెనీల ఆర్థిక ఫలితాలపై అనుమానాలు కూడా ఇందుకు దోహదం చేసినట్టు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ కంపెనీ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

స్పోర్ట్స్

భారత క్రికెట్‌లో గంభీర్ దుమారం!



ఆస్ట్రేలియాలో జరిగే వన్డేలకు భారత వన్డే జట్టు కెప్టెన్‌గా రోహిత్ శర్మను తొలగించడం...దేశ క్రికెట్ వర్గాల్లో వర్చనీయాంశంగా మారింది. మరోవైపు టీ20లకు, టెస్టులకు ఇప్పటికే వీడ్కోలు పలికిన టీమిండియా దిగ్గజ ద్వయం రోహిత్-కోహ్లీని వన్డేల నుంచీ తప్పించాలన్న కుట్ర జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రోహిత్‌ను వన్డే జట్టు సారథ్య బాధ్యతల నుంచి తొలగించారనేది కొందరి వాదన. రెండు ఫార్మాట్లకు రోహిత్, కోహ్లీ తప్పుకొనేలా చేయడంతోపాటు మిగిలిన వన్డేల నుంచీ వారు వైదొలగేలా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కుట్ర పన్నుతున్నాడని రో-కో అభిమానులు దుయ్యబడుతున్నారు. అలాగే ఈ ఇద్దరు గొప్ప క్రికెటర్ల కెరీర్‌లకు సొమ్మనలక సొగిబెడుతున్నాడని గంభీర్‌పై మాజీ ఆటగాడు మనోజ్ తివారీ ధ్వజమెత్తడం కీలక తాజా పరిణామం. మరోవైపు ముంబైలో జరిగిన సియెట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి. చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు టైటిల్ గెలిచేందుకు గత కోచ్ రాహుల్ ద్రవిడ్ ముందుచూపు, ఆతడి కోచింగ్ శైలే ప్రధాన కారణమని రోహిత్ వెల్లడించాడు. దాంతో...టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలవడంలో గంభీర్ పాత్ర లేదని తన మాట ద్వారా రోహిత్ తేల్చేశాడని రోహిత్ ఫ్యాన్స్ అంటున్నారు.

గంభీర్ తీరుతో వివాదాలు: మనోజ్ తివారీ

మాజీ ఆటగాడు మనోజ్ తివారీ చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనం సృష్టించాయి. 'గంభీర్ కోచ్ అయ్యాక ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న అశ్విన్ అర్ధంతరంగా రిటైర్మెంట్ ప్రకటించాడు. రోహిత్, కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్లనుంచి రిటైర్ అయ్యారు. రోహిత్, కోహ్లీ, అశ్విన్‌లకు ప్రస్తుత కోచ్ తీరు నచ్చలేదు. గంభీర్ వ్యవహారశైలీ కారణంగానే వారు మాజీలై పోతున్నారు. ఇలాంటి చాలా తప్పులు జరిగాయి' అని ఆరోపించాడు.

ఏకమైన రో-కో ఫ్యాన్స్

గంభీర్‌కు వ్యతిరేకంగా రోహిత్, విరాట్ అభిమానులు ఒక్కటయ్యారు. తన అహంకారాన్ని సంతృప్తి పరచుకొనేందుకు తమ స్టార్లిద్దరి కెరీర్‌లను గంభీర్ నాశనం చేశాడని దుయ్యబడుతున్నారు. జట్టుకు ఎంతో సేవ చేసిన ఆ దిగ్గజాలకు ఇచ్చే గౌరవ మర్యాదలు పొందలేని ఆతడు సీనియర్ ఆటగాళ్లను లక్ష్యంగా చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు. గంభీర్ వల్లే తమ స్టార్లకు ఈ పరిస్థితి ఏర్పడిందని రో-కో ఫ్యాన్స్ మండిపడుతున్నారు. జట్టుకు సంబంధించి ప్రధాన విషయాలను సీనియర్ల వ్యతిరేకి స్టార్ ఆడేందుకు అవకాశం ఉన్నా...వారి మాటలను కనీసం లెక్కలోకి తీసుకోకుండా కోచ్ అహంకారంతో వ్యవహరిస్తున్నాడు. 2027 వన్డే వరల్డ్ కప్ జట్టులో రో-కో లేకపోతే అది గంభీర్ వ్యక్తిగత నిర్ణయం అవుతుంది' అని మనోజ్ వ్యాఖ్యానించాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

తరుణ్ సూపర్

● 14వ ర్యాంకర్‌కు షాక్
● లక్ష్యసేన్ ఇంటికి
● ఆర్కిటిక్ ఓపెన్



వన్టా (ఫిన్లాండ్): తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. ప్రపంచ 14వ ర్యాంకర్ టోమా జూనియర్ పోపోవ్ (ఫ్రాన్స్)కు షాకిచ్చి రెండోరౌండ్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్లో 46వ ర్యాంకర్ తరుణ్ 11-21, 21-11, 22-20తో పోపోవ్‌ను కంగుతినిపించాడు. లక్ష్య సేన్ 15-21, 17-21తో జపాన్ కోడాయ్ నరవోకా (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఓ టోర్నీలో ఆరంభ రౌండ్లోనే ఓడడం లక్ష్యకు ఈ ఏడాదిలో ఇది పదోసారి. కిదాంబి శ్రీకాంత్ ఆరంభ మ్యాచ్ ఆడకుండానే ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వగా.. కిరణ్ జార్జ్ 10-21, 1-4తో ప్రత్యర్థిపై వెనుకంజలో ఉన్న దశలో గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఐకే, శంకర్ ముత్తుస్వామి, ఆయుష్ శెట్టి ప్రత్యర్థుల చేతిలో ఓడి ఇంటిబాట పట్టారు.

ముంబై దూకుడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ముంబై మిటియర్స్ జోరు కొనసాగుతోంది. బుధవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఢిల్లీ తుఫాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై 3-0 (15-12, 15-10, 15-11)తో నెగ్గింది. ముంబై కెప్టెన్ అమిత్ గులియా, శుభం దూకుడైన ఆట తీరు ఢిల్లీ జట్టును విజయానికి దూరం చేశాయి.

టాపార్డర్ మెరవాలి..

మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో



హర్మన్‌ప్రీత్

మంధాన వైఫల్యంపై ఆందోళన
నేడు దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ
మ్యాచ్‌కి వానగండం

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): వన్డే వరల్డ్‌కప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత మహిళల జట్టుకు ఇక అసలు సిసలు సవాళ్లు ఎదురు కానున్నాయి. గురువారం బలమైన దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంక, పాకిస్థాన్‌పై హర్మన్ సేన నెగ్గినా.. బ్యాటింగ్‌లో తడబాటు కనిపించింది. మెరుగ్గా ఆరంభించినా ఒక్కసారిగా కుప్పకూలుతున్నారు. ముఖ్యంగా టాపార్డర్ వైఫల్యం కలవరపెడుతోంది. మెగా టోర్నీకి ముందు పరుగుల వరద పారించిన ఓపెనర్ స్మృతి మంధాన రెండు మ్యాచ్‌ల్లో 8, 23 పరుగులే చేయడం ఆందోళన కలిగిస్తోంది. స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రతీకా రావల్ బలహీనత ఈసారి ప్రత్యర్థులు. పవర్‌ప్లేలో ఆమెను కట్టడి చేసేందుకు స్పిన్నర్లను బరిలోకి దింపుతున్నారు. వన్‌డౌన్‌లో హర్లీన్ డియోల్ స్ట్రయిక్ రేట్ కూడా పెరగాలి. క్రీజులో కుదురుకోవడానికి ఎక్కువ బంతులు తింటున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బ్యాటింగ్‌కు వెన్నెముక అయిన కెప్టెన్ హర్మన్ కూడా భారీ స్కోర్లు చేయలేకపోతుండడంతో ఆ భారం లోయరార్డర్‌పై పడ తోంది. గత మ్యాచ్‌ల్లో దీప్తి, రిచా, అమన్‌జోత్, రాణా ఆదుకోవడంతో పరువు దక్కింది. కాగా, పాక్‌తో మ్యాచ్‌లో ఆడని పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జోత్ దూరం కావడంతో తుది జట్టులో చోటు దక్కించుకొన్న ఫాస్ట్ బౌలర్ రేణుక మెరుగైన గణాంకాలను నమోదు చేసింది. అయితే, అమన్‌జోత్ ఫిట్‌నెస్‌పై ఇంతవరకు ఎటువంటి సమాచారం లేదు. దీప్తి, శ్రీచరణి, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది. మరోవైపు లంకతో ఓడిపోయిన సఫారీ జట్టు గెలుపు బాట పట్టేందుకు పట్టుదలతో ఉంది. తజ్మిన్ బ్రిట్స్, సునె లస్ వంటి బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ లారా వొల్వార్ట్, మరిజానె కాప్, బోష్ కూడా చెలరేగితే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. అయోబొంగా కకా, కాప్, ట్రయాన్ లాంటి అనుభవజ్ఞులైన బౌలర్ల నుంచి భారత బ్యాటర్లకు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

పిచ్: బ్యాటింగ్‌కు అనుకూలం కావడంతో భారీ స్కోర్లు నమోదు కావచ్చు. కాగా, ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో 50 ఓవర్ల పూర్తి మ్యాచ్ జరుగుతుందా అన్నది అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



లారా వొల్వార్ట్

జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్, జెమీమా, రిచా (వికెట్ కీపర్), దీప్తి, అమన్‌జోత్/రేణుక, శ్రీచరణి, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా.

దక్షిణాఫ్రికా: లారా వొల్వార్ట్ (కెప్టెన్), బ్రిట్స్, లస్, మరిజానె కాప్, బోష్, సినాలో జఫ్తా (వికెట్ కీపర్), డెర్క్‌సెన్, ట్రయాన్, నడిన్ డి క్లర్క్, మసబాటా క్లాస్, కకా, మ్లబా.

క్వార్టర్స్‌కు యువ భారత్

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన పోరులో భారత్ 45-37, 45-34తో యూఏఈపై గెలిచింది. దీంతో గ్రూప్-హెచ్‌లో వరుసగా మూడో విజయం సాధించిన భారత్.. గ్రూప్ టాపర్‌గా నిలిచి క్వార్టర్స్ చేరింది.

చెలరేగిన భరత్.. టైటాన్స్ గెలుపు

చెన్నై: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) చెన్నై అంచెను తెలుగు టైటాన్స్ విజయంతో ముగించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 46-29 హరియాణాను చిత్తు చేసింది. 100వ పీకేఎల్ మ్యాచ్ ఆడిన భరత్ హుడా 20 పాయింట్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తించాడు. విజయ్ 8 పాయింట్లు సాధించాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 37-27తో యూ ముంబాపై నెగ్గింది.

రెండు బృందాలుగా ఆసీస్‌కు..

15న టీమిండియా పయనం

న్యూఢిల్లీ: కంగారూలతో సిరీస్ కోసం భారత వన్డే జట్టు ఈనెల 15న ఆస్ట్రేలియా పయనం కానుంది. అయితే, ఆటగాళ్లంతా ఒకేసారి కాకుండా రెండు బృందాలుగా వెళ్లనున్నట్టు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఆ రోజు బిజినెస్ క్లాస్ టికెట్లు, విమానాల అందుబాటును బట్టి క్రికెటర్ల ప్రయాణం ఉంటుందని పేర్కొన్నాయి. కొందరు ఆటగాళ్లు ఉదయం, మరికొందరు సాయంత్రం ఢిల్లీ నుంచి తొలి వన్డే వేదిక పెర్త్‌కు బయలుదేరనున్నారు. ఆసీస్ టూర్‌లో భాగంగా ముందుగా ఈనెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్, అనంతరం ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టు తలపడనుంది. బుధవారం టెస్ట్ జట్టు సహా వన్డే సిరీస్‌కు ఎంపికైన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్.. విండీస్‌తో టెస్టు ఆడుతున్న భారత జట్టులోని కొందరు ఆటగాళ్లతో కలిసి పెర్త్ వెళ్లనున్నారు. వన్డే సిరీస్‌కు ఎంపికైన వెస్టిండీస్ టెస్ట్ జట్టులోని భారత ఆటగాళ్లు విండీస్‌తో రెండో టెస్టు ముగిసిన వెంటనే తమ ఇళ్లకు బయలుదేరతారు. ఈనెల 15న తిరిగి ఢిల్లీకి వచ్చి ఆసీస్‌కు పయనమవుతారు. ఇక, ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లే ముందు టీమిండియా కోచ్ గంభీర్.. ఢిల్లీలోని తన నివాసంలో ఆటగాళ్లందరికీ డిన్నర్ ఇవ్వనున్నారు.

పాక్ చిత్తు

● మూనీ సెంచరీ
● 107 పరుగులతో ఆసీస్ గెలుపు



బెత్ మూనీ (109)

కొలంబో: క్లిష్ట పరిస్థితుల్లో బెత్ మూనీ (109) శతకంతో పోరాడడంతో.. మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియా రెండో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 107 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. అలెనా కింగ్ (51 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించింది. నష్రా సంధు మూడు వికెట్లు కూల్చగా.. ఫాతిమా సనా, రమీన్ షమీమ్ చెరో రెండు వికెట్లు సొంతం చేసుకున్నారు. ఛేదనలో పాక్ 36.3 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. సిద్రా అమీన్ (35) టాప్ స్కోరర్. కిమ్ గార్త్ మూడు.. మేగన్ షట్, సదర్లాండ్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన ఆసీస్.. పాక్ స్పిన్నర్ల ధాటికి ఒక దశలో 76/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో కింగ్ సహకారంతో మూనీ ఆదుకుంది. శతకం పూర్తి చేసుకున్న మూనీ ఇన్నింగ్స్ ఆఖరి బంతికి అవుటైంది.

రెండోరోజే ముగించారు

● ఏడు వికెట్లతో భారత్ గెలుపు
● అండర్-19 యూత్ టెస్ట్
● 0-2తో ఆసీస్ పరాజయం

మెకే (ఆస్ట్రేలియా): ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో రెండు టెస్ట్‌ల అనధికార సిరీస్‌ను యువ భారత్ 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. రెండో, ఆఖరి టెస్ట్‌లో భారత అండర్-19 జట్టు 7 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. నాలుగురోజుల ఈ టెస్టును రెండో రోజే ఓవర్‌నైట్ స్కోరు 144/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 171 పరుగులకు ఆలౌటై 36 పరుగుల ఆధిక్యాన్ని అందుకుంది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 135 రన్స్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 116 పరుగులకే ఆలౌటైంది. హెనిల్ పటేల్, నమన్ చెరో 3 వికెట్లు తీశారు. ఆ తర్వాత 81 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన భారత్ 84/3 స్కోరు చేసి విజయం సాధించింది.

58 కోట్లిస్తాం.. వచ్చేయండి!

కమిన్స్, హెడ్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీ ప్రతిపాదన?

తిరస్కరించిన ఆసీస్ స్టార్లు

ముంబై: ఫ్రాంచైజీ క్రికెట్ ఆడాలంటూ ఆస్ట్రేలియా స్టార్ ఆటగాళ్లు పాట్ కమిన్స్, ట్రావిస్ హెడ్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ ఆఫర్ ఇచ్చింది. ఏడాది ఒక్కొక్కరికి రూ. 58 కోట్లు మొత్తం ఇచ్చేందుకు ప్రతిపాదించింది. ఇందుకు ఓ షరతు విధించింది. ప్రపంచ వ్యాప్తంగా తమ ఫ్రాంచైజీ సంబంధించిన ఇతర టీ20 లీగ్‌లలో ఆడాలని కోరింది. అయితే ఇందుకు కమిన్స్, హెడ్ ఆస్ట్రేలియా క్రికెట్‌కు వీడ్కోలు పలకాల్సి ఉంటుంది. కానీ ఆ ఆఫర్‌ను ఆసీస్ ఆటగాళ్లు తిరస్కరించినట్టు తెలిసింది. తాము ఆస్ట్రేలియా తరపునే అంతర్జాతీయ క్రికెట్ ఆడతామని కమిన్స్, హెడ్ స్పష్టంచేశారట. ఈ మేరకు ఓ ఆస్ట్రేలియా పత్రిక సంచలన కథనంలో వెల్లడించింది. అయితే, ఆ ఫ్రాంచైజీ పేరును మాత్రం పేర్కొనలేదు. ప్రస్తుతం ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కమిన్స్, హెడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.



ఢిల్లీలో నిర్వహించిన 'ఇండియా మొబైల్ కాంగ్రెస్-2025'లో కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, తదితరులు

తెలంగాణ 'టీ -ఫైబర్' గ్రామాలు దేశానికే ఆదర్శం

- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి సింధియా
- గ్రామాలు, పట్టణాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం: మంత్రి దుద్దిళ్ల

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): టీ-ఫైబర్ గ్రామాలు దేశానికే ఆదర్శమని కేంద్ర కమ్యూనికేషన్లు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కొనియాడారు. టీ-ఫైబర్ మోడల్‌కు సంబంధించి లాస్ట్‌మైల్ బ్రాడ్‌బాండ్ కనెక్టివిటీతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. 'ఇండియా మొబైల్ కాంగ్రెస్-2025' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో సింధియా అధ్యక్షతన ఐటీ మంత్రుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కో ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణలో భారత్ నెట్‌ను మరింత వేగవంతంగా అమలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ స్థాయిలో ప్రతీ ఇంటికి ఫైబర్ నెట్ వర్కును తీసుకెళ్లడంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రజలకు ఈ గవర్నెన్స్, విద్య, వైద్యం, డిజిటల్ సేవలు మరింత అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని తగ్గించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు.

కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం..

- పత్తి కొనుగోళ్లపై చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం: తుమ్మల



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల విషయంలో రాష్ట్రం సహకరించడం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. పత్తి కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు సీసీఐ ప్రతినిధులు, జిన్నింగ్ మిల్లర్లతో చర్చలు జరిపిందని తుమ్మల గుర్తు చేశారు. దాంతోనే జిన్నింగ్ మిల్లర్లు టెండర్లలో పాల్గొనటానికి ముందుకు వచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకుంటే ఇలాంటి ప్రతిష్టంభన ఉండేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పత్తి కనీస మద్దతు ధర రైతుల సాగు వ్యయాలకు తగినట్లుగా లేదని, 2021, 2022 సంవత్సరాల్లో రైతులు ప్రైవేటుగా అమ్ముకునే ధర కంటే తక్కువ ధరే ఉందని ఆక్షేపించారు. దీనిపై గత నెలలో సీఏసీపీ ఛైర్మన్‌కు లేఖ కూడా రాసినట్లు తుమ్మల తెలిపారు. కనీస మద్దతు ధర ప్రకటించిన పంటల్లో కేంద్రం ఎన్ని రకాల పంటలు కొంటోందని.. కొన్ని పంటలపై 25శాతం సీలింగ్ ఎందుకు విధిస్తున్నారని కిషన్‌రెడ్డిని ప్రశ్నించారు.

మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల్లోకి: పొన్నం

మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల్లోకి వస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేశామన్నారు. ఇప్పటి వరకు మహిళలు 250 కోట్ల ప్రయాణాలు ఉచితంగా చేశారని తెలిపారు. అనేక సంస్కరణలు చేపట్టామని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. చలో బస్‌భవన్ అంటూ బీఆర్‌ఎస్ నేతలు హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత పదేళ్లలో బంద్‌లు, నిరసనలపై ఉక్కుపాదం మోపిన వారికి చలో బస్‌భవన్ నిర్వహించే హక్కు లేదన్నారు. ఆర్టీసీకి రాజకీయ రంగు పులుముతున్న వారిని ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

12న పల్స్ పోలియో

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 12న ఆరు జిల్లాల్లోని చిన్నారులకు ప్రత్యేకంగా పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ బుధవారం వెల్లడించింది. రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు కాగా దేశంలో 2011లో నమోదైంది. గత మూడేళ్లుగా బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయి. ఆయా దేశాల నుంచి మన దేశానికి రాకపోకలు జరుగుతున్న జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేశారు. వీటిలో తెలంగాణ నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాలున్నాయి. వీటితోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 6 జిల్లాల పరిధిలో 0-5 ఏళ్ల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా. వీరికి ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి ఐదేళ్ల వయసున్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆ రోజు పోలియో చుక్కలు వేయించనట్టయితే ఆ పిల్లలకు అక్టోబరు 13, 14 తేదీల్లో వేయనున్నారు.



కామారెడ్డిలో వరదలతో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం

- కామారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటన

కామారెడ్డి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో నెల రోజుల క్రితం భారీ వర్షాలు, వరదల వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు వేల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. నష్టాన్ని అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. కేంద్ర అధికారులు పీకే రాయ్, మహేశ్ కుమార్, శ్రీనివాసు బైరి, శశివర్ధన్‌రెడ్డి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేశారు. మొదట భిక్కనూర్ మండల కేంద్రానికి చేరుకుని అక్కడ దెబ్బతిన్న దాసమ్మకుంటను పరిశీలించి, అంతంపల్లి రోడ్డులో దెబ్బతిన్న పంచాయతీ రోడ్డు, పంట పొలాలను పరిశీలించారు. అనంతరం బీబీపేట్‌లో వరదలకు కోతలకు గురైన ఆర్‌అండ్‌బీ బ్రిడ్జి పరిశీలించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీఆర్ కాలనీ వద్ద దెబ్బతిన్న బ్రిడ్జిని, అధిక వర్షాలతో దెబ్బతిన్న కామారెడ్డి ఫిల్టర్ బెడ్ పంప్‌హౌస్ క్యాజ్‌వే రోడ్డును పరిశీలించారు. తర్వాత వరద నష్టంపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. జరిగిన నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్‌యాదవ్

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఆర్కిటెక్చర్ పట్టభద్రుడైన ఆయన.. నవ యువ నిర్మాణ్ పేరుతో స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి యువతకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2014లో ఆయన జూబ్లీహిల్స్ నుంచి ఏంఐఎం అభ్యర్థిగా పోటీ చేశారు. 2018లో ఎంఐఎం టికెట్ ఇవ్వకపోవడంతో పార్టీని వీడి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. 2023 అసెంబ్లీఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించినా అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆయన్ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. యాదవ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ ట్రైబల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తెరమీదకు వచ్చినప్పటి నుంచి అభ్యర్థిగా ఆయన పేరే ప్రముఖంగా వినిపించింది. అయితే ఈ సీటు తమకే కేటాయించాలంటూ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కంజర్ల విజయలక్ష్మి, మురళీగౌడ్ తదితరులు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జ్ మంత్రులు, పీసీసీ నాయకులు చర్చలు జరిపి నవీన్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, సీఎన్‌రెడ్డి పేర్లను ఏఐసీసీకి పంపించారు. చివరి వరకూ టికెట్ కేటాయింపుపై ఉత్కంఠ సాగినప్పటికీ అధిష్ఠానం నవీన్ యాదవ్ వైపే మొగ్గుచూపింది. నవీన్ యాదవ్‌కు పార్టీ టికెట్ కేటాయించడంతో ఆయన ఇంటి వద్ద బుధవారం రాత్రి అభిమానులు, కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ సంబురాలు చేసుకున్నారు. కాగా.. తనను అభ్యర్థిగా ప్రకటించిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డికి నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు.

బయోడేటా

పేరు: వల్లాల నవీన్ యాదవ్
తండ్రి పేరు: వి.చిన్న శ్రీశైలం యాదవ్
భార్య పేరు: వర్ష యాదవ్
పిల్లలు: కుమారుడు అన్షు యాదవ్
పుట్టిన తేదీ: 21-11-1983 (వయసు-41)
విద్యార్హత: ఆర్కిటెక్చర్ పట్టభద్రుడు

ఈవీఎంలపై కలర్ ఫొటోలు

రాష్ట్రంలో తొలిసారి జూబ్లీహిల్స్‌లో అమలు.. రాజకీయ పార్టీల ప్రతినిధులతో కర్ణన్ భేటీ

ఎన్నికల నియమావళిపై ప్రజెంటేషన్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. తెలంగాణలో ఈ విధానాన్ని తొలిసారిగా అమలు చేస్తున్నామని చెప్పారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కర్ణన్ సమావేశం నిర్వహించారు. స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కోడ్ అమలులో ఉన్నందున ఏం చేయాలి..? ఏం చేయవద్దు.. అన్న అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ప్రచారం నిర్వహించాలన్నారు. ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి రాజకీయ ప్రకటనలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ప్రైవేట్ ఆస్తులపై అనుమతి తీసుకొని ప్రకటనలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఇతర ప్రకటనలు ఏర్పాటుచేస్తే.. ఆ వ్యయాన్ని అభ్యర్థి ఖాతాలో వేస్తామని చెప్పారు.

షేక్‌పేట తహసీల్దార్ ఆఫీసులో నామినేషన్లు...

ఈ నెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఇక్కడే నామినేషన్లు దాఖలు చేయాలి. సికింద్రాబాద్ ఆర్‌డీవో సాయిరాం రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ అనుమతి ఉండదని, కేంద్రాల వద్ద మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని కర్ణన్ చెప్పారు. అభ్యర్థుల నేర చరిత్రను పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో ప్రకటనల ద్వారా వెల్లడించాలని పేర్కొన్నారు. పార్టీలు నేర చరిత ఉన్న వారిని ఎందుకు ఎంపిక చేశాయో..? స్పష్టం చేయాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వరకే ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా నియోజకవర్గం వెలుపల నగదు, మద్యం పంపిణీ, ఇతరత్రా ప్రలోభాలకు గురిచేస్తున్నట్టు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు బల్దియాలోని సీపీఆర్‌వో ఆఫీసులో మోడల్ కోడ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) కార్యాలయాన్ని కర్ణన్ ప్రారంభించారు. పత్రికలు, ప్రసార, సామాజిక మాధ్యమాల్లో ప్రకటనల జారీకి కమిటీ నుంచి పార్టీలు, అభ్యర్థులు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబర్ 1950, సీ విజిల్ మొబైల్ యాప్‌లో 24 గంటలపాటు ఫిర్యాదు చేయవచ్చని కర్ణన్ తెలిపారు.



కారులో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

శ్రీనగర్ కాలనీలో వాహనాల తనిఖీలు

4.60 లక్షల నగదు, 9 మద్యం బాటిళ్లు స్వాధీనం

పంజాగుట్ట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. పంజాగుట్ట పోలీసులు, ఎన్నికల నిఘా బృందం శ్రీనగర్ కాలనీ ప్రధాన రహదారిలో బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. శ్రీనగర్ కాలనీ నుంచి అమీర్‌పేట షాలిమార్ జంక్షన్ వైపు నిర్వహించిన తనిఖీల్లో ఓ కారులో రూ.4.60 లక్షల నగదు, మరో కా రులో 9 చివాస్ రీగల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేలకన్నా ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు తమవద్ద నగదుకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని పోలీసులు, అధికారులు సూచించారు.

ఈసీ నియంత్రణలోకి పోలీసు యంత్రాంగం

హైదరాబాద్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలోని కీలక పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ నియంత్రణలోకి వెళ్లారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వీరు డిప్యూటేషన్‌పై ఈసీ అజమాయిషీలో పనిచేయనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 13 నుంచి నవంబరు 16 వరకు ఈ నియంత్రణ కొనసాగనుంది. డీజీపీ, శాంతి భద్రతల అదనపు డీజీపీ, డీజీపీ కార్యాలయంలోని ఐజీ, డీఐజీ, నియోజకవర్గ పరిధిలోని డిప్యూటీ పోలీస్ కమిషనర్, అడిషనల్ డీసీపీ, సబ్ డివిజనల్ పోలీసు అధికారులు, సీఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లందరూ ఈసీ అజమాయిషీలోనే పనిచేయనున్నారు.

పథకాలు, అభివృద్ధి పనులే అస్త్రాలుగా..

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై అధికార కాంగ్రెస్ ఫోకస్
- రంగంలోకి ముగ్గురు మంత్రులు.. 18 మంది కార్పొరేషన్ ఛైర్మన్లు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు అధికార కాంగ్రెస్ ఇప్పటికే పలు అస్త్రాలను సిద్ధం చేసుకుంది. తాము చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడమూ పార్టీని విజయతీరాలకు చేరుస్తుందని భావిస్తోంది. మూసీనది పునరుజ్జీవం, ఫ్యూచర్‌సిటీ లాంటి భారీ ప్రాజెక్టులను జూబ్లీహిల్స్ ఓటర్ల ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్ మహానగర అభివృద్ధి కోసం గతంలో తమ ప్రభుత్వాలు వేసిన బీజాలే.. ఇవాళ అంతర్జాతీయ స్థాయి నగరంగా నిలబెట్టాయన్న అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు కసరత్తు చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మూడు నెలల ముందు నుంచే అధికార పార్టీ దృష్టిపెట్టింది. రూ.500కే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, ఇందిరా మహిళా శక్తి కింద స్వయం సహాయక సంఘాలకు రుణాల వంటి పథకాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి చేరేలా దృష్టిపెట్టింది. నియోజకవర్గంలో ఇందిరమ్మ క్యాంటీన్ పథకం ప్రారంభించడం ద్వారా రూ.5లకే బ్రేక్‌ఫాస్ట్, రూ.5లకే భోజనం అందిస్తున్నారు. అర్హులకు కుట్టు మిషన్లూ అందించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజ లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కారం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రూ.50కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గంలో దాదాపు 16వేల వరకు రేషన్ కార్డులను పేదలకు పంపిణీ చేసినట్లు సమాచారం. ఉప ఎన్నికల్లో విజయం సాధించేందుకు మైనారిటీల ఓట్లు కీలకంగా మారాయి. ఈ ఓట్లు గంపగుత్తగా తమకే పడేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఈ మేరకు మైనారిటీ నేతలను రంగంలోకి దింపడంతో పాటు మజ్లిస్ మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. జూబ్లీహిల్స్‌లో ఆరు డివిజన్లు ఉండగా.. రెండు కాంగ్రెస్‌కు, రెండు మజ్లిస్‌కు రెండు బీఆర్‌ఎస్‌కు ఉన్నాయి. ఈ ఉప ఎన్నిక లో మజ్లిస్ పోటీ చేయకపోవడంతో కాంగ్రెస్‌కు మద్దతునిచ్చే అవకాశాలున్నాయి. మరోవైపు.. బీఆర్‌ఎస్ ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఇక్కడ గెలుపొందితే రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి మళ్లీ ఊపు వస్తుందని.. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చునని భావిస్తోంది. కాగా తమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా బీఆఆర్‌ఎస్‌కు సానుభూతితో పడే ఓట్లను బాగా పరిమితం చేయాలని కాంగ్రెస్ ప్రణాళిక రచిస్తోంది. ఇందుకుగాను ఇప్పటికే ముగ్గురు మంత్రులు.. 18 మంది కార్పొరేషన్ ఛైర్మన్‌లను రంగంలోకి దించిం ది. మరికొందరు మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా భాగస్వామ్యం చేసే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

హైదరాబాద్-విజయవాడ

హైవే విస్తరణకు రూ.10వేల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆలయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ పట్టణంలో ఉన్న కనకదుర్గమ్మ గుడి వరకు 231.32కి.మీ మేర 6 వరుసలుగా విస్తరించనున్నారు. హైవే వెంట కొన్ని కొత్త రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, వెహికల్ అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఈ రోడ్డు విస్తరణ కోసం రూ.10,391.53 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా. ఇందులో నిర్మాణ వ్యయం రూ.6,775.47 కోట్లు కాగా, మరో రూ.3,616.06 కోట్లు వివిధ అవసరాలకు కావాల్సి ఉందని తేల్చారు. దీని ప్రకారం రోడ్డు విస్తరణకు ఒక్కో కిలోమీటర్‌కు రూ.44.92 కోట్ల చొప్పున నిధులను వెచ్చించనున్నారు. ఇక రహదారి విస్తరణ కోసం ఏపీ పరిధిలో సుమారు 162 హెక్టార్ల భూమిని కొత్తగా సేకరించాలని, ఇందు కోసం రూ.1,414 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుందని తేల్చారు. కాగా, హైవేపై 33చోట్ల మేజర్ జంక్షన్లు, 105చోట్ల మైనర్ జంక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక చోట మేజర్ బ్రిడ్జి, 22చోట్ల మైనర్ బ్రిడ్జిలు, 4 కొత్త ఫ్లై ఓవర్లు, వెహికల్ అండర్‌పాస్/వెహికల్ ఓవర్ పాస్‌లు కలిపి 17, చిన్న చిన్న వాహనాలు వెళ్లడానికి, జంతువుల కోసం కూడా కొన్ని చోట్ల అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. 94చోట్ల ప్రయాణికుల విశ్రాంతి ప్రాంతాలు, 16 చోట్ల బస్ షెల్టర్లను ఏర్పాటుచేయనున్నారు. ఏపీ పరిధిలో రెండు చోట్ల కొత్త బైపాస్‌లను నిర్మించనున్నారు. కాగా రహదారి విస్తరణలో 22.5 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ విధానంలో అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు హైవే విస్తరణకు సంబంధించిన ప్రాథమికడీపీఆర్ వివరాలు ఆంధ్రజ్యోతికి లభించాయి.

హైవే మంజూరు సమయంలోనే భూసేకరణ

మంగళవారం రోడ్లు-భవనాల శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ కీలక ఉన్నతాధికారులు పలు ప్రభుత్వశాఖలతో సమావేశం నిర్వహించారు. రహదారి విస్తరణ కోసం మార్గమధ్యలో ఎన్ని విద్యుత్ లైన్లు, స్తంభాలు, చెట్లు, మొక్కలను తొలగించాల్సి వస్తోంది, రైల్వే క్రాసింగ్‌లు, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన పలు సౌకర్యాల వివరాలన్నింటినీ అక్టోబరు చివరి వారంలోగా ఇవ్వాలని పలు శాఖలకు ఆదేశాలు వెళ్లాయి. రహదారి వెంట ఇతర మౌలిక సదుపాయాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్నదానిపైన కూడా వివరాలను సమగ్రంగా ఇవ్వాలని ఆయా ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. అక్టోబరు చివరి వారంలోగా ఈ వివరాలన్నీ అందగానే డీపీఆర్ పూర్తవనుంది. అనంతరం ఆ డీపీఆర్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనున్నారు. హైదరాబాద్-విజయవాడ హైవేను 6 లేన్లుగా విస్తరించేందుకు అవసరమైన డీపీఆర్ రూపకల్పన బాధ్యతను భోపాల్‌కు చెందిన కంపెనీ దక్కించుకుంది. హైవేను మంజూరు చేసిన సమయంలోనే 6 వరుసల విస్తరణకు అవసరమయ్యే భూమిని సేకరించారు. అయితే కొత్తగా ఏర్పాటు చేయాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాలకు కొన్ని చోట్ల భూసేకరణ అవసరమవుతున్నట్టు తెలిసింది. ఏపీ- తెలంగాణ సరిహద్దు అయిన కోదాడ నియోజకవర్గంలోని రామాపురం క్రాస్‌రోడ్డు దగ్గర ఒక వెహికల్ అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు.

భారత్ దాల్.. అంతా గోల్‌మాల్!

(మొదటిపేజీ తరువాయి)

విక్రయించి ప్రభుత్వానికి మస్కా కొట్టారు. నోడల్ ఏజెన్సీగా వ్యవహరించిన 'హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘం' (హాకా) చేపట్టిన రూ.300 కోట్ల విలువైన ఈ శనగల విక్రయాలపై అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. 50 వేల మెట్రిక్ టన్నుల శనగల్ని రాష్ట్రానికి పంపించిన కేంద్రం.. అప్పట్లో మార్కెట్ రేటు కిలోకు రూ.90కి పైగా ఉండగా.. సబ్సిడీపై కిలోకు రూ.60 చొప్పున ధర నిర్ణయించింది. సాధారణ వినియోగదారుల కోసం కిలో ప్యాకెట్లు, సంస్థలకు విక్రయించటానికి 30 కిలోల బస్తాలు తయారు చేయాలని పేర్కొంది. 30 కిలోల బస్తా తీసుకునేవారికి కిలోకు మరో రూ.5 తగ్గించి రూ.55 చొప్పున ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ ప్రక్రియ రాష్ట్రంలో జరగలేదు.

కేంద్రం వివరణ కోరినా..

శనగలను నేరుగా ప్రైవేటు ట్రేడర్లకు విక్రయించినట్లు అప్పట్లో ఫిర్యాదులు రావడంతో కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ గతేడాది ఫిబ్రవరిలో హాకాకు లేఖ రాసి వివరణ కోరారు. అయితే పథకం దుర్వినియోగం కాలేదని అధికారులు వివరణ పంపించారు. అయితే.. ఆ తర్వాత కూడా ఫిర్యాదులు వచ్చాయి. శనగలను ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి విక్రయించే క్రమంలో.. 'ట్యాక్స్ ఇన్వాయిస్'ను జనరేట్ చేయాల్సి ఉంటుంది. కానీ, ఏకంగా ముడి శనగల ట్రేడింగ్ జరిగింది. దీంతో ప్రభుత్వానికి పన్ను ద్వారా వచ్చే ఆదాయం కూడా రాకుండా పోయింది. ఈ అంశంపై ప్రస్తుతం వాణిజ్య పన్నులశాఖ అధికారులు దృష్టి సారించడంతో ట్రేడింగ్ చేసిన వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి కేంద్రంగా నడుస్తున్న వీకేర్ సీడ్ కంపెనీలో ఐటీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. శనగల ట్రేడింగ్‌లో ఈ కంపెనీ పన్ను ఎగవేసినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. తాజాగా మార్క్‌ఫెడ్ విక్రయించిన జొన్నల టెండర్లను కూడా వీకేర్ సంస్థ దక్కించుకుంది.

గుంటూరు, వైజాగ్, కర్నూలు, వినుకొండలో ఐటీ తనిఖీలు..


గుంటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కందిపప్పు కమీషన్ ఏజెంట్ వెంకటేశ్వరరావు నివాసంలో ఆదాయ పన్ను శాఖ అధికారుల తనిఖీలు రెండో రోజూ కొనసాగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో కందిపప్పు సరఫరా కాంట్రాక్టు పొందిన వెంకటేశ్వరరావు సక్రమంగా పన్నులు చెల్లించడం లేదు. అంతేకాకుండా 30 ఏళ్లుగా కమీషన్ వ్యాపారంతోపాటు రియల్ ఎస్టేట్, గోల్డ్ వ్యాపారాలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ దుకాణంలో ఐటీ తనిఖీలు నిర్వహించగా, గుంటూరు, వైజాగ్‌లోని కమీషన్ ఏజెంట్లకు పెద్దమొత్తంలో బంగారు బిస్కెట్లు విక్రయించినట్టు తెలిసింది. దీంతో అధికారులు విజయవాడలోని ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో 30 బృందాలుగా ఏర్పడి గుంటూరు, విజయవాడ, కర్నూలు, వైజాగ్, వినుకొండ, ప్రాంతాల్లో కందిపప్పు మిల్లులు, వ్యాపారుల నివాసాలు, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. వెంకటేశ్వరరావు ప్లాట్‌లలో కీలక సమాచారం లభ్యమైంది. కందిపప్పు, పచ్చిపప్పు వ్యాపారంతోపాటు రూ.కోటి, రూ.2 కోట్ల విలువైన చిట్టీలు నిర్వహిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఇంత పెద్దమొత్తంలో చిట్టీలు వేసే వారి సమాచారాన్ని కూడా సేకరిస్తున్నారు. వెంకటేశ్వరరావు నుంచి సరుకులు కొనుగోలు చేసే ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో మిల్లర్ల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అలాగే వైజాగ్‌లోని కమీషన్ ఏజెంట్ నివాసంలో తనిఖీలు చేపట్టారు. కమీషన్ ఏజెంట్లు బ్యాంకుల్లో జరిపిన వ్యాపార లావాదేవీల వివరాలు, లాకర్లలలో భద్రపరిచిన బంగారం, వెండి ఇతర ఆస్తుల వివరాలు సేకరించారు. వీరికి బినామీలుగా ఉన్నవారి వివరాలను సైతం రాబడుతున్నారు.

భూముల విలువల మదింపు పూర్తి

ప్రస్తుత విలువపై 2.5 రెట్ల మేర పెంచాలని అధికారుల ప్రతిపాదన.. మార్కెట్ విలువలో 60% దాటకుండా పెంపు

- స్థానిక ఎన్నికల అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ విలువలను తొలుత కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో (ఓఆర్ఆర్ లోపల) పెంచాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. ఇదే ప్రాతిపదికన మార్కెట్ విలువల సవరణ చేపట్టారు. తరువాత రాష్ట్రమంతా ఒకేసారి మార్కెట్ విలువల సవరణ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆ మేరకు ఇటీవల తుది ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలు ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు చేరాయి. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు స్వల్ప మార్పులతో వాటికి ఆమోదం లభించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక.. 2014 నుంచి 2021 వరకూ భూముల విలువలు పెంచలేదు. 2021లో నాటి ప్రభుత్వం తొలిసారి అప్పటి విలువలను 20% పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2022లో మరోసారి 33% పెంచింది. నాలుగేళ్ల తరువాత మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువల సవరణకు ప్రభుత్వం సన్నద్ధమైంది.



ఇవీ ప్రతిపాదనలు..

భూముల విలువలకు సంబంధించి ఇప్పటికే పలు రకాల నివేదికలతో మార్కెట్ విలువల్లో హెచ్చుతగ్గులపై కసరత్తు చేసిన అధికారులు.. అసమతుల్యంగా ఉన్న విలువలను హేతుబద్ధీకరించడంతోపాటు, కొన్నిచోట్ల ఇప్పుడున్న విలువను 2.5 రెట్ల మేర పెంచేందుకు వీలుగా ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. బహిరంగ మార్కెట్లో ఎకరా ధర రూ. 5 కోట్లు ఉంటే.. అలాంటి చోట్ల కనీసం రూ.3 కోట్ల వరకు పెంచాలని రిజిస్ట్రేషన్ శాఖ ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. ఇక అత్యధికంగా ఆదాయాన్ని తీసుకొచ్చే కోర్ అర్బన్ పరిధిలో ఇప్పుడున్న మార్కెట్ విలువలను పెంచనున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో గచ్చిబౌలిలో అపార్ట్‌మెంట్లకు సంబంధించి చదరపు అడుగు ధర ప్రస్తుతం రూ.3000 ఉంది. దీన్ని కనీసం 60 శాతం వరకు (రూ.1800 దాకా) పెంచాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ లెక్కన చదరపు అడుగు రూ.4800 వరకు అవుతుంది. 2022లలో గచ్చిబౌలిలో ప్రధాన రహదారి మీద ఉండే వాణిజ్య భవనాల్లో చదరపు అడుగుకు గ్రౌండ్ ఫ్లోర్‌లో రూ.7300, మొదటి అంతస్తు అయితే రూ.6600, ఇతర అంతస్తులకు రూ.6600 చొప్పున నిర్ణయించారు. ప్రస్తుతం ఈ ధరలను 25 నుంచి 30 శాతం వరకు పెంచాలని ప్రతిపాదించారు. హఫీజ్ పేటలో ప్రస్తుతం ఖాళీ స్థలం (ఇంటి స్థలం) గజం రూ.26,700గా ఉంది. కానీ, బహిరంగ మార్కెట్లో ఈ ధర ఆరు రెట్లుకుపైగా ఉంది. ఇలాంటి చోట్ల కనీసం రెండున్నర రెట్లు పెంచాలని ప్రతిపాదించారు. ఇదే ప్రాంతంలో వాణిజ్య స్థలం అయితే గజం రూ.44,900 ఉంది. కొండాపూర్‌లోనూ నివాస, వాణిజ్య స్థలాల మార్కెట్ విలువలు ఇదే విధంగా ఉన్నాయి. వాణిజ్య స్థలాల విలువలను ఇప్పుడున్న విలువపై 25 శాతం దాకా పెంచాలని నిర్ణయించారు. నార్సింగ్‌లో గజం రూ.23,800, మణికొండలో రూ.23,900, రాయదుర్గంలో రూ.44,900, బుద్వేల్‌లో నివాసస్థలం గజం రూ.10,200, వాణిజ్య స్థలం రూ.26,700 ఉంది. ఇటీవల ఈ ప్రాంతంలో ఎకరా రూ.20 కోట్లు పలికింది. మహేశ్వరంలో పుస్తక విలువలు గజం రూ.2100, వాణిజ్య స్థలం రూ.10,200 చొప్పున ఉన్నాయి. అయితే మహేశ్వరం లాంటి చోట్ల రూ.2100 ఉన్న విలువను కనీసం రూ.3800 నుంచి రూ.4500 వరకు పెంచాలని ప్రతిపాదించినట్లు తెలిసింది.

చీఫ్ జస్టిస్‌పై దాడికి..
పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి: సీపీఎం

» లోతైన దర్యాప్తు జరిపించాలి: మందకృష్ణ



హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతీ ఒక్కరు ఈ దాడిని ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. చీఫ్ జస్టిస్‌పై సుప్రీంకోర్టులోనే జరిగిన అమానుష దాడికి నిరసనగా బుధవారం మల్కాజిగిరి చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేయడం అంటే దేశ ప్రజాస్వామ్య హృదయాన్ని గాయపర్చడమేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుంటి లక్ష్మణ్, కృపాసాగర్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మంగ, సూర్యకుమార్, ప్రదీప్‌దాస్ గుప్తా, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని సత్వరమే ఖండించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామని, అయితే.. ఈ దాడిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఈ నెల 9వ తేదీ నుంచి పది రోజుల పాటు ఉద్యమం నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. సికిందాబాద్‌లోని గాయత్రి గార్డెన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ దాడిని పోలీసు యంత్రాంగం, న్యాయవ్యవస్థ సుమోటోగా తీసుకోవాలని, సమగ్ర దర్యాప్తు జరిపించాలని అభిప్రాయపడ్డారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని తెలంగాణ సచివాలయ ఉద్యోగులు ఖండించారు. సచివాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి బాహుబలి గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ అధికారుల సంఘం అధ్యక్షుడు జి. సురేష్ కుమార్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, సచివాలయ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రేమ్ తదితరులు మాట్లాడారు. ఇది ప్రజాస్వామ్యంపైన, లౌకికవాదులపైన జరిగిన దాడిగా అభివర్ణించారు.

బాధితులను ఆదుకోవడంలో ఎన్డీఎంఏ ముందంజ

» ఎన్డీఆర్ఎఫ్ సేవలపై అవగాహన కల్పించాలి: బండి సంజయ్

న్యూఢిల్లీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడంలో జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్డీఎంఏ) అగ్రస్థానంలో ఉందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. జాతీయ విపత్తుల సమయంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలతోపాటు జాతీయ విపత్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేందుకు విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'సచేత్' యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునేలా చైతన్యం కలిగించాలన్నారు. బుధవారం ఎన్డీఎంఏ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్డీఎంఏ ఉన్నతాధికారులతో సమావేశమై సంస్థ అందిస్తున్న సేవలను, చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్డీఎంఏ సేవలకు సంబంధించి కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు.

మైనార్టీల ఓట్ల కోసం
రక్షణ శాఖ భూముల ఆక్రమణ: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో మైనార్టీల ఓట్ల కోసం.. రక్షణ శాఖకు చెందిన భూముల్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అప్పగించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ షేక్‌పేట్‌లోని 2,500 గజాల భూమిని ముస్లిం శ్మశాన వాటిక కోసం కేటాయించిందని, ఈ తతంగాన్ని రాష్ట్ర ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు దగ్గరుండి నడిపించారని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన తెలిపారు. మైనార్టీలను బుజ్జగించడం, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలో అంతర్భాగమని ఎద్దేవా చేశారు. సాయుధ దళాల పట్ల ప్రభుత్వానికి ఉన్న అగౌరవం ఈ ఘటనతో మరింతగా అర్థమవుతోందని కిషన్‌రెడ్డి అన్నారు.

ఆర్టీసీలోని 17 వేల ఖాళీలను భర్తీ చేయండి

నూతన ఎండీ నాగిరెడ్డికి ఉద్యోగ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీలో 17 వేల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని సంస్థ ఎండీ నాగిరెడ్డికి ఆర్టీసీ ఉద్యోగ సంఘం విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డిని సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు బస్ భవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థలోని పరిస్థితులు, సమస్యలపై ఆయనకు వివరించారు. ఆర్టీసీలో సిబ్బంది కొరత సమస్య పరిష్కారానికి 1,753 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి నియామక ప్రక్రియ చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వివిధ కేటగిరీల్లో ఇప్పటికి సుమారు 17 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను అనుమతించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

మొక్కజొన్న రైతులపట్ల నిర్లక్ష్యం వీడండి

» సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న రైతులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి.. తక్షణం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొక్కజొన్నకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400తోపాటు రూ.330 బోనస్ ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ఢిల్లీ టూర్లు, కమిషన్లు, సెటిల్మెంట్లు పక్కనబెట్టి రైతుల బాధలపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ రైతులు పడుతున్న ఇబ్బందులను పదేపదే గుర్తు చేయాల్సిరావడం బాధాకరమని, పంటల దిగుబడి సమయంలో అప్రమత్తంగా ఉండాల్సిన ముఖ్యమంత్రి పూర్తి అలసత్వం వహించడం ఈ రైతుల దురదృష్టమని పేర్కొన్నారు. మరోవైపు.. బడికి వెళ్తున్న పిల్లలు విగత జీవులుగా మారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడదా? గురుకులాల్లో మరణ మృదంగం ఆపలేరా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గురుకులాల నిర్వహణ గాలికొదిలేసి, మొత్తం వ్యవస్థనే కుప్పకూల్చేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుండటం దుర్మార్గమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్యలకు రేవంత్‌దే బాధ్యత: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఈ బలవన్మరణాలకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ సర్కార్ తెచ్చిన వ్యవసాయ సంక్షోభం, హామీల వైఫల్యం కారణంగానే అన్నదాతలు తమ నిండుప్రాణాలను బలి తీసుకుంటున్నారని బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఒకేరోజు రాజన్నసిరిసిల్ల జిల్లా అచ్చన్నపేట రైతు మొగిలి లక్ష్మణ్, మహబూబాబాద్ జిల్లా నారాయణపురం పీక్లాతండాకు చెందిన గుగులోత్ భాస్కర్, హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రానికి చెందిన అనిల్ అనే రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రైతులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను వేదనకు గురిచేయొద్దని సూచించారు. రైతువ్యతిరేక రేవంత్ సర్కార్‌పై సంఘటితంగా పోరాడదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. అలాగే గురుకులాలకు అద్దెబకాయిలు పేరుకుపోయి, చివరికి భవనాలకు తాళాలు వేసే దుస్థితి రావడం అత్యంత దుర్మార్గమని, విద్యాశాఖను తనవద్దే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డివల్లే ఈ పరిస్థితి నెలకొందని కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. అద్దెబకాయిలను విడుదలచేసి, విద్యార్థులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

అడ్లూరికి పొన్నం క్షమాపణలు



టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో భేటీ అయిన మంత్రులు పొన్నం, అడ్లూరి

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నానన్నారు. సామాజిక న్యాయానికి చాంపియన్ కాంగ్రెస్ పార్టీ అని, అలాంటి పార్టీలో పుట్టి పెరిగిన తనకు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లకు పార్టీ సంక్షేమం తప్ప ఎలాంటి దురుద్దేశాలూ లేవని చెప్పారు. తామంతా ఐక్యంగా సామాజిక న్యాయ సాధన లక్ష్యం కోసం పని చేస్తామన్నారు. తాను కరీంనగర్‌లో మాదిగ సామాజిక వర్గం వారితో కలిసి పెరిగిన వాడినని తెలిపారు. ఇకపై ఎలాంటి అపోహలకు తావుండొద్దని విజ్ఞప్తి చేశారు. కాగా, టీపీసీసీ చీఫ్ సమక్షంలో భేటీకి ముందే జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు.

సమస్య ఇంతటితో ముగిసింది: అడ్లూరి

పొన్నం ప్రభాకర్ క్షమాపణలు కోరడంతో సమస్య ముగిసిపోయిందని అడ్లూరి లక్ష్మణ్ ప్రకటించారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశమూ ఇచ్చిందని అన్నారు. తాను పార్టీ గీత దాటే వ్యక్తిని కాదని చెప్పారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తానని, కానీ ఆయన వ్యాఖ్యల పట్ల తన మాదిగ జాతి బాధపడిందని తెలిపారు. ఆయన క్షమాపణలు చెప్పడంతో సమస్య సమసిపోయిందన్నారు.

మంత్రులు బాధ్యతగా మాట్లాడాలి: మహేశ్‌గౌడ్

మంత్రులు మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌ల మధ్య జరిగిన సంఘటన.. తమ కుటుంబ సమస్య అని చెప్పారు. ఈ ఘటన పట్ల చింతిస్తూ అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారన్నారు. ఈ సమస్యను ఇంతటితో ముగించాలని మాదిగ సామాజిక వర్గ నేతలకు విజ్ఞప్తి చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌లు కష్టపడి పైకి వచ్చిన నేతలని గుర్తుచేశారు. కాగా, 24 గంటల్లో పొన్నం క్షమాపణలు చెప్పాలంటూ లక్ష్మణ్ సామాజికవర్గం వారు డిమాండ్ చేయడమేగాక ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించడంతో బుధవారం కరీంనగర్‌లో ఉద్రిక్తత కొనసాగింది. కరీంనగర్‌లోని మంత్రి పొన్నం ఇంటి వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు జీవో ఎలా ఇచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)



ఎట్టిపరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్న సుప్రీంకోర్టు సూత్రాన్ని ఎలా అధిగమిస్తారు? ఎంపరికల్ డేటా తీశామంటున్నారు. సదరు డేటా అందుబాటులో ఉన్నప్పుడు స్థానిక సంస్థలు యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు ప్రకటించాల్సి ఉండగా.. రాష్ట్రం యూనిట్‌గా 42శాతం రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారు? ట్రిపుల్ టెస్ట్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది అంటున్నారు.. మరి సదరు కమిషన్ నివేదిక ఇచ్చే ముందు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిందా? ఆ నివేదికను పబ్లిష్ చేశారా? పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచారా?" అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే గవర్నర్ బిల్లులను ఆమోదించకపోయినా, ఆమోదించినట్లు భావించి సవరణ చట్టాలను నోటిఫై చేశారా? ఆర్డినెన్స్‌ను గెజిట్ చేశారా? అన్న ప్రశ్నలకు తమ వద్ద సమాచారం లేదని.. ప్రభుత్వం నుంచి సూచనలు తీసుకుని చెబుతామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టుకు చెప్పారు.

ఆ జీవో చెల్లదు: పిటిషనర్లు

తొలుత బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేసిన మాధవరెడ్డి తదితర తరఫున సీనియర్ న్యాయవాదులు వివేక్ రెడ్డి, మయూర్‌రెడ్డి, జే.ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం జారీచేసిన జీవో 9 ఏ కోణంలో చూసినా నిలబడే పరిస్థితి లేదని కోర్టుకు వివరించారు. సొంత చట్టాలను ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేయడం చెల్లదని స్పష్టం చేశారు. అంతేగాకుండా సవరణ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండగానే జీవో ఇచ్చారని కోర్టుకు విన్నవించారు. "మహారాష్ట్రలో రిజర్వేషన్ బిల్లులు చట్టాలుగా మారి ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా సుప్రీంకోర్టు రిజర్వేషన్లను కొట్టేసింది. తెలంగాణలో సవరణ బిల్లు ఇంకా చట్టంగా మారలేదు. ఒకవేళ చట్టంగా మారినా రిజర్వేషన్లు 50శాతం మించితే వాటిని కొట్టేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పైగా బీసీల విషయంలో 2024 కుల సర్వే, ఎస్సీ, ఎస్టీల విషయంలో 2011 నాటి జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తామంటే కుదరదు" అని వివరించారు. ఇక ఎంబీసీ వర్గాల పిటిషనర్ల తరఫున న్యాయవాది మలుగారి సుదర్శన్ వాదిస్తూ.. మొత్తం బీసీలకు కలిపి 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తే, బీసీల్లో అభివృద్ధి చెందిన కులాలే బాగుపడతాయని.. అత్యంత వెనుకబడిన కులాలకు న్యాయం జరగాలంటే ఏ, బీ, సీ, డీ కేటగిరీల వారీగా రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

తగిన డేటా తీశాకే జీవో ఇచ్చాం: రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిర్దేశించిన అన్ని సూత్రాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించిందని వివరించారు. సాంకేతిక, విశ్లేషణాత్మక, గణాంకాల డేటా తీశాకే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం తన విధాన నిర్ణయాల్లో భాగంగా డెడికేటెడ్ కమిషన్‌ను నియమించిందని, ఆ కమిషన్ నివేదికను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకుంటుందే తప్ప బయటపెట్టాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శాస్త్రీయమైన డేటా ఉన్న తర్వాత 50శాతం గరిష్ఠ పరిమితి ఎలా వర్తిస్తుందని.. సుప్రీం ధర్మాసనం ఇచ్చిన 'వికాస్ కిషన్ రావు గవాలీ' తీర్పులో లోపం ఉందని వ్యాఖ్యానించారు. అయితే సుప్రీం తీర్పును విశ్లేషించే అధికార పరిధి తమకు లేదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఇక ఎన్నికల షెడ్యూల్ కూడా విడుదలైన దశలో కోర్టులు జోక్యం చేసుకోవడానికి, మధ్యంతర స్టే ఇవ్వడానికి ఆస్కారం లేదని అభిషేక్ మనుసింఘ్వి పేర్కొన్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లను సమర్థిస్తూ ఇంప్లీడ్ పిటిషన్లు వేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్, వీహెచ్, ఇందిరా శోభన్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఇతర బీసీ సంఘాలు, కులసంఘాల వాదనలు కూడా వినాలని వారి తరఫు సీనియర్ న్యాయవాదులు బీఎస్ ప్రసాద్, చిక్కుడు ప్రభాకర్, వి. రఘునాథ్ తదితరులు ధర్మాసనాన్ని కోరారు. ప్రభుత్వం తరఫున వాదనలు ఇంకా ఉన్నాయని ఏజీ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. అయితే అప్పటికే కోర్టు సమయం ముగియడంతో ధర్మాసనం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండానే విచారణను గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేసింది. మధ్యంతర ఉత్తర్వుల దశలో ఇంప్లీడ్ పిటిషనర్ల వాదనలు వినబోమని, తుది విచారణ సందర్భంగా వింటామని పేర్కొంది. మొత్తంగా బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.40 గంటల వరకు కొనసాగింది. కాగా, బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బుధవారం హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లతో వారికి ఆర్థికంగా, రాజకీయంగా సముచిత స్థానం దక్కుతుందన్నారు. కాగా, హైకోర్టులో బుధవారం జరిగిన విచారణ తీరును బట్టి బీసీలకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా 60 బీసీ సంఘాల నేతలు ఇంప్లీడ్ అయినట్టు తెలిపారు. రాజకీయ అవసరాల కోసం కాకుండా బీసీల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉన్న వారంతా రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

'స్థానిక' ఎన్నికల తొలివిడతకు
నేడే నోటిఫికేషన్!

» 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నిక
» నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ
» పార్టీల గుర్తులతో ఎన్నికలు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నిక ప్రక్రియ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) గత నెల 29న విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ తొలి విడత ఎన్నికలకు గురువారం ఉదయం 10.30 గంటలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. దీనితోపాటే తొలివిడతలో ఎన్నికలు జరిగే స్థానాలకు నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. పార్టీల గుర్తులతో జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తి చేశాయి. వారంతా నామినేషన్ల కోసం ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

రెండు విడతల్లో చేపట్టే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు.. మూడు విడతల్లో చేపట్టే సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తి చేసింది. మొత్తం 5,749 ఎంపీటీసీ. 565 జెడ్పీటీసీ స్థానాలకు, 12,733 సర్పంచు, 1,12,288 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. తొలి విడతలో 292 జెడ్పీటీసీ, 2,963 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసిన ఓటరు జాబితా ప్రకారం.. మొత్తం ఓటర్ల సంఖ్య 1,67,03,168 ఉండగా.. అందులో పురుషులు 81,65,894.. మహిళలు 85,36,770.. ఇతరులు 504మంది ఉన్నారు.

నామినేషన్లపై నేడు పీసీసీ చీఫ్ ఆడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం ఉదయం పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ జూమ్ ద్వారా డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. జెడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయాలను సేకరించనున్నట్లు సమాచారం.

మాదిగలకు 18% రిజర్వేషన్ కల్పించండి: సంపత్‌కుమార్

స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిగలకు 18 శాతం రిజర్వేషన్ కల్పించాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ కోరారు. మహేశ్‌గౌడ్ నివాసంలో వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు.

ఖర్గేకు హర్కార, వీహెచ్, పరిగి పరామర్శ

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించారు. ఎమ్మెల్యే పరిగి రామ్మోహన్‌రెడ్డి, వీహెచ్‌తో కలిసి బుధవారం బెంగళూరులో ఖర్గేను పరామర్శించి వచ్చారు.

'ఓట్ చోర్.. గద్దె చోడ్' సంతకాల సేకరణ

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ భవన్‌లో 'ఓట్ చోర్.. గద్దె చోడ్' కార్యక్రమానికి మద్దతుగా సంతకాల సేకరణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ చేపట్టిన న్యాయపోరాటానికి మద్దతుగా ఈ సంతకాల సేకరణ జరుగుతోందని సునీతా రావు చెప్పారు.

హైకోర్టులోనే బీసీ మంత్రులు

ప్రజాప్రతినిధులు కూడా వారితోనే.. కేసు వాయిదా అనంతరం ఏజీతో చర్చలు

» గాంధీభవన్‌లో మహేశ్‌గౌడ్‌తో భేటీ
» కేసు కచ్చితంగా గెలుస్తాం: పీసీసీ చీఫ్
» బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా కేసులో ఇంప్లీడ్ అవ్వండి
» బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్‌లకు మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి
» నేడూ హైకోర్టుకు బీసీ మంత్రులు
» తీర్పు రాగానే మంత్రులతో భేటీ కానున్న సీఎం రేవంత్!



అడ్వొకేట్ జనరల్‌తో భేటీ అయిన మంత్రులు పొన్నం, వాకిటి, కొండా సురేఖ

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో వాదనలు కొనసాగినంత సేపూ బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖలు కోర్టు హాల్లోనే ఉన్నారు. వారితో పాటుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీసీ వర్గానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కూడా న్యాయస్థానంలోనే ఉండిపోయారు. విచారణను గురువారానికి వాయిదా వేసిన అనంతరం మంత్రులు అడ్వొకేట్ జనరల్‌తో భేటీ అయ్యారు. కేసు విచారణ జరిగిన తీరు కచ్చితంగా ప్రభుత్వానికి ఊరటేనని ఏజీ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికలపై కోర్టు స్టే ఇవ్వనందున షెడ్యూల్ ప్రకారం ఎన్నికలకు వెళ్లవచ్చన్నారు. ఏజీతో సమావేశం అనంతరం మంత్రులు పొన్నం, వాకిటి, విప్ ఆది శ్రీనివాస్ తదితరులు నేరుగా గాంధీభవన్‌కు చేరుకుని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించిందని, కోర్టులో కేసు కచ్చితంగా గెలుస్తామని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం గురువారం నుంచే ప్రారంభం అవుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతం సీట్లను గెలుచుకోనుందని చెప్పారు. బీసీల నోటికాడ ముద్దను లాగే ప్రయత్నం బీజేపీ చేస్తోందన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్‌లు ఇంప్లీడ్ కావాలి

బీసీ రిజర్వేషన్లకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా మద్దతు తెలిపినట్లుగానే హైకోర్టులోనూ బీసీలకు మద్దతుగా కేసులో ఇంప్లీడ్ కావాలంటూ బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. దేశంలోనే తొలి సారిగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇచ్చి ముందుకు వెళుతున్న ప్రభుత్వం తమదేనన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుపై ప్రభుత్వం తరఫున బలంగా వాదనలు వినిపించామన్నారు. రిజర్వేషన్ల విషయంలో బలహీన వర్గాలు రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండాలని కోరారు. వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇచ్చిన హామీ అమలులో కాంగ్రెస్ పార్టీ వెనక్కు తగ్గదన్నారు. తాము ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, బీసీలకు రావాల్సిన వాటా గురించే కొట్లాడుతున్నామని చెప్పారు. కాగా, తెలంగాణలో బీసీల కలలు నెరవేరే విధంగా 42% రిజర్వేషన్లతో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు గురువారం నుంచి నామినేషన్లు ప్రారంభమయ్యేలా సానుకూల వాతావరణం ఏర్పడిందని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు.

నేడు కోర్టు ఏం చెబుతుందో?

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో గురువారం జరగనున్న విచారణపైనే అందరూ దృష్టి సారించారు. పరిషత్, పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభం కానుండడంతో కోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్లపై కోర్టు స్పష్టత ఇస్తుందా? లేదా? అని ఎదురుచూస్తున్నారు. బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, ఇతర నాయకులు గురువారం కూడా కోర్టుకు వెళ్లనున్నారు. హైకోర్టు ఈ కేసును తేల్చేస్తే భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు మంత్రులతో సీఎం రేవంత్ సమావేశం కానున్నట్లు తెలిసింది.

కొత్త మున్సిపాలిటీలకు 'ప్రణాళిక' ఎట్లా?

55 పురపాలికల్లో ఇంజనీర్లు, పట్టణ ప్రణాళిక అధికారులు లేరు

» ఇతర పట్టణాల అధికారులకు బాధ్యతలు
» పని ఒత్తిడితో తూతూమంత్రంగా విధులు
» నిర్మాణ అనుమతుల జారీలో తీవ్ర జాప్యం
» ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీలు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన 55 మున్సిపాలిటీల్లో పట్టణ ప్రణాళిక అస్తవ్యస్తంగా మారుతోంది. పట్టణ ప్రణాళిక అధికారులు, ఇంజనీర్లు లేక.. అభివృద్ధి, భవన అనుమతులు, లేఅవుట్ ఆమోదం వంటివి సమస్యగా మారాయి. పట్టణ ప్రణాళికకు సంబంధించి 390 పోస్టులు, ఇంజనీరింగ్ విభాగంలో 400 పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టినా.. ఇంతవరకు ఆమోదం రాలేదని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. కొత్త మున్సిపాలిటీలలో వారంలో మూడు రోజులు పనిచేసేలా ఓడీ పేరుతో సిబ్బందిని కేటాయిస్తున్నారని.. ఒక్కో పట్టణ ప్రణాళిక అధికారికి రెండు, మూడు మున్సిపాలిటీలు అప్పగించారని అంటున్నాయి. కానీ తీవ్ర పని ఒత్తిడితో జాప్యం జరుగుతోందని పేర్కొంటున్నాయి.

కోర్ అర్బన్ పరిధిలోనూ సమస్య..

హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉన్న పలు మున్సిపాలిటీలు సహా రాష్ట్రంలో 55 మున్సిపాలిటీలలో ఈ సమస్య నెలకొంది. కోర్ అర్బన్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలకు పట్టణ ప్రణాళిక అధికారులు లేక.. అనధికారిక నిర్మాణాలు, భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో తీవ్ర జాప్యం, మున్సిపల్ ఆదాయం తగ్గిపోవడం, అనుమతుల కోసం ప్రజలు రాష్ట్రస్థాయి అధికారులను సంప్రదించడం వంటివి జరుగుతున్నాయని పురపాలక శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో ఆదిభట్ల, ఆమన్‌గల్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీరు (మున్సిపల్ కార్పొరేషన్), ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, మణికొండ, మీర్‌పేట్, నార్సింగి, పెద్దఅంబర్‌పేట, శంషాబాద్, శంకరపల్లి, తుక్కుగూడ, తుర్కయాంజల్, కొత్తూరు, చేవెళ్ల, మొయినాబాద్ లాంటి కీలక మున్సిపాలిటీల్లోనూ రెగ్యులర్ పోస్టులు లేక ఓడీ ప్రాతిపదికన సిబ్బందిని కేటాయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోని ప్రధాన పట్టణాలకు సమీపంలోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది.

త్రిసభ్య కమిటీ దృష్టికి సమస్య..

కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు పట్టణ ప్రణాళిక అధికారులు, ఇంజనీర్ల పోస్టులను మంజూరు చేయాలని పురపాలక శాఖ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అంశంపై మాజీ సీఎస్ శాంతి కుమారి చైర్‌పర్సన్‌గా శివశంకరన్, సందీప్‌కుమార్ సుల్తానియా సభ్యులుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లారు. కోర్ అర్బన్ పరిధిలోని కీలక మున్సిపాలిటీల్లో వెంటనే పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు.



పల్లవిని అభినందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏఐలో సత్తా చాటిన పల్లవికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్కారం

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన తాళ్లూరి పల్లవిని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సత్కరించారు. పల్లవిని విద్యార్థులందరూ స్ఫూర్తిగా తీసుకుని బాగా చదవాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవలే ప్రధాని మోదీ చేతుల మీదుగా పల్లవి అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. బుధవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసిన పల్లవి తల్లిదండ్రులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి.. కష్టాలు ఎదురైనా పట్టుదలతో కుమార్తెను చదివించారన్నారు.

ఎఫ్‌ఎస్ఎల్ నివేదిక సమర్పణకు సమయమివ్వండి

'ట్యాపింగ్' కేసులో సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కారు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదిక సమర్పించేందుకు సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం విన్నవించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ద్విసభ్య ధర్మాసనం.. కేసు విచారణను వాయిదా వేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, దీనిలో అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ప్రధాన నిందితుడని 2023లో కేసు నమోదైంది. ఈ క్రమంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ ఇస్తేనే భారతదేశానికి తిరిగొస్తానని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయస్థానం తిరస్కరించింది. ఈ తీర్పును ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ (ఇంటరిమ్ ప్రొటెక్షన్) కల్పించడంతో ఆయన దేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పిటిషన్ మరోసారి బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తెలంగాణ సర్కారు తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదించగా.. ప్రభాకర్ రావు తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు హాజరయ్యారు. అయితే, ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఎఫ్ఎస్ఎల్ నివేదిక వచ్చిందని, దాన్ని సమర్పించేందుకు వారం సమయం ఇవ్వాలని సర్కారు తరపు న్యాయవాదులు కోరడంతో కేసును ధర్మాసనం 14వ తేదీకి వాయిదా వేసింది.

భక్తులకు అందుబాటులో టీటీడీ 2026 డైరీలు, క్యాలెండర్లు

తిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): 2026 టీటీడీ డైరీలు, క్యాలెండర్లు గురువారం నుంచి భక్తులకు లభిస్తాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్టణం, విజయవాడ సహా అనేక ప్రాంతాల్లో వీటిని భక్తులకు అందుబాటులో ఉంచారు. 12 పేజీల పెద్ద క్యాలెండర్, 6 పేజీలు క్యాలెండర్, టేబుల్-టాప్ క్యాలెండర్లు, డీలక్స్ డైరీలు, చిన్న డైరీలు, శ్రీవేంకటేశ్వస్వామి, అమ్మవారి పెద్ద, చిన్న క్యాలెండర్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. టీటీడీ ఆలయాలు, పలు కళ్యాణమండపాల వద్ద ఇవి లభిస్తాయి. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'తిరుమల.ఓఆర్జీ', 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవీవీ.ఇన్' ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చు.

పెదవి విప్పని ఏడీఈ అంబేడ్కర్!

» ఏసీబీ అధికారుల విచారణలో సహకరించని వైనం

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పట్టుబడిన విద్యుత్ శాఖ ఏడీఈ అంబేడ్కర్ కస్టడీలో ఏసీబీ అధికారులకు చుక్కలు చూపుతున్నట్టు తెలుస్తోంది. గత నెలలో అంబేడ్కర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు అంబేడ్కర్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించడానికి ఏసీబీ న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ క్రమంలో సోమవారం అంబేడ్కర్‌ను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఆయన బినామీల గురించి ప్రశ్నించినట్టు తెలుస్తోంది. అయితే అధికారులు అడిగిన ఏ ప్రశ్నకు అంబేడ్కర్ నుంచి సమాధానాలు రావడం లేదని, బినామీల విషయంలో ఆయన పెదవి విప్పడంలేదని ఏసీబీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక అంబేడ్కర్ ఆస్తుల్లో కీలకమైన బ్యాంకు లాకర్లకు సంబంధించి గురువారం ఆయనను తీసుకెళ్లి రెండు బ్యాంకుల్లో ఉన్న లాకర్లను తెరిపించబోతున్నట్టు తెలుస్తోంది. అంబేడ్కర్ పెదవివిప్పితే బినామీలతో పాటు ఆయనకు సహకరించిన కొందరు అధికారుల పాత్ర వెల్లడయ్యే అవకాశాలున్నాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.

వైద్యశాఖలో లీగల్ నోటీసుల కలకలం!

» డిప్యూటేషన్ పేరిట డబ్బులు వసూల్

» డీహెచ్ ఆఫీసు అధికారిపై మహిళా ఉద్యోగి ఫిర్యాదు

» ఆరోగ్య శాఖ మంత్రి, అధికారులకు నోటీసులు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయంలో ఓ అధికారి డిప్యూటేషన్ ఇప్పిస్తానంటూ లంచం తీసుకుని, ఆర్డర్ ఇప్పించకపోగా, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఓ జూనియర్ అసిస్టెంట్ తన లాయర్ ద్వారా లీగల్ నోటీసులు పంపడం వైద్యఆరోగ్యశాఖలో కలకలం రేపింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు లీగల్ నోటీసులు పంపారు. గతేడాది జూలై 5న సదరు అధికారి పర్సనల్ నంబరుకు రూ.50వేలు గూగుల్‌పే చేసినట్లు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. డిప్యూటేషన్ కావాలంటే తన కోరికలు తీర్చాలంటూ వాట్సప్ మేసేజ్‌లు చేశాడని, డీహెచ్ కార్యాలయానికి వెళ్లి అడిగితే తాకరాని చోట్ల తాకడం, అసభ్యంగా ప్రవర్తించేవాడని అందులో వెల్లడించారు. తక్షణమే సదరు అధికారిని సస్పెండ్ చేయాలని, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కింద కేసు బుక్ చేయాలని, దీనిపై ఉన్నతస్థాయి స్వతంత్ర కమిటీ వేసి విచారణ జరిపించాలని అందులో కోరారు. మరోవైపు లీగల్ నోటీసులో పేర్కొన్న జూనియర్ అసిస్టెంట్ ఎవరూ తమ విభాగపు పరిధిలో పనిజేయడం లేదని డీహెచ్ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. నోటీసుల్లో పేర్కొన్న అంశాలపై లోతుగా విచారణ జరుపుతున్నట్లు కార్యాలయపు అధికారి ఒకరు వెల్లడించారు.

13 ఏళ్ల బాలికకు 34 ఏళ్ల వ్యక్తితో వివాహం

» మెదక్ జిల్లాలో ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు

నర్సాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పదమూడేళ్ల బాలికకు 34 ఏళ్ల వ్యక్తితో వివాహం చేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీడీపీవో హేమభార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో చిలప్‌చెడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు.. 34 ఏళ్ల వ్యక్తితో బంధువులు ఇటీవల వివాహం జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న మహిళా శిశు సంక్షేమ అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు వరుడితో పాటు, వీరి పెళ్లికి మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందని తెలిస్తే 1098కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మరో 2 దగ్గు మందులపై నిషేధం

» రీలైఫ్, రెస్పిఫ్రెష్ బ్యాన్.. వాటిలో కల్తీ జరిగినట్లు నిర్ధారణ

» తక్షణమే అమ్మకాలు ఆపాలి: డీసీఏ

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మరో రెండు దగ్గు మందులపై ఔషధ నియంత్రణ మండలి నిషేధం విధించింది. గుజరాత్‌కు చెందిన షేప్ ఫార్మా కంపెనీ తయారుచేసిన రీలైఫ్(బ్యాచ్ నంబరు ఎల్ఎస్ఎల్25160, ఎక్స్‌పైరీ తేదీ 12.2026) అదే రాష్ట్రానికి చెందిన రెడ్‌నెక్స్ ఫార్మాస్యూటికల్ తయారుచేసిన రెస్పిఫ్రెష్(బ్యాచ్ నంబరు ఆర్01జీఎల్ 2523, ఎక్స్‌పైరీ తేదీ 12.2026) అనే దగ్గు మందుల్లో కల్తీ జరిగిందని మధ్యప్రదేశ్ ఔషధ పరీక్ష ల్యాబరేటరీ తేల్చింది. వాటిలో డైథిలీన్ గ్లైకాల్ పెద్ద మొత్తంలో కలిసిందని నివేదికలో పేర్కొంది. అదే విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలికి తెలియజేసింది. దీంతో రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అప్రమత్తం అయింది. తెలంగాణలో ఆ రెండు బ్రాండ్ల దగ్గు మందును తక్షణమే నిషేధిస్తున్నట్లు తెలంగాణ డీసీఏ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ రెండు దగ్గు మందుల వాడకాన్ని తక్షణం నిలిపివేయాలని కోరారు. ఒకవేళ ఎవరి దగ్గరైనా ఈ మందులున్నట్లయితే వెంటనే సమీప డ్రగ్ కంట్రోల్ అధికారులకు తెలియజేయాలని కోరారు. దీంతో పాటు 18005996969 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీపావళిలోపు రూ.300 కోట్ల విడుదలకు హామీ

» ప్రైవేటు కాలేజీల సమ్మె వాయిదా.. విడుదల చేయకుంటే 23 నుంచి సమ్మె

» ప్రకటించిన యాజమాన్య సంఘాల సమాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13వ తేదీ నుంచి సమ్మె చేస్తామని ప్రకటించిన ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘాల సమాఖ్య(ఫాతీ) దాన్ని వాయిదా వేసింది. దీపావళిలోపు రూ. 300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయించేందుకు కృషి చేస్తానని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇచ్చిన హామీతో సమ్మె వాయిదా వేశామని ఫాతీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22లోపు బకాయిలు విడుదల చేయకుంటే 23 నుంచి సమ్మె చేస్తామని ఫాతీ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్ బాబు తెలిపారు. సమ్మె వాయిదా గురించి బుధవారం నిర్వహించిన అత్యవసర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దసరాలోపు ప్రభుత్వం విడుదల చేసిన రూ. 200 కోట్లలో రాష్ట్రంలోని 72 మైనార్టీ కళాశాలలకు ఒక్క పైసా కూడా బకాయిలు చెల్లించలేదని, వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

షాడో కలెక్టర్‌గా జడ్పీ సీఈవో!

వరంగల్ కలెక్టరేట్‌లో పెత్తనం చెలాయింపు.. స్వయంగా అధికారాలు కల్పించిన కలెక్టర్

పలు శాఖల ఫైళ్లను ముందుగా సీఈవో పరిశీలించాకే తనకు పంపాలని ఉత్తర్వులు

మంత్రి పొంగులేటి ఆదేశాలూ బేఖాతరు

సీఈవో పెత్తనంపై అధికారుల గుర్రు

కలెక్టర్ ఉత్తర్వులపై సీఎ్‌సకు ఫిర్యాదు

వరంగల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా పరిషత్‌కు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన జడ్పీ సీఈవో.. కలెక్టరేట్‌లో చక్రం తిప్పుతున్నారు. తనకు సంబంధంలేని శాఖల ఫైళ్లన్నింటినీ పర్యవేక్షిస్తున్నారు. ఏ శాఖ ఫైలు అయినా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లాలంటే ముందుగా జడ్పీ సీఈవో ఆమోదం పొందాల్సిందే. ఆయన కాదంటే ఆగిపోవాల్సిందే. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ పరిస్థితి నెలకొంది. పైగా, జడ్పీ సీఈవోకు ఈ అధికారాలను స్వయంగా జిల్లా కలెక్టరే కల్పించడం వివాదాస్పదంగా మారింది. వివిధ శాఖల నుంచి వచ్చే ఫైళ్లను జడ్పీ సీఈవో పరిశీలన తరువాతే తన వద్ద తీసుకురావాలంటూ జిల్లా కలెక్టర్ సత్యశారద ఈ ఏడాది జనవరి 18న ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసమంటూ ఈ ఉత్తుర్వులిచ్చిన కలెక్టర్.. అందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), జిల్లా పంచాయతీ కార్యాలయ ఫైళ్ల ప్రాసెసింగ్‌ను జడ్పీ సీఈవో ద్వారా చేయాలని పేర్కొన్నారు. దీంతో డీపీవో, డీఆర్‌డీఏకు చెందిన ఏ పని కావాలన్నా ఆ శాఖల ఉద్యోగులు జడ్పీ సీఈవో రాంరెడ్డిని కలవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవేకాకుండా సంక్షేమశాఖ, విద్యాశాఖ ఫైళ్లు కూడా సీఈవో టేబుల్‌పైకి వెళ్లాకే కలెక్టర్ వద్దకు చేరుతున్నాయనే చర్చ జరుగుతోంది. పలు శాఖలకు సంబంధించి జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న సమీక్షలకు, జిల్లాలో కలెక్టర్ చేపడుతున్న తనిఖీలకు కూడా జడ్పీ సీఈవో హాజరవుతున్నారు. దీంతో ఈ పరిణామాలను ఇతర అధికారులు, ఉద్యోగులు తప్పుబడుతున్నారు.



PROCEEDINGS OF THE COLLECTOR, WARANGAL
PRESENT: Dr. SATYA SHARADA, I.A.S.,

Rc.No.1/63/2025 Date: 18.01.2025

Sub: - File Processing - Warangal District - Smooth functioning of District Administration processing of files of District Rural Development Authority and District Panchayat Office of Warangal through the CEO, ZPP, Warangal - Orders issued - Reg.

Read: - Instructions of the District Collector, Warangal, dated: 07.01.2025.

ORDER:

With reference to the subject and the instructions issued, it is hereby directed that the files of the District Rural Development Officer Cum PD, DRDA, Warangal and District Panchayat Office (DPO) of Warangal District should be processed through the CEO of Zilla Praja Parishad (ZPP), Warangal.

In view of ensuring efficient functioning of the District Administration and to facilitate administrative feasibility, the District Rural Development Officer Cum PD, DRDA, Warangal and the District Panchayat Officer, Warangal are instructed to process the files of both the DRDA and DPO through the Chief Executive Officer, Zilla Praja Parishad, Warangal.

Sd/- Satya Sharada
DISTRICT COLLECTOR
WARANGAL

Copy to the CEO, ZPP, Warangal for information and necessary action.
Copy to the DRDO Cum PD, DRDA Warangal for information and necessary action.
Copy to the DPO, Warangal for information and necessary action.
Copy to the CC to Collector/ Additional Collector (Revenue).

// Attested //
Superintendent
(Tahsildar Cadre)

జడ్పీ సీఈవో ద్వారా ఫైళ్లు తన వద్దకు రావాలంటూ వరంగల్ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

సంబంధం లేని శాఖల్లో పెత్తనం..

ఒక శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారి తనకు సంబంధం లేని మరో శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారి వద్దకు ఫైళ్లు తీసుకెళ్లాల్సిరావడం ఏమిటని ఇతర అధికారులు ప్రశ్నిస్తున్నారు. జడ్పీ సీఈవో రాంరెడ్డి గతంలో జనగామ డీఆర్‌డీఏగా పని చేశారు. కాగా, వరంగల్ డీఆర్‌డీఏగా పనిచేసిన కౌసల్యాదేవి కన్నా ఆయన జూనియర్. దీంతో తన కన్నా జూనియర్ వద్దకు ఫైళ్లు తీసుకెళ్లడమేంటని కౌసల్యాదేవి ప్రశ్నించడంతో ఆమెపై పైఅధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చి బదిలీ చేయించారనే ఆరోపణలున్నాయి. ఖాళీ అయిన ఆ స్థానంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జిగా రాంరెడ్డినే కలెక్టర్ నియమించారు. ఇక కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులతో జడ్పీ సీఈవో తన పరిధిని మించి అన్ని శాఖల్లో జోక్యం చేసుకుంటూ షాడో కలెక్టర్‌గా మారారనే ప్రచారం జరుగుతోంది. ఏకంగా వైద్యశాఖపై కలెక్టరేట్‌లో సీఈవో సమీక్ష నిర్వహించారు. విద్యాశాఖ, రెవెన్యూ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ.. ఇలా అన్ని శాఖల ఫైళ్లకూ తొలుత సీఈవో వద్ద ఆమోదముద్ర వేయించుకున్నాకే.. కలెక్టర్ వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని అధికారులు వాపోతున్నారు. గ్రీవెన్స్‌లో వచ్చే ఫైళ్లను సైతం సీఈవో అనుమతి ఉంటేనే పరిష్కరిస్తున్నారని చెబుతున్నారు.

ఇదిలా ఉండగా.. ధరణిలో జరిగిన తప్పులను పరిష్కరించాలంటూ వస్తున్న బాధితులకు గేటు వద్దే సీఈవో చెక్ పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించినా కలెక్టరేట్‌లో ఫైల్ ముందుకు కదలడం లేదని చెబుతున్నారు. దేశాయిపేటకు చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి వివాదాన్ని పరిశీలించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించగా.. సీఈవో అనుమతి లేనందునే పరిష్కారం కాలేదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై పలువురు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఫిర్యాదు చేసినట్లు, దీంతో జడ్పీ సీఈవోకు లేని అధికారాలు కల్పించిన కలెక్టర్‌ను సీఎస్‌ను మందలించినట్లు తెలిసింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టుకు శ్రీధర్ రావు

» ప్రభాకర్ రావుకు బెయిల్ అర్హత లేదు

» దురుద్దేశంతో క్రిమినల్ నేరారోపణలు మోపి వేధించారు

» పిటిషన్‌లో పేర్కొన్న బాధితుడు శ్రీధర్‌రావు

న్యూఢిల్లీ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై అనేక దారుణాలకు పాల్పడ్డారని బాధితుడు ఎస్.శ్రీధర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైటెక్ సిటీలోని పెట్రోల్ పంపునకు సంబంధించి టీవీ యాంకర్ సాంబశివరావుతో ఉన్న వివాదాల్లో జోక్యం చేసుకుని తనను నిర్బంధించి రూ. 15 కోట్లు బలవంతంగా వసూలు చేశారని తన పిటిషన్‌లో శ్రీధర్‌రావు తెలిపారు. రూ.15 కోట్లలో రూ.13 కోట్లు బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసేందుకు ఉపయోగించగా, మిగతా రూ. 2 కోట్లను టీవీ యాంకర్ సాంబశివరావు తన వద్ద ఉంచుకున్నారని వివరించారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు బంధువైన రవీందర్ రావుతో ఉన్న వివాదాల మూలంగా ఎస్ఐబీ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ ద్వారా మాజీ డీఎస్పీ ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో తనపై నిరంతర నిఘా వేసి ఫోన్లు ట్యాప్ చేశారని ఆయన తెలిపారు. డబ్బులు చెల్లించినప్పటికీ ప్రభాకర్‌రావు పలుకుబడి మూలంగా తనపై క్రిమినల్ చర్యలు కొనసాగించారని, ఇందుకు బీఆర్ఎస్ నేతల ఒత్తిడి కూడా కారణమని పేర్కొన్నారు. ఎస్ఐబీ చీఫ్‌గా వందలాది వ్యక్తుల వివరాలు అక్రమంగా సేకరించారని, అధికార పార్టీకి సహాయపడేందుకు టెలిఫోన్ సంభాషణలను అడ్డుకుని సమాచారం సేకరించారని, అందులో తన ఫోన్ కూడా ఉందని శ్రీధర్ రావు తన పిటిషన్‌లో వివరించారు. డబ్బులు ముట్టచెప్పినప్పటికీ తనపై దురుద్దేశంగా క్రిమినల్ నేరారోపణలు మోపి వేధించారని, మరింత మొత్తం చెల్లించడానికి ఒప్పుకోకపోతే 2021 నవంబర్ 9 నుంచి 18 వరకు వివిధ పోలీస్ స్టేషన్లలో 11 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. తనకు హైకోర్టు మధ్యంతర రక్షణ కల్పించినప్పటికీ చిక్కబల్లాపూర్ వద్ద బెంగళూరు-హైదరాబాద్ హైవేపై అరెస్టు చేశారని చెప్పారు. ఆరోపణల తీవ్రత రీత్యా ప్రభాకర్ రావుకు బెయిల్ లభించేందుకు ఏ మాత్రం అర్హత లేదని ఆయన వాదించారు.



టాస్క్‌ల పేరిట ఎర... ఐటీ ఉద్యోగికి 54 లక్షల టోకరా

» బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమీషన్ అంటూ మాయ

» సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య అభ్యసించి ప్రముఖ సంస్థలో పని చేస్తున్న ఓ ఐటీ ఉద్యోగి అదనపు ఆదాయానికి ఆశపడి సైబర్ నేరగాళ్ల మాయకు బలయ్యాడు. బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామంటూ ఎర వేసి టాస్క్‌ల పేరిట ఓ సైబర్ నేరా ముఠా ఆడిన ఆటకు ఏకంగా రూ.54 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. హెచ్‌సీఎల్ సంస్థలో ఐటీ ఉద్యోగి అయిన బాధితుడు పటాన్‌చెరు ప్రాంతంలో నివాసముంటున్నాడు. సదరు ఐటీ ఉద్యోగి వాట్సాప్‌కు సెప్టెంబరు19న గుర్తు తెలియని ఓ నెంబర్‌ను మెసేజ్ వచ్చింది. తాము పంపిన ఆన్‌లైన్ లింక్ ఓపెన్ చేసి అందులోని బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే ఆ టాస్క్‌లకు బదులుగా పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామని ఆ మెసేజ్ సారాంశం. దీంతో బీ-ఏజియోమాల్ టాస్క్-653 పేరిట ఆ మెసేజ్‌లో ఉన్న టెలీగ్రామ్ లింక్‌ను బాధితుడు క్లిక్ చేసి అందులో చేరాడు. అందులో సూచించిన రెండు టాస్క్‌లు పూర్తి చేశాడు. ఆ వెంటనే బాధితుడి బ్యాంకు ఖాతాలో రూ.5వేలు జమ అయ్యాయి. దీంతో అత్యాశకు లోనైన బాధితుడు మరిన్ని టాస్క్‌లు చేసేందుకు సిద్ధమవ్వగా.. టాస్క్‌లు కొనుగోలు చేయాలని సైబర్ మాయగాళ్లు బదులిచ్చారు. దీంతో తొలుత రెండు టాస్క్‌ల కొనుగోలుకు బాధితుడు పేటీఎమ్ ద్వారా రూ.12,500 చెల్లించాడు. ఆ టాస్క్‌లకు సంబంధించిన ఆదాయం ఖాతాలో కనిపిస్తుండడంతో నమ్మిన బాధితుడు టాస్క్‌ల కొనుగోలు పేరిట విడతల వారీగా రూ.7,14,180 సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా ఆన్‌లైన్‌లో బదిలీ చేశాడు. ఆపై, క్రెడిట్ స్కోర్ కోసం రూ. 5లక్షలు, అదనపు కమీషన్ కోసం వీఐపీ చానల్ తెరిచేందుకు రూ.6లక్షలు, నగదు విత్‌డ్రాకు మరో రూ.12లక్షలు ఇలా మొత్తంగా బాధితుడు రూ.54,67,488లు సైబర్ ముఠాకు చెల్లించాడు. ఈ మొత్తం లాభంతో కలిపి రూ.70లక్షలు అని ఖాతాలో చూపిస్తుండగా వాటిని విత్‌డ్రా చేసుకునేందుకు బాధితుడు ప్రయత్నించగా.. విత్‌డ్రా చేయాలంటే మరో రూ.8లక్షలు చెల్లించాలని సైబర్ ముఠా బదులు ఇచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సాయం కోసం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కాగా, సులువుగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో సైబర్ ముఠాల మాయలో పడవద్దని ప్రజలకు పటాన్‌చెరు సీఐ రాజు సూచించారు.

జైళ్లలో నిఘా లోపం!

ఖైదీలు పారిపోతున్నా కనిపెట్టలేకపోతున్నారు

» సీసీ కెమెరాలున్నా నిరుపయోగం

» కంట్రోల్ రూంలో సరిపోను మానిటర్లూ లేవు

» పెట్రోల్ బంకులు, ఔటలెట్‌లల్లో పనిచేసేవారిపై నిఘా కరువు

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరుడుగట్టిన నేరగాళ్లు, సంఘ విద్రోహులు రిమాండ్ ఖైదీలుగా ఉండే జైళ్లలో నిఘా వ్యవస పటిష్ఠంగా ఉండాలి. నేరస్థుల ప్రతి కదలికను గమనించేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలి. కానీ రాష్ట్ర జైళ్లల్లో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. నిఘాలోపాన్ని ఆసరాగా చేసుకుని ఖైదీలు జైళ్ల నుంచి తప్పించుకుని పారిపోవడం, పారిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇటీవల చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి ఓ ఖైదీ పట్టపగలు జైలు సిబ్బంది కళ్లుగప్పి జైలు గోడ దూకి తప్పించుకుని పారిపోయాడు. జైలుకు వచ్చిన కేవలం రోజుల వ్యవధిలోనే భద్రతా లోపాలు, లోటుపాట్లు గుర్తించిన ఖైదీ పరిస్థితులు అనుకూలంగా మార్చుకుని తప్పించుకున్నాడు. ఖైదీ పారిపోయిన విషయం తీరిగ్గా గుర్తించిన జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పారిపోయిన ఖైదీని వెతికి పట్టుకొచ్చారు. ఈ ఘటన జరిగిన రోజుల వ్యవధిలోనే అదే జైల్లో మరో ఖైదీ కనిపించకుండా పోవడం జైలు అధికారుల్ని ఉరుకులు పరుగులు పెట్టించింది. అయితే జైలు ఆవరణ మొత్తం వెతికే క్రమంలో నిరుపయోగంగా ఉన్న ఓ భవనంలో ఖైదీ తీరిగ్గా పడుకుని ఉండటం గుర్తించి అంతా ఊపిరి పీల్చుకున్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఇలాంటి వరుస ఘటనలు కేవలం అక్కడి భద్రతనే కాదు.. రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరు కూడా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా నిఘా లోపాన్ని ఆసరాగా చేసుకుని ఖైదీలు తప్పించుకుని పారిపోవడం కొత్తేమీ కాదు. గతంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ జైలు నుంచి రాజేశ్ అనే ఖైదీ తప్పించుకుని పారిపోయాడు. అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న రాజేశ్ జైలు ఆవరణలో పనిచేస్తున్న సమయంలో జైలు సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకునిపారిపోయాడు. మరో ఘటనలో వరంగల్ జిల్లాలోని పరకాల సబ్ జైలు నుంచి పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న మహమ్మద్ పాషా తప్పించుకున్నాడు. నిఘా లోపం, సిబ్బంది నిర్లక్ష్యాన్ని గుర్తించిన పాషా జైలు ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని చెత్త బయట పడేసే నెపంతో తప్పించుకుని పారిపోయాడు.

సీసీ కెమెరాల నిర్వహణ కరువు!

జైళ్లల్లో సీసీ కెమెరాలు కేవలం అలంకారప్రాయంగా మారాయి. చర్లపల్లి కేంద్ర కారాగారంలో సుమారు 200లకుపైగా సీసీ కెమెరాలు ఉన్నట్లు సమాచారం. వాటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినా.. కేవలం 9 మానిటర్లు మాత్రమే ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. కంట్రోల్ రూంలో సిబ్బందికి సైతం సాంకేతికంగా పెద్దగా పరిజ్ఞానం లేకపోవడంతో అక్కడ అలంకారప్రాయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఖైదీ పారిపోయిన సమయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ లోపం బయటపడింది. ఒక్క చర్లపల్లిలోనే కాదు.. అన్ని కేంద్ర, జిల్లా కారాగారాల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. సీసీ కెమెరాలు అమర్చిన ఏజెన్సీల గడువు ముగియడంతో వారు నిర్వహణ పట్టించుకోవడం లేదు. మరోవైపు.. తెలంగాణ జైళ్ల శాఖ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో హైదరాబాద్‌తోపాటు మరికొన్ని జిల్లాల్లోనూ పెట్రోల్ బంకులను నిర్వహిస్తోంది. జైళ్లల్లో ఖైదీలు తయారు చేసే వస్తువుల్ని 'మై నేషన్' బ్రాండ్‌తో జైళ్ల వద్ద ఔట్ లెట్‌లల్లో విక్రయిస్తున్నారు. పెట్రోల్ బంకులు, ఔట్‌లెట్‌లల్లోనూ ఖైదీలతో పనిచేయిస్తుంటారు. ఖైదీలు పనిచేసేటప్పుడు, షిఫ్టులు మారే సమయంలో సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకుని పారిపోయే అవకాశం లేకపోలేదు.

సిబ్బంది కేటాయింపుల్లోనూ అసమానతలు

రాష్ట్రవ్యాప్తంగా జైళ్లల్లో సిబ్బంది కేటాయింపుల్లో తీవ్ర అసమానతలు ఉన్నాయి. చర్లపల్లి కేంద్ర కారాగారంలో 140 మంది సిబ్బంది ఉండాలి.. కానీ అక్కడ సగానికిపైగా ఖాళీలు ఉన్నాయి. కరీంనగర్ జైల్లో 300 మంది ఖైదీలు ఉంటే 70 మంది వరకు సిబ్బంది ఉన్నారు. సంగారెడ్డి, నిజామాబాద్ కేంద్ర కారాగారాల్లోనూ సరిపడ సిబ్బంది లేరు. వరంగల్ జైలుకు సంబంధించి 60 మందికిపైగా సిబ్బంది అవసరం కాగా కేవలం 20 మంది వరకే ఉన్నట్లు సమాచారం. నల్లగొండ, భువనగిరి జైళ్లల్లోనూ పది మందికిపైగా సిబ్బంది అవసరం కాగా కేవలం 5, 6 మంది మాత్రమే ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్ర, జిల్లా కారాగారాల్లో సిబ్బంది కేటాయింపులు సరిగా లేకపోవడంతో ఒక జైల్లో పరిమితికి మించి ఉంటే.. మరో జైల్లో అవసరమైన దానికంటే సగం మందే అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

కమీషన్లకు ఆశపడి కోట్లు వసూలు చేసిన ఏజెంట్ మృతి

పెద్దఅడిశర్లపల్లి/నేరేడుచర్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కమీషన్లు, నజరానాలకు ఆశపడి ఓ వ్యాపారికి ఏజెంట్‌గా మారి రూ.కోట్లలో డబ్బు వసూళ్లు చేసి మోసపోయి ఆత్మహత్యాయత్నం చేసిన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన రమావత్ సరియానాయక్ (37) చికిత్స పొందుతూ మరణించాడు. వివరాలిలా ఉన్నాయి. పలుగుతండాకే చెందిన రమావత్ బాలాజీనాయక్ అధిక వడ్డీ ఆశ చూపి ఏజెంట్ల సాయంతో ప్రజల నుంచి రూ.కోట్లలో డబ్బు వసూలు చేశాడు. తనకు డబ్బు ఇచ్చిన వారికి బాలాజీ నాయక్ 10 శాతం వడ్డీ ఇచ్చేవాడు. నగదు సేకరణకు ఏజెంట్లుగా వ్యవహరించిన వారికి 6 శాతం కమీషన్ ఇచ్చేవాడు. ఇదే కాక, రూ.కోటీకి పైగా పెట్టుబడులు తెచ్చిన ఏజెంట్లకు రూ.లక్షల విలువైన బైక్, రూ.2కోట్లకు పైగా తెచ్చిన ఏజెంట్లకు కారు నజరానాలు ప్రకటించాడు. బాలాజీ బంధువు కావడంతోపాటు అతడు ప్రకటించిన కమీషన్లు, నజరానాలకు ఆశపడి సరియానాయక్ తనకు తెలిసిన వాళ్ల నుంచి రూ.కోటి దాకా వసూలు చేసి ఇచ్చాడు. తొలుత వడ్డీలు సక్రమంగా ఇచ్చిన బాలాజీనాయక్ మూడు నెలలుగా వడ్డీలు ఇవ్వకపోగా 15 రోజులుగా అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన సరియా నాయక్ నాలుగు రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. సరియానాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సరియానాయక్ ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసి అతని బంధువులు, గ్రామ ప్రజలు కొందరు బాలాజీనాయక్ ఇంటిపై మంగళవారం దాడి చేసి వస్తువులను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. ఇక, సరియానాయక్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారనే సమాచారంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోపక్క, ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుతో బాలాజీనాయక్ తన సోదరి పేరుతో ఇళ్లు కొనుగోలు చేశాడన్న సమాచారంతో బాధితులు కొందరు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని బాలాజీ నాయక్ సోదరి ఇంటిపై దాడి చేసేందుకు బుధవారం యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.